విలేఖరులు కావలెను.

జనశక్తి

సామాజిక స్పృహతో, అవినీతి అక్రమాలను వెలికితీసే ధైర్యం, ప్రజాసమస్యలను నిర్భయంగా రాసే వారికి తెలుగుజనశక్తి దిన పత్రిక అవకాశం కల్పిస్తుంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్‌లు, నియోజక వర్గాల వారిగా ఆర్సి ఇన్‌చార్జిలు, మండలాల వారిగా రిపోర్టర్‌లు కావలెను.

సెల్: 6302660543/9550501033



RNI : TELTEL/2024/89275

తెలుగు
# జనశక్తి

Published From Adilabad, Hyderabad, Khammam, Karimnagar, MahabubNagar, Medak, Nalgonda, Nizamabad, Rangareddy, Kamareddy, Warangal

హైదరాబాద్ | శనివారం | 26.04.2025 | సంపుటి : 02 | సంచిక : 112 | వెల : 4/-




హైదరాబాద్‌కు మూడో విజయం

11

## బందిపొరాలో ఎన్‌కౌంటర్

### లష్కరే టాప్ కమాండర్ హతం..

జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర మూకలపై భద్రతా దళాలు తుపాకులు గర్జిస్తున్నాయి. తాజాగా లష్కరే టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీని మట్టుబెట్టాయి. పహల్గాం దాడిలో పాల్గొన్న వారి కోసం జల్లెడపడుతున్న భద్రతా దళాలకు బందీపొరాలో అల్తాఫ్ ఆచూకీ తెలిసింది. శుక్రవారం ఉదయం ఆర్మీ–పోలీసు దళాలు జాయింట్ ఆపరేషన్ చేపట్టాయి. ఈక్రమంలో ఉగ్రవాదులను గుర్తించడంతో ఎన్‌కౌంటర్ మొదలైంది. తొలుత ఓ ఉగ్రవాది గాయపడ్డాడు. ఆ తర్వాత భద్రతా దళాల్లోని అధికారి బాడీగార్డులకు తూటాలు తాకా యి. ఈక్రమంలో అల్తాఫ్‌ను మట్టుబెట్టాయి. ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది కశ్మీర్‌లో అడుగుపెట్టిన వేళ ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకోవడం గమనార్హం.



04

## సంయమనం పాటించండి

### భారత్, పాక్‌లకు ఐక్యరాజ్యసమితి సూచన

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన భీకర ఉగ్రదాడి ఘటనను భారత్ సహా ప్రపంచం తీవ్రంగా ఖండిస్తోంది. ఈ ఆందోళనకర పరిస్థితిని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ నిశితంగా పరిశీలిస్తున్నారని ఐరాస అధికార ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ పేర్కొన్నారు. భారత్–పాక్ దేశాలు సంయమనం పాటించాలని కోరుతున్నాం. ఇరుదేశాల మధ్య ఏదైనా సమస్య ఉంటే శాంతియుత చర్చలతో వాటిని పరిష్కరించుకుంటారని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు.



04



02

పత్తి కొనుగోళ్లలో అక్రమాలపై..

### విజిలెన్స్ నివేదికలో జాప్యమెందుకు?

మార్కెటింగ్ అధికారులపై మంత్రి తుమ్మల ఆగ్రహం



03

ధాన్యం కొనుగోలులో

### తీవ్ర నిర్లక్ష్యం

- మద్దతు ధరలు రాక దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన హరీష్ రావు



స్వాతంత్ర్య సమరయోధులను

### అపహాస్యం చేయొద్దు

రాహుల్‌కు సుప్రీం మందలింపు

04




04

### నీట్ పేపర్ లీకేజీ కేసు..

ప్రధాన నిందితుడి అరెస్టు



## అభివృద్ధి, సంక్షేమాన్ని

# ప్రపంచానికి చాటిచెప్పాం

- భారత్ సమ్మిట్‌లో తెలంగాణకు పెట్టుబడులను ఆహ్వానించాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- సందడిగా భారత్ సమ్మిట్
- 400 మంది విదేశీ ప్రతినిధుల హాజరు
- పహల్గాం దుర్ఘటన నేపథ్యంలో రాహుల్‌గాంధీ, ఖర్గే దూరం
- నేటి ముగింపు సమావేశానికి ప్రియాంకాగాంధీ, రేవంత్‌రెడ్డి

తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని భారత్ సమ్మిట్ వేదికగా ప్రపంచానికి చాటిచెప్పామంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లో 'భారత్ సమ్మిట్–2025' పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన అంతర్జాతీయ రాజకీయ సదస్సు శుక్రవారం హైటెక్స్‌లోని నోవాటెల్‌లో ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు తొలిరోజు వందకుపైగా దేశాల నుంచి 400 మందికిపైగా ప్రతినిధులు హాజరైనట్లు పీసీసీ వర్గాలు తెలిపాయి.

**హైదరాబాద్, ఏప్రిల్ 25 :**
శుక్రవారం నోవాటెల్ హొటల్ భారత్ సమ్మిట్–2025లో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్‌ఖుర్షీద్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, భారత్ సమ్మిట్ కన్వీనర్ పుష్పరాజ్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, రాంమోహన్‌రెడ్డి తదితరులతో కలిసి మీడియాతో భట్టి మాట్లాడుతూ... "ఈ సదస్సు ద్వారా తెలంగాణకు పెట్టుబడులు ఆహ్వానించాం. గతంలో ప్రపంచం మొత్తం రెండు కూటములుగా విడిపోయినప్పుడు నాటి ప్రధాని నెహ్రూ అలీన విధానంతో దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, రాజకీయ,

మిగతా 2 లో

## పహల్గాం ఉగ్రదాడి

# హేయమైన చర్య



- మరోసారి పాక్‌ను ఓడించాలి
- ప్రధాని మోదీ... ఇందిరను ఆదర్శంగా తీసుకోవాలి
- సీఎం రేవంత్‌రెడ్డి
- పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ

పహల్గాంలో పర్యాటకులపై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిని ఖండిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకొని మరోసారి పాకిస్థాన్‌ని ఓడించాలని, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ని భారత్‌లో కలపాలని ప్రధాని మోదీకి సూచించారు. ఉగ్రవాదుల దాడిలో మరణించినవారికి నివాళిగా, బాధితులకు సంతాప సూచకంగా హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు.

**హైదరాబాద్, ఏప్రిల్ 25 :**
'ఇది భావోద్వేగమైన సందర్భం. దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తున్నా' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భారత్.. ప్రశాంతంగా అభివృద్ధి పథంలో వెళ్తుండటాన్ని జీర్ణించుకోలేక దేశంలోకి చొచ్చుకుని వచ్చి పర్యాటకుల ప్రాణాలు తీయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. రాజకీయాలకు, పార్టీల సిద్ధాంతాలకు అతీతంగా అంతా ఏకమై ఉగ్రవాదంపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ విషయంలో

మిగతా 2 లో



# నాణ్యత పరీక్షలు లేవు..

## థర్డ్ పార్టీ ఆడిట్ జరగలేదు

- నిర్మాణ ప్రాంతాలు మార్చేశారు..
- కాళేశ్వరం డిజైన్ల నుంచి నిర్వహణ వరకు ఎన్నో లోపాలు
- ఎన్డీఎస్ఏ నివేదికలో మరికొన్ని కీలక విషయాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 25 :**
కాళేశ్వరం భారీ ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో హైపవర్ కమిటీ నిర్ణయాలతో అనేక మార్పులు చేశారని ఎన్డీఎస్ఏ నివేదికలో పేర్కొంది. ఈ బ్యారేజీలను రెండేళ్లలోనే పూర్తిచేయాలన్న లక్ష్యం పెట్టుకోవడంపై ప్రత్యేకంగా ప్రస్తావించింది. "డిజైన్లకు అనుమతులు రాకుండానే వాటిని పూర్తి చేశారు. ప్రాజెక్టు డీపీఆర్ పరిశీలనకు సీడబ్ల్యూసీ, కేంద్ర సంస్థలకు పంపారు. సాంకేతిక– ఆర్థిక అంశాలు పరిశీలనలో ఉండగానే బ్యారేజీల పనులు ప్రారంభించారు. పైగా 2016 అక్టోబరు 22న నిర్వహించిన హైపవర్ కమిటీ సమావేశంలో బ్యారేజీల డిజైన్లను కూడా మార్చేశారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల స్థానాలను డీపీఆర్‌లో పేర్కొన్న చోట నుంచి దిగువకు మార్చారు.

మిగతా 2 లో

## జేబులు నింపుకునేందుకే

# కాళేశ్వరం

- వచ్చే కేబినెట్‌లో ఎన్డీఎస్ఏపై చర్చించి చర్యలు
- బిఆర్ఎస్ రైతులకు క్షమాపణలు చెప్పాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

03





## బీఆర్ఎస్ రజతోత్స సభకు భారీ ఏర్పాట్లు

- జన సమీకరణపై దృష్టిపెట్టిన నాయకులు
- రజతోత్సవానికి ఎల్కతుర్తి ముస్తాబు
- వెయ్యి ఎకరాల్లో ఐదు జోన్లలో పార్కింగ్

**వరంగల్, ఏప్రిల్ 25 :**
భారాస రజతోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివస్తారనే అంచనా మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మొత్తం 1,159 ఎకరాల్లో సభ నిర్వహిస్తుండగా ఇందులో 159 ఎకరాలు సభాస్థలానికి కేటాయించారు. మిగిలిన 1,000 ఎకరాలను ఐదు జోన్లుగా విభజించి వాహనాల పార్కింగ్‌కు కేటాయించారు.

మిగతా 2 లో

## పహల్గాం ఉగ్రదాడి హేయమైన చర్య

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున వేల మందితో ర్యాలీ చేపట్టామని చెప్పారు. "అందరం ఏకమై ఉగ్రవాదాన్ని అంతమొందించి ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలి. దాడికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలి. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తున్నా. ఆయా కుటుంబాలకు అండగా నిలబడతాం. 1967, 1971లలో ఉగ్రవాదులు ఇలాంటి దాడులే చేస్తే ఇందిరాగాంధీ దీటైన జవాబు ఇచ్చారు. ఆ సందర్భంలో ఇందిరాగాంధీని వాజ్‌పేయి దుర్గామాతతో పోల్చారు. దుర్గామాత భక్తులుగా ప్రధాని మోదీ... ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలి. కోట్లాది భారతీయులంతా మీకు(మోదీకి) మద్దతుగా ఉన్నారు. మరోసారి పాకిస్థాన్‌ని ఓడించాలి. ఆ దేశాన్ని రెండు ముక్కలు చేయాలి. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ని భారత్‌లో కలపాలి" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పీపుల్స్ ప్లాజా నుంచి మొదలైన ర్యాలీలో యువకులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. జాతీయ జెండా పట్టుకొని పాకిస్థాన్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముస్లింలు నలుపు రంగు రిబ్బన్‌లు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్'లో పాల్గొనడానికి వచ్చిన సుమారు 100 దేశాల ప్రతినిధులు కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు. పాల్గొన్న ప్రజలంతా ఇందిరాగాంధీ విగ్రహం వద్ద సెల్‌ఫోన్‌లో లైట్లు వెలిగించి తమ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత, విదేశాంగ శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, సీఎస్ శాంతికుమారి, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, దానం నాగేందర్, ఎమ్మెల్సీ విజయశాంతి, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, కాంగ్రెస్ నేతలు జగ్గారెడ్డి, వి.హనుమంతరావు, మధుయాస్కీ గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, శాప్ ఛైర్మన్ శివసేనారెడ్డి సహా పలువురు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రపంచానికి చాటి చెప్పాం

(మొదటిపేజీ తరువాయి)

సామాజిక అసమానతలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అహింస, సత్యం, సామాజిక న్యాయం అనే మూడు ప్రాథమిక మూల సిద్ధాంతాలతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ భారత్ సమ్మిట్ ద్వారా మరోసారి దిశా నిర్దేశం చేస్తోంది. శాంతి, ప్రగతి కాముకులు, ప్రపంచ న్యాయం కోరుకునే వారు చర్చల్లో పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సు చరిత్రలో నిలిచిపోతుంది. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయాన్ని మేళవించి కాంగ్రెస్ మూల సిద్ధాంతాలను ముందుకు తీసుకెళుతున్న విధానాన్ని ప్రపంచ ప్రతినిధులకు వివరించగా వారు సంతోషం వ్యక్తంచేశారు. దేశానికే ఆదర్శంగా నిలవబోతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని వారిని కోరాం. శాంతి, అహింసా మార్గంలో గ్లోబల్ జస్టిస్ సాధనకు కాంగ్రెస్‌తో కలిసి రావాలని పిలుపునిచ్చాం" అని వివరించారు. సల్మాన్‌ఖుర్షీద్ మాట్లాడుతూ... "పెట్టుబడులను ఆకర్షించడానికి భారత్ సమ్మిట్ ఏర్పాటు చేయాలనేది తెలంగాణ ప్రభుత్వ వినూత్న ఆలోచన. ఇప్పటికే దేశ, విదేశాల నుంచి తెలంగాణకు పెట్టుబడులు వస్తున్నాయి. మరిన్ని రావాలని ఆకాంక్షిస్తున్నాం" అని అన్నారు.

### సందడిగా భారత్ సమ్మిట్

హైదరాబాద్‌లో 'భారత్ సమ్మిట్-2025' పేరిట రాష్ట్ర ప్రభుత్వం




ఏర్పాటుచేసిన అంతర్జాతీయ రాజకీయ సదస్సు శుక్రవారం హైటెక్స్‌లోని నోవాటెల్‌లో ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు తొలిరోజు వందకుపైగా దేశాల నుంచి 400 మందికిపైగా ప్రతినిధులు హాజరైనట్లు పీసీసీ వర్గాలు తెలిపాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా కళారూపాలు, నృత్యాలు, డప్పు వాయిద్యాలు, బోనాలతో కళాకారులు విదేశీ ప్రతినిధులకు ఘన స్వాగతం పలికారు. పోలీసులు హోటల్ వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. విదేశీ ప్రతినిధులు ఉదయం మూడు, నాలుగు బృందాలుగా విడిపోయి గ్రామీణ ఉపాధి హామీ పనులను వివిధ ప్రదేశాలకు వెళ్లి పరిశీలించి వచ్చారు. హైటెక్స్‌లో మహాత్మాగాంధీ చరఖా తిప్పుతున్నట్లు ఏర్పాటు చేసిన విగ్రహం ఆహూతులను ఆకట్టుకుంది. కాంగ్రెస్‌కు చెందిన పలువురు జాతీయ నేతలు సాధారణ ప్రతినిధుల మాదిరిగా సమావేశాల్లో పాల్గొన్నారు. తొలిరోజు ప్రారంభోత్సవ సమావేశానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి వస్తారని ముందు చెప్పినా వారు రాలేదు. రాహుల్‌గాంధీ కశ్మీర్ పర్యటనలో ఉ న్నందున రాలేదని పార్టీ నేతలు తెలిపారు. రెండోరోజు శనివారం సాయంత్రం జరిగే ముగింపు సమావేశానికి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకాగాంధీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వస్తారని వెల్లడించారు.

### ఉగ్ర ఘాతుకంపై విదేశీ ప్రతినిధుల దిగ్భ్రాంతి

పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. "అనాగరిక ఉగ్రదాడిని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ ఘాతుకంలో 26 మంది అమాయక పౌరులు మ-రణించడం మమ్మల్ని కలచివేసింది. భారత ప్రజలకు మేం సంఘీభావాన్ని తెలియజేస్తున్నాం. ఈ దాడులను ఐక్యత, శాంతి, సామరస్యం అనే రాజ్యాంగ విలువలపై చేసిన ప్రత్యక్ష దాడిగా పరిగణిస్తాం" అంటూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

## బీఆర్ఎస్ రజతోత్స సభకు భారీ ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

ప్రధానంగా పార్టీ అధినేత కేసీఆర్ ప్రసంగాన్ని అందరూ వీక్షించేలా 8 అడుగుల ఎత్తు, 150 అడుగుల వెడల్పు, 100 అడుగుల పొడువులో నిర్మిస్తున్న 'బాహుబలి వేదిక' నిర్మాణం పూర్తయింది. ప్రధాన వేదిక ముందు వీఐపీలు, మీడియా ప్రతినిధులకు గ్యాలరీలను ఏర్పాటుచేశారు. దూరంగా ఉండే వారికి వేదికపైన ఉ న్నవారు కనిపించేలా సుమారు వందెకరాల్లో ఎల్‌ఈడీ తెరలను, లైట్లను అమర్చారు. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు నియోజకవర్గాలు, మండలాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించి జన సమీకరణపై దృష్టిపెట్టారు. ఉమ్మడి వరంగల్ నుంచే సుమారు 3 లక్షల మందికిపైగా ప్రజలను సమీకరించాలని అధిష్ఠానం నిర్దేశించిన నేపథ్యంలో ఆ మేరకు నాయకులు క్షేత్రస్థాయిలో కసరత్తును ముమ్మరం చేశారు. వరంగల్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగానూ పలు జిల్లాల్లో సభకు మద్దతుగా ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఐదు రోజుల కిందట సూర్యాపేట నుంచి బయల్దేరిన ఎడ్లబండ్లు శుక్రవారం రాత్రికి ఎల్కతుర్తికి చేరుకోనున్నాయి. హనుమకొండ, సిద్ధిపేట, కరీంనగర్ జిల్లాలకు కూడలిగా ఉన్న ఎల్కతుర్తిలో జరిగే సభకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు సభకు నలువైపులా పార్కింగ్ ఏర్పాట్లుచేశారు. సుమారు నాలుగు వేలకుపైగా బస్సులతో పాటు లారీలు, డీసీఎంలు, పెద్ద సంఖ్యలో వచ్చే ఇతర వాహనాలన్నింటినీ..కేటాయించిన స్థలాల్లో పార్కింగ్ చేసేలా చూసేందుకు రెండున్నర వేల మంది వాలంటీర్లను సిద్ధం చేశారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడటంతోపాటు సభకు వచ్చే వారికి మజ్జిగ, నీళ్లు ఇవ్వడంతోపాటు వాకీటాకీల ద్వారా ఎక్కడ సమస్య ఉంటే అక్కడికి వెళ్లేలా నిర్వాహకులు వారికి ఆదేశాలు అందించనున్నారు. భారీ ఉష్ణోగ్రతల దృష్ట్యా..సభకు హాజరయ్యే వారు అస్వస్థతకు గురైన పక్షంలో మెరుగైన వైద్యం అందించడానికి ఐదు పార్కింగ్ స్థలాల్లో ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో ప్రాథమిక కేంద్రంలో ముగ్గురు చొప్పున వైద్యులు, ఐదుగురు నర్సులు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా వెయ్యి బయో టాయిలెట్లను సిద్ధం చేస్తున్నారు.



### ఉగ్రవాదంపై కఠినంగా వ్యవహరించాలి: అసదుద్దీన్

**కాటేదాన్:** దేశంలో ఉగ్రవాద నిర్మూలనకు ప్రధాని మోదీ కఠినంగా వ్యవహరించాలని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. పహల్గాం ఘటనపై శుక్రవారం శాస్త్రిపురంలోని తన నివాసం వద్ద మసీదులో మధ్యాహ్న ప్రార్థనల అనంతరం నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. అందరికీ నల్లబ్యాడ్జీలను కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో హిందువులు, ముస్లింలు మృతిచెందారన్నారు. అక్కడ జరిగిన ఈ ఘటనపై సంయమనం పాటించాల్సింది పోయి కులమతాల చిచ్చును రగిలిస్తూ రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం ఏ మాత్రం భావ్యం కాదన్నారు. తాను ఒక భారతీయుడిగా దీనికి వ్యతిరేకమన్నారు. పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని మక్కామసీద్‌లో ముస్లింలు నల్లరిబ్బన్లు చేతికి కట్టుకొని నమాజ్ చేశారు. నిరసన ప్రదర్శన చేపట్టారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## కాశ్మీరులో అలజడులే ఉగ్రవాదుల లక్ష్యం

- రైల్వే ఆస్తులు, కశ్మీర్ పండిట్లు లక్ష్యం
- దాడులపై నిఘావర్గాల అంచనా

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 25 :** కాశ్మీర్‌లో విధ్వంసం సృష్టించే లక్ష్యంతో ఉగ్రవాదులు ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. ఇటీవల దాది కూడా ఇందులో భాగమని భావిస్తున్నారు. అక్కడ సాధారణ పరిస్థితిలు రాకుండా చూడడమే వీరి లక్ష్యమని తెలుస్తోంది. రైల్వే మౌలిక సదుపాయాలు, కశ్మీరీ పండిట్‌లతోపాటు కశ్మీర్ లోయలో పనిచేస్తున్న స్థానికేతరులే లక్ష్యంగా ఉగ్రవాదులు దాడులకు ప్రణాళికలు వేస్తున్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో భద్రతా దళాలు మరింత అప్రమత్తమైనట్లు-అధికారులు వెల్లడించారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం నిఘా వర్గాలు ఈ విషయాలను పసిగట్టినట్లు తెలిసింది. జమ్మూ కశ్మీర్‌లో పనిచేసే స్థానికేతరులను ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకున్నట్లు- నిఘా వర్గాలు వెల్లడించాయి. ముఖ్యంగా అక్కడ పనిచేస్తున్న రైల్వే ఉద్యోగుల్లో ఎక్కువ మంది ఇతర రాష్ట్రాల నుంచి వెళ్లినవారే. దీంతో దాడుల ముప్పు దృష్ట్యా రైల్వే భద్రతా సిబ్బంది తమ బ్యారక్‌ల నుంచి బయటకు రాకుండా ఉండాలని అధికారులు సూచించారు. మరోవైపు కశ్మీరీ పండిట్‌ల లక్ష్యంగా దాడులు చేసేందుకు పాకిస్థాన్ ఐఎస్‌ఐ ప్రణాళికలు వేస్తున్నట్లు- నిఘా వర్గాలు గుర్తించాయి. వీరితోపాటు- శ్రీనగర్, గాందెర్బల్ జిల్లాల్లోని పోలీసు సిబ్బందికి కూడా హెచ్చరికలు జారీ చేశాయి. ఉగ్రదాడుల ముప్పు పొంచి ఉందన్న వార్తల నేపథ్యంలో భద్రతాబలగాలు అప్రమత్తమయ్యాయి. రైల్వే ప్రాజెక్టులను ధ్వంసం చేసే ప్రయత్నాలను అడ్డుకునేందుకు స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఆర్పీఎఫ్ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశాలు వచ్చినట్లు- సమాచారం.

## నాణ్యత పరీక్షలు లేవు..

(మొదటిపేజీ తరువాయి)

నీటి నిల్వ సామర్థ్యాలను మొదట పేర్కొన్న దానికన్నా పెంచారు. ప్రస్తుతం కట్టినచోటైనా భూ భౌతిక పరీక్షలు, ఇతర పరిశోధనలు చేశారా అంటే అదీ లేదు. కేంద్ర జల సంఘం సూచించిన వరద కన్నా సుందిళ్ల బ్యారేజి డిజైన్ సామర్థ్యాన్ని తక్కువ చేసి నిర్మించారు" అంటూ ఎన్డీఎస్ఏ తన నివేదికలో స్పష్టం చేసింది. "భారీ ప్రాజెక్టుల నిర్మాణాలకు మూడో పక్షం (థర్డ్ పార్టీ)తో ఆడిట్ చేయించాలన్న నిబంధన ఉండగా అది అమలు కాలేదు. నీటిపారుదలశాఖ, నిర్మాణ సంస్థ మినహా మరో పక్షంతో మదింపు చేయించి ఉంటే లోపాలను ఆదిలోనే పసిగట్టే వీలుండేది. నిర్మాణ సామగ్రి పరిమాణం.. నాణ్యత ప్రమాణాల మేరకు వినియోగిస్తున్నారా.. అవి మన్నుతాయా లేదా అనే పరీక్షలను థర్డ్ పార్టీతో చేయించలేదు. క్వాలిటీ కంట్రోల్ విభాగం చీఫ్ ఇంజినీర్ నేతృత్వంలో ఈ ప్రక్రియ జరగాల్సి ఉండగా అమలు చేయలేదు. నిర్మాణ ప్రారంభం నుంచి చివరి వరకు ఎలైన్‌మెంట్, కోరింగ్ చేసే సమయంలో లోపాలున్నాయా అని క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్లు పర్యవేక్షించాల్సి ఉంది. కానీ, పని ప్రాంతాలను పరిశీలించకుండానే ధ్రువీకరించినట్లు అవగతమవుతోంది. బ్యారేజీల దిగువన టెయిల్ వాటర్ నిల్వ ఉండాలనేది విస్మరించారు. జలాశయం లో నీటి నిల్వను గేట్ల ద్వారా దిగువకు వదిలితే విడుదలయ్యే పీడనం, శక్తి దిగువ ప్రాంతంలో నిర్మాణాలను కదిలిస్తుందని అంచనా వేయకుండానే డిజైన్లు చేశారు. బ్యారేజీల నష్టాలకు ఇది ఒక కారణం. సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ లోపాలూ ఉన్నాయి. కన్‌స్ట్రక్షన్ విభాగం కూడా ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోలేదు. నిర్వహణకు సంబంధించి ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టకపోవడం కూడా లోపమే. ర్యాఫ్ట్, పియర్స్, సీకెంట్ పైల్స్ తదితర నిర్మాణాల్లో కాంక్రీట్ క్యూబ్స్ వినియోగించాల్సి ఉంది. కాంక్రీట్ క్యూబ్స్ పరీక్షలు ఏడు రోజుల వద్ద, 28 రోజుల వద్ద పరీక్షించి ఫలితాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ప్రమాణాల మేరకు ఇవి జరగలేదు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల సమయంలో చేయాల్సిన సిమెంట్, అగ్రిగేట్స్, వాటర్, మిక్సర్స్‌లకు సంబంధించి ప్రాథమికంగా పరీక్షలు జరగలేదు. అన్నారం బ్యారేజీలో 35, 44, 28, 38 గేట్ల దిగువన పెద్ద ఎత్తున బుంగలు ఉన్నాయి. వాటిని గ్రౌటింగ్ చేసి పునరుద్ధరిస్తే భూగర్భంలో నీటి ఒత్తిడి పెరిగి ఇతర ప్రాంతాల్లో సీపేజీ వచ్చే అవకాశాలు లేకపోలేదు. సుందిళ్ల బ్యారేజీలోనూ 46, 52, 33, 50 గేట్ల సమీపంలో బుంగలు ఏర్పడ్డాయి. ఇతర గేట్ల సమీపంలోనూ బుంగలు ఏర్పడి ఉంటాయనే అనుమానాలున్నాయి. ఈ క్రమంలో ఈ రెండు బ్యారేజీలకూ పరీక్షలు చేయడం, మరోమారు డిజైన్లు రూపొందించడం అవసరం" అని ఎన్డీఎస్ఏ సూచించింది.

## దేశ ఐక్యతను దెబ్బతీసే చర్యలు సహించం

- కఠిన చర్యలకు కేంద్రం ఉపక్రమించాలి
- ఎలాంటి చర్యకైనా కాంగ్రెస్ మద్దతు ఉంటుంది
- మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్

**హైదరాబాద్, ఏప్రిల్ 25 :** దేశ ఐక్యతను దెబ్బతీసే ఎటువంటి కుట్రలనైనా గట్టిగా తిప్పికొట్టాలని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ విదేశాంగ శాఖ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. ఇందుకోసం ఎలాంటి నిర్ణయమైనా కాంగ్రెస్ మద్దతు ఉ ంటుందని అన్నారు. ఉగ్రదాడులను తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు కొన్ని నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని సల్మాన్ ఖుర్షీద్ సూచించారు. హైదరాబాద్ వేదికగా గ్లోబల్ జస్టిస్, సమానత్వం, ప్రగతిశీల సహకారంపై 100కి పైగా దేశాల ప్రాతినిధ్యంతో ప్రోగ్రెసివ్ అలయెన్స్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే భారత్ సమ్మిట్ 2025 సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన పహల్గాం ఉగ్రదాడి, తదనంతర పరిణామాల పై స్పందించారు. ఈ ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య పెరిగిన ఉ ద్రిక్తతలపై మాట్లాడుతూ ఇది తప్పుల గురించి మాట్లాడాల్సిన సమయం కాదు. జాతీయ ఐక్యతను ప్రదర్శించే సమయం. ఇది మన దేశంపై జరిగిన దాడి. మన సోదరభావం, సామరస్యత, సంస్కృతికి సవాల్. దేశ ప్రజలంద రితో పాటు- రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని నిశ్చయించుకున్నాయి. దేశ ప్రయోజనాల కోసం కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకున్నా కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయి మద్దతు ఇస్తుందని తాము ఇప్పటికే చెప్పామన్నా రు. ఈ సమయంలో కేంద్రం నుంచి నిర్దిష్టమైన, దృఢమైన చర్యలు ఉంటాయని ఆశిస్తున్నామని అన్నారు. పాక్‌తో సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంపై స్పందించిన ఖుర్షిద్.. పాక్‌ని దెబ్బకొట్టేలా ఇది కేవలం ఒక అడుగు మాత్రమే అని అన్నారు. కానీ, మనకు జరిగిన నష్టానికి ఇది ఓ నిర్ణయాత్మకమైన ప్రతిస్పందన అవుతుందని ఎవరూ విశ్వసించడంలేదని పేర్కొన్నారు. తర్వాత ఏం జరుగుతుందో వేచి చూడాల్సి ఉ ందని తెలిపారు. బిహార్‌లోని మధుబనిలో నిన్న జరిగిన సభలో ప్రధాని నరేంద్ర మోదీ అకస్మాత్తుగా ఇంగ్లిష్‌లో ప్రసంగించడం అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ వ్యూహంలో భాగమా? అని వస్తోన్న ప్రశ్నలకు స్పందిస్తూ.. ఇది ఎన్నికల ర్యాలీలు లేదా ఎన్నికల సమయం అని మేం అనుకోవడంలేదు. దేశ ఐక్యతపై దాడి జరిగింది. జాతీయ ఐక్యతను బలోపేతం చేయడం మనందరి బాధ్యత. రాహుల్ గాంధీ ఈరోజు ఇక్కడికి రావడానికి బదులుగా కశ్మీర్ వెళ్లడానికి కారణం కూడా ఇదే. గాయాలను నయం చేసేలా యావత్ దేశానికి సందేశం పంపడం కోసమే ఆయన అక్కడికి వెళ్లారని ఖుర్షిద్ చెప్పారు.

## తప్పుడు సమాచార వ్యాప్తితో ప్రజాస్వామ్యానికి పెనుముప్పు



- బలమైన సైబర్ చట్టాలతోపాటు డిజిటల్ అక్షరాస్యతతోనే నియంత్రణ
- భారత్ సమ్మిట్‌లో నిపుణులు

**హైదరాబాద్:** తప్పుడు సమాచార వ్యాప్తి ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా పరిణమించిందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించడంతోపాటు బలమైన సైబర్ చట్టాలను అమలు చేయడం ద్వారానే దానిని నియంత్రించగలమని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో శుక్రవారం 'భారత్ సమ్మిట్'లో 'ఫ్యాక్ట్ వర్సెస్ ఫిక్షన్' అంశంపై చర్చాగోష్ఠి జరిగింది. కాంగ్రెస్ నేత దిగ్విజయ్‌సింగ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం టెక్ కంపెనీలు గ్లోబల్ కథనాలను నియంత్రిస్తుండటంతోపాటు పౌరుల హక్కులను అతిక్రమిస్తున్నాయని మండిపడ్డారు. డీప్‌ఫేక్ బెదిరింపులకు తానూ బాధితుడినే అన్నారు. థాయ్‌లాండ్ పంచ్ ఆఫ్ వెవిస్ కన్సల్టెన్సీ సీఈవో ధనిసర రువాంగ్‌డేజ్ మాట్లాడుతూ.. కొందరు పనిగట్టుకొని నకిలీ కంటెంట్‌ను ప్రసారం చేస్తున్నారని పేర్కొన్నారు. డిజిటల్ అక్షరాస్యత, మీడియా నియంత్రణ, ప్రభుత్వ విద్య తదితర అంశాల గురించి యూరోపియన్ యూనియన్ పార్లమెంట్ మాజీ సభ్యుడు మియాపెత్రా కుంపులానత్రి వివరించారు. మలేసియాలో కఠినమైన లైసెన్సింగ్ చట్టాలను ప్రవేశపెట్టడంతోపాటు మీడియా కౌన్సిల్‌ను ఏర్పాటు చేయడం కోసం చేపడుతున్న ప్రణాళికలను మలేసియా ప్రతినిధుల సభ సభ్యుడు రాంకర్పాల్ సింగ్ వెల్లడించారు. పాఠశాలల్లో డిజిటల్ అక్షరాస్యత తక్షణ ఆవశ్యకతను ఎంపీ మల్లు రవి ఉద్ఘాటించారు. యూకే లేబర్‌పార్టీ నేత మాథ్యూ విలియం ఫాల్డింగ్, నికరగువా యువ రాజకీయనేత డా.లూయిస్ బ్లాండన్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లలో అక్రమాలపై.. విజిలెన్స్ నివేదికలో జాప్యమెందుకు?

### మార్కెటింగ్ అధికారులపై మంత్రి తుమ్మల ఆగ్రహం



**హైదరాబాద్:** రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల సందర్భంగా మార్కెట్‌యార్డుల్లో చోటుచేసుకున్న అక్రమాలపై విజిలెన్స్ నివేదిక జాప్యం కావడంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెటింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్ల కోసం అనర్హులకు తాత్కాలిక రిజిస్ట్రేషన్ (టీఆర్)పత్రాల జారీ, తూకం, నాణ్యత ప్రమాణాల నిర్ధారణలో అవకతవకలపై అభియోగాలు రాగా మంత్రి ఆదేశాల మేరకు రెండు నెలల క్రితం మార్కెట్‌యార్డుల కార్యదర్శులు ఏడుగురిని మార్కెటింగ్‌శాఖ సస్పెండ్ చేసింది. మిగిలిన మార్కెట్లలోనూ దీనిపై విజిలెన్స్ విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. అయితే విచారణ జరిగినా అధికారులు నివేదిక ఇవ్వలేదు. దీనిపై మంత్రి శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావు, మార్కెటింగ్ కమిషనర్ సురేంద్రమోహన్‌లతో సమావేశం నిర్వహించారు. "విజిలెన్స్ నివేదికకు ఎన్నిరోజుల సమయం తీసుకుంటారు? నేను ఆదేశించినా ఇదే నిర్లక్ష్యమా? జాప్యానికి బాధ్యులెవరు" అని ప్రశ్నించారు. వెంటనే నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పాలకవర్గాలకు ప్రతిపాదనలు పంపించండి..: రాష్ట్రంలోని మొత్తం 197కి గాను 162 మార్కెట్‌యార్డులకు పాలకవర్గాల నియామకం జరిపామని, మిగిలిన 35 యార్డుల్లో నియామకాల కోసం పేర్లతో ప్రతిపాదనలు పంపించాలని ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలకు మంత్రి తుమ్మల శుక్రవారం లేఖ రాశారు. ఒక్కో యార్డు పాలకవర్గంలో ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్, 14 మంది సభ్యులు చొప్పున మొత్తం 2,268 మంది కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టులు ఇచ్చామని చెప్పారు.

## యూపిలో వేయిమంది పాక్ జాతీయులు

### గుర్తించే పనిలో పడ్డ యోగి సర్కార్

**లక్నో, ఏప్రిల్ 25 :** జమ్మూకాశ్మీర్ లోని పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ పై కఠిన ఆంక్షలు విధించింది. సింధు జలాలను రద్దు చేయడంతోపాటు- అన్ని రకాల దౌత్య సంబంధాలను తెగదెంపులు చేసుకుంది. పాక్ జాతీయులు వీసాలు రద్దు చేసింది. భారత్ లో ఉన్న పాక్ జాతీయులు వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించింది. ఏప్రిల్ 29 లోపు పాక్ జాతీయులు ఏ ఒక్కరూ ఇండియాలో కనిపించొద్దని ఆర్డర్స్ పాస్ చేసింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ పై భారత్ చర్యలు ముమ్మరం చేసింది. ఇప్పటికే పాక్ జాతీయులు వీసాలు రద్దు చేసిన భారత్.. వారిని దేశం నుంచి పంపించే చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్ని రాష్ట్రాలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. దేశంలో ఏమూలన పాకిస్తానీలు ఉన్నా గుర్తించి వారిని ఏప్రిల్ 29లోగా దేశం నుంచి పంపించాలని ఆదేశాలు జారీ చేశారు. అమిత్ ఉత్తర్వులతో ఆయా రాష్ట్రాలు చర్యలు చేపట్టాయి. యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ పాక్ జాతీయులను గుర్తించే పనిలో పడ్డారు. యూపీలో పెద్ద ఎత్తున పాక్ జాతీయులు ఉన్నట్లు- గుర్తించారు. యూపీ పోలీసు ఉన్నతాధికారుల తెలిపిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం రాష్ట్రంలో 1,000 నుంచి 1,200 మంది పాకిస్తానీ జాతీయులు నివసిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారిక బహిష్కరణ ఉత్తర్వు ఇంకా అందలేదు. ఆదేశం జారీ అయిన వెంటనే స్వదేశానికి తిరిగి పంపే ప్రక్రియను ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసారన్ గడ్డి మైదానంలో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిని పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యగా భారత ప్రభుత్వం నిర్ధారించింది. తీవ్రవాదాన్ని అంతంచేయడమే లక్ష్యంగా నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటామని ప్రతిజ్ఞ చేసింది.

## ఎంఐఎం ఖాతాలోకి 'హైదరాబాద్ స్థానిక' ఎమ్మెల్సీ

### - భాజపా అభ్యర్థిపై 38 ఓట్ల మెజార్టీతో మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి గెలుపు

**హైదరాబాద్:** హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో ఎంఐఎం అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి విజయం సాధించారు. ఈ నెల 23న జరిగిన ఎన్నికలో.. మొత్తం 112 ఓట్లకుగాను 88 ఓట్లు పోలవగా.. ఎంఐఎం అభ్యర్థికి 63 ఓట్లు, భాజపా అభ్యర్థి గౌతమ్‌రావుకు 25 దక్కాయి. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలవగా, అరగంటలో ఫలితం తేలిపోయింది. 8.40 గంటలకు రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి 38 ఓట్ల మెజార్టీతో ఎంఐఎం అభ్యర్థి గెలిచినట్లు ప్రకటించారు. భాజపా, ఎంఐఎం అభ్యర్థులు మాత్రమే పోటీలో ఉన్న ఈ ఎన్నికలో.. భారాస, కాంగ్రెస్ పార్టీల నుంచి తమకు క్రాస్ ఓటింగ్ జరుగుతుందనే భాజపా అంచనాలు ఫలించలేదు. కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం వైపు నిలవడం, భారాస ఎన్నికకు దూరంగా ఉండటంతో.. భాజపాకు చెందిన 19 మంది కార్పొరేటర్లు, ఆరుగురు ఎక్స్‌అఫీషియో సభ్యుల ఓట్లతో.. ఆ పార్టీ సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఎంఐఎంకు స్వతహాగా 40 మంది కార్పొరేటర్లు, తొమ్మిది మంది ఎక్స్‌అఫీషియో సభ్యులున్నారు. ఏడుగురు కాంగ్రెస్ కార్పొరేటర్లు, ఏడుగురు కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌అఫీషియో సభ్యులు కూడా ఎంఐఎంకు ఓటేశారు. గెలిచిన తర్వాత ఎంఐఎం అభ్యర్థి హసన్ ఎఫెండి మీడియాతో మాట్లాడుతూ తనకు అవకాశం ఇచ్చిన పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీకి కృతజ్ఞతలు తెలిపారు.

## మంత్రి పొంగులేటి
# పిఎల పేరుతో వసూళ్లు
### ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 25 :** ఈజీమనీకి అలవాటు పడి సైబర్ మోసాలకు పాల్పడే వారు కొందరైతే.. మరికొందరేమో పొలిటికల్ లీడర్స్ ను అడ్డం పెట్టుకుని సంపాదించాలని చూస్తుంటారు. తప్పు చేస్తే ఎప్పటికైనా దొరకాల్సిందే కదా.. ఇదే రీతిలో ఇద్దరు వ్యక్తులు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్సనల్ అసిస్టెంట్స్ మంటూ అమాయకులను మోసం చేస్తున్నారు. చివరికి వీరి బాగోతం బట్టబయలు కావడంతో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్సనల్ అసిస్టెంట్ ( పిఎ) ల మని చెప్పి అమాయకులను మోసగిస్తున్న ఇద్దరు వ్యక్తులను నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బుస్సా వెంకటరెడ్డి ( 34), మచ్చ సురేష్ ( 30) హైదరాబాద్ నాగోల్‌లో నివాస ముంటున్నారు. వీరు మంత్రిగారి పీఏలమంటూ రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫోన్లు చేసి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి వచ్చిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఇక నుంచి తన పీఏలమంటూ ఎవరైనా ఫోన్ చేస్తే, ఎలాంటి చిన్న అనుమానం కలిగినా సచివాలయంలోని తన కార్యాలయం 040-23451072 /040-23451073 నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజలకు సూచించారు. ఎవరైనా ఈ విధంగా అధికారాన్ని దుర్వినియోగపరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పాక్ పౌరులు వెంటనే
# దేశం విడిచి వెళ్లాలి
### ప్రకటన విడుదల చేసిన డిజిపి

**హైదరాబాద్, ఏప్రిల్ 25 :** తెలంగాణలో వీసాలతో ఉన్న పాక్ పౌరులు వెంటనే దేశం విడిచి వెళ్లాలని, లేకుంటే చటంటప్రకారం చర్యలు తప్పవని డిజిపి హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాకిస్తాన్‌ను అన్ని రకాలుగా దెబ్బ కొట్టడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా పాకిస్తానీల వీసాలను రద్దు చేసింది. 48 గంటల్లో పాకిస్తానీలు దేశం వదలి వెళ్లిపోవాలని ఆదేశించింది. ఇక, తెలంగాణ పోలీసులు శాఖ కూడా వీసాల రద్దు నేపథ్యంలో రాష్ట్రంలో ఉంటున్న పాకిస్తానీలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో ..తెలంగాణలో ఉన్న పాకిస్తానీలు వెంటనే తమ దేశానికి వెళ్లిపోవాలి. పాకిస్తానీల వీసాలు 27 తర్వాత పనిచేయవు. మెడికల్ వీసాల మీద ఉన్నవారికి ఏప్రిల్ 29 వరకు మాత్రమే గడువు ఉంది. లాంగ్ టర్మ్ వీసాలు కలిగిన వారికి ఈ నిబంధన వర్తించదు. పాకిస్తానీలు తమ దేశానికి అటారి బార్డర్ నుంచి వెళ్లొచ్చు. ఈనెల 30 వరకు అటారి బార్డర్ తెరుచుకుని ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పాకిస్తానీలు తమ దేశానికి వెళ్లిపోవాల్సిందే. ఒకవేళ అక్రమంగా తెలంగాణలో ఉంటే న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## సింధు జలాలు
# ఆపేస్తే మీ ఊపరి ఆపేస్తాం
### మోడీ లక్ష్యంగా హాఫీజ్ ప్రేలాపనలు

**లాహోర్, ఏప్రిల్ 25 :** పాకిస్థాన్ బేస్డ్ ఉగ్రవాద సంస్థ లష్కర్-ఇ-తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ ముహమ్మద్ సయీద్ కారుకూతలు కూశాడు. పీఎం మోదీ టార్గెట్ గా పిచ్చి ప్రేలాపనలు చేశాడు. సింధు జలాలను ఆపేస్తే, మీ ఊపిరాపేస్తామంటూ ఉన్మాదపే ప్రేలాపనలు పేలాడు. ఇటీవల జరిగిన పహల్గాం ఉగ్రదాడి వెనుక కూడా 26/11 ముంబయి దాడుల మాస్టర్ మైండ్.. హాఫీజ్ సయీద్ హస్తం ఉన్నట్టు- గుర్తించిన సంగతి తెలిసిందే. హాఫీజ్ ముహమ్మద్ సయీద్ పాకిస్తానీ తీవ్రవాది. లష్కర్-ఇ-తోయిబా వ్యవస్థాపకుడు. ఈ ఉగ్ర సంస్థ ప్రధానంగా పాకిస్తాన్ నుండి పనిచేస్తోంది. ఈ విభాగానికి తొలినాళ్లలో షేక్ సాజిద్ గుల్ సుప్రీం కమాండర్‌గా, చీఫ్ ఆపరేషనల్ కమాండర్‌గా బాసిత్ అహ్మద్ దార్ వ్యవహరించారు. ఆ తర్వాత నుంచి లష్కరే చీఫ్ హాఫీజ్ సయ్యద్ కనుసన్నల్లోనే నడుస్తోంది. డిప్యూటీ హెడ్‌గా సైపుల్లా వ్యవహరిస్తున్నారు. ఈ ఇరూ పాక్ నుంచే ఎల్ఈటీ కార్యకలాపాలను నడిపిస్తున్నారనే అభియోగాలు ఉన్నాయి. పాక్ సైన్యం, ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ టీఆర్ఎఫ్ గ్రూపులకు సైద్ధాంతికపరమైన మద్దతు మాత్రమే కాదు.. అన్నిరకాలుగా మద్దతు ఇస్తున్నాయని భారత గూఢచార సంస్థలు నిగ్గుతేల్చాయి.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో వాదనలు
### మాజీ ఐజి ప్రభాకర్ రావు బెయిల్ పిటషన్‌పై విచారణ

**హైదరాబాద్, ఏప్రిల్ 25 :** తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశమైన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఐజీ ప్రభాకర్‌రావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. ఆయన తరపున ప్రముఖ న్యాయవాది సి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రభాకర్‌రావు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారని, ముందస్తు బెయిల్ ఇస్తే వెంటనే హైదరాబాద్ వస్తారని కోర్టుకు వివరించారు. ఆయన 30 ఏళ్లకు పైగా వివిధ హోదాల్లో పని చేశారని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆయన క్యాన్సర్‌తో బాధపడుతున్నారని వివరించారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్‌రావు ముందస్తు బెయిల్ పొందారని, అందువల్ల ప్రభాకర్‌రావుకు కూడా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బెయిల్ ఇస్తే దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని, రాజకీయ కక్ష సాధింపు చర్యగా ఫోన్ ట్యాపింగ్ కేసు పెట్టారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సాక్ష్యాలను ధ్వంసం చేశారన్నది నిజం కాదని వాదించారు. పోలీసుల తరఫున సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. 65 ఏళ్ల వయసుందన్న సాకుతో ప్రభాకర్‌రావు దర్యాప్తు నుంచి తప్పించుకోలేరన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు- పూర్తి ఆధారాలు ఉన్నాయని, హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేసి నీళ్లలో పడేసినట్లు దర్యాప్తులో తేలిందని లూథ్రా న్యాయస్థానానికి వివరించారు. ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయొద్దని కోరారు. ఇరువైపు వాదనలు విన్న న్యాయస్థానం.. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

# కొల్లేరు సరిహద్దులపై మరోసారి పరిశీలన
### సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 25 :** కొల్లేరుపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కొల్లేరు సరిహద్దులపై మరోసారి పరిశీలన జరపాలని సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి జస్టిస్ బీఆర్. గవాయి ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్యంపై తనిఖీ జరపాలని కేంద్ర సాధికార కమిటీకి సూచించింది. కొల్లేరులో ప్రైవేటు భూములను నోటిఫై చేయడంపై ప్రైవేటు మత్స్యకారుల సంఘం సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొల్లేరు ప్రస్తుత స్థితిపై నివేదిక అందించాలని సీఈసీకి ఆదేశాలు ఇచ్చింది. ఏపీ వెట్ ల్యాండ్ స్టేట్ అథారిటీ సుప్రీంకోర్టు ఆదేశాలను సరిగా అమలు చేస్తున్నారో లేదోనని నివేదిక ఇవ్వాలని చెప్పింది. కొల్లేరు సరిహద్దులను పరిశీలించాలి, నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డు స్టాండింగ్ కమిటీ- తీర్మానాలను, కొల్లేరు సరిహద్దులపై ఆర్ సుకుమార్ కమిటీ- ఇచ్చిన నివేదికను పరిశీలించి సమస్యను పరిగణలోకి తీసుకొని పరిష్కరించాలని సూచించింది. వన్యప్రాణుల సంరక్షణ చట్టంకు అనుగుణంగా కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్యం నోటిఫై చేశారా ? కొల్లేరులో ఉన్న ప్రైవేటు భూ యజమానుల హక్కులను ఎలా సెటిల్ చేశారు. 12 వారాల్లోగా సుప్రీంకోర్టులో నివేదిక అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది.



# ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ
### ర్యాలీలో పాల్గొన్న సిఎం తదితరులు

**హైదరాబాద్, ఏప్రిల్ 25 :** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకోవాలని భారత్ ముక్తకంఠంతో నినదిస్తోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పాక్ పై దౌత్యపరమైన దాడికి తెరలేపింది. దేశం మొత్తం పాక్ కు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేస్తోంది. ముష్కరుల దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, ఎంపి ఒవైసీ, మంత్రులు పాల్గొన్నారు. హైదరాబాద్ పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్ రోడ్, ఇందిరా గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.. ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తుల ప్రదర్శన చేప ట్టారు.. ర్యాలీలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నాయి.. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. పర్యాటకులపై దాడి చేసి చంపడం తీవ్రమైన ఘటన.. అందరం ఒక్కటై తీవ్రవాదంపై పోరాడాలి.. భారత ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యకు మద్దతు ఇవ్వాల్సిన సమయం ఇది.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.. దాడులకు పాల్పడిన వారికి తగిన బుద్ధి చెప్పాలి.. పార్టీలకు అతీతంగా పని చేయాలి.. తీవ్రవాదాన్ని అంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# సిద్దిపేటకు తెలంగాణకు పేగుబంధం

- ఆనాడు కెసిఆర్ ఇక్కడి నుంచే కదిలారు
- యువత ర్యాలీని ప్రారంభించిన హరీష్ రావు



**సిద్దిపేట, ఏప్రిల్ 25 :** తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు పేగు బంధం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నేడు విద్యార్థులు, యువత చేపట్టిన పాదయాత్ర రేపు బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడానికి విజయ యాత్రగా కాబోతున్నదని చెప్పారు. సిద్దిపేట నియోజకవర్గం కేంద్రం రంగదాంపల్లి అమర వీరుల స్థూపం నుంచి వరంగల్ సభ వద్దకు వెయ్యి మంది విద్యార్థి, యువత చేపట్టిన పాదయాత్రను హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..నాడు సిద్దిపేట నుంచే కేసీఆర్ సైకిల్ యాత్ర చేపట్టి వరంగల్ సభకు ఊళ్లకు ఊళ్లు కదిలించారని గుర్తుచేశారు. చాలా పార్టీలు పుడుతుంటాయి, పోతుంటాయి.. కానీ బీఆర్ఎస్ మాత్రం లక్ష్యాన్ని ముద్దాడిందని తెలిపారు. కేసీఆర్ అనే ఒక గొంతు కోట్ల గొంతుకలను ఏకం చేసిందన్నారు. 14 ఏండ్ల ఉద్యమం, పదేండ్ల ప్రభుత్వం, ఇప్పుడు ఏడాదిన్నర ప్రతిపక్షం.. ఏ పాత్ర అయినా బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ పక్షమేనని స్పష్టం చేశారు. లంకలో రావణుడి అరాచకాలను అరికట్టడానికి ఆనాడు రామదండు కదిలింది. నేడు మన రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎదిరించడానికి ఈ గులాబీ దండు కదిలిందని చెప్పారు. 'కాశ్మీర్‌లోని పెహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి 2 నిమిషాలు శ్రద్ధాంజలి ఘటిద్దాం. ఈరోజు మన సిద్దిపేట నుంచి పాదయాత్రలో బయలుదేరిన విద్యార్థి యువ మిత్రులకు, ఉద్యమకారులకు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అందరికీ శిరస్సు వంచి నమస్కారం తెలియజేస్తున్నా. 44 డిగ్రీల ఎండను కూడా లెక్క చేయకుండా 1500 మంది ఈనెల 27న వరంగల్‌లో జరగబోయే పార్టీ రజతోత్సవం కోసం స్వచ్ఛందంగా తరలివచ్చిన మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు.

# శుభం ద్వివేది కుటుంబానికి యోగి పరామర్శ
### కుటుంబసభ్యుల రోదనలతో కన్నీరు చిందించిన యోగి



**కాన్పూర్, ఏప్రిల్ 25 :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. కుటుంబసభ్యులతో కలిసి సరదాగా విహార యాత్రకు వచ్చిన వారికి విషాదమే మిగిలింది. ఉగ్రదాడిలో చనిపోయిన వారిలో కాన్పూర్‌కు చెందిన శుభం ద్వివేది ఒకరు. భార్యతో కలిసి శుభం వివాహరయాత్రకు పహల్గామ్‌కు వచ్చి ఉగ్రతూటాలకు బలయ్యారు. శుభంకు రెండు నెలల క్రితమే వివాహం జరిగింది. విహహం జరిగి, ఎంతో మంచి భవిష్యత్ ఉన్న శుభం.. ముష్కరుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోవడం ప్రతిఒక్కరినీ కలిచి వేసింది. అలాగే యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా తీవ్ర భావోద్వేనికి గురయ్యారు. కన్నీరు పెట్టు-న్నారు. యోగి ఆదిత్యనాథ్‌కు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఉగ్రమూకల దాడిలో అమరుడైన శుభం ద్వివేది కుటుంబాన్ని పరామర్శించేందుకు యూపీ సీఎం యోగి వెళ్లారు. సీఎంను చూడగానే శుభం భార్య ఐష్ణయ కన్నీరుమున్నీరుగా విలపించారు. శుభం తండ్రిని ముఖ్యమంత్రి ఓదార్చారు. తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. శుభం తల్లిదండ్రులకు ఆయన ఒక్కడే సంతానమని, రెండు నెలల క్రితమే వివాహం జరిగినట్లు చెప్పారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అలాగే శుభం కుటుంబ సభ్యులకు సీఎం యోగి సానుభూతిని తెలియజేశారు.కాగా.. శుభం ఇంటికి సీఎం యోగా వెళ్లగానే అక్కడ ఒక ఉద్వేగభరితమైన వాతావరణం నెలకొంది. సీఎంను చూడగానే శుభం కుటుంబసభ్యులు కంటతడి పెట్టుకున్నారు. ఈ సందర్భంగా శుభం భార్య చెప్పిన మాటలతో ముఖ్యమంత్రి యోగి కూడా చలించిపోయారు. 'ఉగ్రమూకల దాడిలో నా భర్త మరణించాడు.. సార్ మేము ప్రతీకారం తీర్చుకోవాలని అనుకుంటున్నాం' అంటూ కన్నీరు పెట్టుకుంటూ ఐష్ణయ చెప్పిన మాటలతో యూపీ సీఎం కూడా తనను తాను నియంత్రించుకోలేకపోయారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని.. తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. యూపీ సీఎం యోగి.. శుభం ఇంటి నుంచి కన్నీరు పెట్టుకుంటూ వెళ్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# కాంగ్రెస్‌ను, మోడీని ప్రశ్నిస్తూనే ఉంటాం

- హామీలపై కాంగ్రెస్‌ను నిలదీస్తాం
- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



**నిజామాబాద్, ఏప్రిల్ 25 :** వరంగల్ రజతోత్సవ సభో కాంగ్రెస్, బిజెపిల హామీలను వారి మోసాలను నిలదీస్తామని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో ఈ రెండు పార్టీలు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్‌ను,మోడీని ప్రశ్నిస్తూనే ఉంటామని ప్రశాంతరెడ్డి అన్నారు. కెసిఆర్ పాలన, మోడీ పాలనపై ప్రజల్లో చర్చ జరగాలన్నదే తమ లక్ష్యమని వేముల అన్నారు. వ్యవసాయానికి కెసిఆర్ ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తును అందించిందని, ఇప్పుడు కాంగ్రెస్ ఎందుకు అందించలేక పోతున్నదని ఆయన అన్నారు. కేంద్రంలోని బిజెపి గ్యాస్ రాయితీ తగ్గించి.. ఎరువులు, యూరియా ధరలు పెంచిందన్నారు. భాజపా సోషల్ మీడియా తప్పుడు ప్రచారాన్ని సమష్టిగా తిప్పికొట్టాలన్నారు. బిజెపి అధికారంలో ఉన్న ఏ రాష్ట్రమూ బాగుపడ్డ దాఖలాలు లేవన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ పేరుతో భ్రమపెట్టడం అలవాటు చేసుకున్నారని అన్నారు. రైతురాజ్యం రావాలని, దీనికోసం అందరూ కలిసిరావాలని కెసిఆర్ ఇచ్చిన పిలుపుతో ఇప్పుడు మళ్లీ చర్చ మొదలయ్యిందని అన్నారు. కాంగ్రెస్ పాలనతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అన్నారు. తెలంగాణలో రైతులకు ఇప్పుడు కష్టం వచ్చి పడిందని అన్నారు. గతంలో కెసిఆర్ తీసుకున్న నిర్ణయాల కారణంగా నీటి తీరువా లేదు. విద్యుత్తు చార్జీలు లేవు. ధాన్యం కూడా ప్రభుత్వమే కొన్నది. ఆనాడు రైతులు కెసిఆర్‌ను ఎంతగా ఆదరించారో చూస్తే తెలిసిందన్నారు. స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం సాధిస్తుందని, కాంగ్రెస్‌పై పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎగ్గొట్టేందుకు యత్నిస్తున్న తీరును నిలదీయాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఆశలు రేకెత్తించేలా అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. వందరోజుల్లో హామీలు అమలుచేస్తామని చెప్పిన కాంగ్రెస్..ఏడాదిన్నర దాటుతున్నా వాటి విషయంలో ఎక్కడ వేసిన అక్కడే గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు.ఎన్నిసార్లు అబద్దాలు చెప్పుకుంటూ రైతులను ఆగం చేస్తారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మినహా ఏ ఒక్క హామీని సరిగ్గా అమలుచేసిన దాఖలాలు లేవన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు కేసీఆర్ సైనికుల్లా పనిచేయాలని వేముల సూచించారు. పసుపుబోర్డు, మద్దతు ధర ఇప్పిస్తానని మోసం చేసిన అర్వింద్‌కు బుద్ధి చెప్పాలన్నారు. అబద్దాలు చెబుతున్న కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పకపోతే ఇంకా ఆగం చేస్తారని అన్నారు. వరంగల్ సభతో ప్రజలకు వాస్తవాలు తెలియచేస్తామని అన్నారు.

# జేబులు నింపుకునేందుకే కాళేశ్వరం

- వచ్చే కేబినెట్‌లో ఎన్‌డీఎస్ఏపై చర్చించి చర్యలు
- బిఆర్ఎస్ రైతులకు క్షమాపణలు చెప్పాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 25 :** రైతులకు బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్‌డీఎస్ఏ రిపోర్టుపై అధ్యయం చేస్తామన్నారు. వచ్చే కేబినెట్‌లో ఎన్‌డీఎస్ఏపై చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎవడి అయ్య జాగీరు అని కట్టారని ప్రశ్నిస్తూ.. కాళేశ్వరం రైతుల కోసం కాదు జేబులు నింపుకునేందుకు కట్టారు అంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్‌డీఎస్ఏ రిపోర్టు రావడంతో బీఆర్ఎస్‌పై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ ఇచ్చిన నివేదికను చూసి బీఆర్ఎస్ నేతలు సిగ్గు పడాలంటూ మండిపడ్డారు. కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టిస్తున్నామని చెప్పి లక్ష కోట్ల ప్రాజెక్ట్ కట్టారని.. ఎన్‌డీఎస్ఏ నివేదిక చూసి బీఆర్ఎస్ సిగ్గుపడాలన్నారు. 'మీరే డిజైన్ చేశారు.. మీరే కట్టారు.. మీరుండగానే కూలిపోయింది' అని తెలిపారు. మేడిగడ్డ సుందిళ్ళ నిరుపయోగంగా ఉన్న రికార్డు స్థాయిలో పంటలు పండాయని తెలిపారు. అబద్దాలు తప్పులపై బతకాలని బీఆర్ఎస్ అనుకుంటోందని.. అది కుదరదని స్పష్టం చేశారు. నిర్మాణం చేసిన వాళ్ళు.. చేయించిన వాళ్ళు రైతులకు ద్రోహం చేశారని ఆరోపించారు. ఎన్‌డీఎస్ఏను రేవంత్ రెడ్డినో.. నేనో వేసింది కాదు. దేశంలో బెస్ట్ ఎక్స్‌పర్ట్స్ ఎన్‌డీఎస్ఏలో ఉన్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడే ఎన్‌డీఎస్ఏ వచ్చిందని చెప్పుకొచ్చారు. కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టిస్తున్నాము అని చెప్పి లక్ష కోట్ల ప్రాజెక్ట్ కట్టారు..కాళేశ్వరం రైతుల కోసం కాదు జేబులు నింపుకునేందుకు కట్టారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.

# సెలవులతో యాదగిరిగుట్టలో పెరిగిన రద్దీ

**యాదగిరిగుట్ట, ఏప్రిల్ 25 :** యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో భక్తుల రద్దీ బాగా పెరిగింది. సెలవుల కారణంగా భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చారు. దీంతోఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేసవి సెలవుల దృష్ట్యా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దర్శనానికి భక్తులు క్యూలైన్లలో బారులుతీరారు. ప్రసాద విక్రయశాల, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, కొండకింద విష్ణు పుష్కరిణి, కారు పార్కింగ్, బస్టాండ్ ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది. మరోవైపు జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో ముందస్తుగా దేవస్థానం తమ భద్రతా బలగాలను అప్రమత్తం చేసినట్లు ఆలయ ఈవో భాస్కరరావు తెలిపారు.



# నోవాటెల్‌లో భారత్ సమ్మిట్ ప్రారంభం
### సమ్మిట్‌లో పాల్గొన్న మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, ఏప్రిల్ 25 :** హెచ్ఐసీసీలోని నోవాటెల్ వేదికగా తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో 'భారత్ సమ్మిట్' జరుగుతోంది. పెట్టుబడులు, న్యాయం, అహింస, ప్రపంచ శాంతి లక్ష్యంగా దీన్ని నిర్వహిస్తున్నారు. వివిధ దేశాల నుంచి ప్రతినిధులు తరలివచ్చారు. భారత్ సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులకు ఘనస్వాగతం లభించింది. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా కళాకారులు, పలువురు కాంగ్రెస్ నేతలు స్వాగతం పలికారు. బోనాల డప్పులు, సాంస్కృతిక కార్యక్రమాలతో సదస్సుకు వారిని ఆహ్వానించారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు విదేశీ ప్రతినిధులు మంత్రముగ్ధులయ్యారు. భారత్ సమ్మిట్ - 2025 లో డెలిగేట్స్ సదస్సులో సమాచార పౌర సంబంధాలు, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిపాల్గొన్నారు. ఎంపీ లు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఫీన్ ల్యాండ్, థాయ్ లాండ్, బ్రిటన్ తదితర దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. మాజీ కేంద్ర మంత్రి దిగ్విజయ్ సింగ్ ఈ.సదస్సుకు సమన్వయ అధికారిగా వ్యవహరించారు.



# ధాన్యం కొనుగోలులో తీవ్ర నిర్లక్ష్యం

- మద్దతు ధరలు రాక దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన హరీష్ రావు

**సిద్దిపేట, ఏప్రిల్ 25 :** వడ్ల కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని హరీశ్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట వంటి జిల్లాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు దళారులకు అమ్ముకుంటున్నారని అన్నారు. క్వింటాకి 2,320 రూపాయలు మద్దతు ధర రావాల్సి ఉండగా దళారులకు 2 వేలు, 2,100 రూపాయలకే అమ్ముకుంటున్నారని చెప్పారు. ఇది రైతు కంటక ప్రభుత్వం అని హరీశ్‌రావు అన్నారు. రుణమాఫీ చేస్తామని చెప్పి సగం మందికి చేయలేదని.. రైతు బంధుని వానకాలంలో ఎగ్గొట్టి యాసంగిలో రెండు మూడు ఎకరాలకే ఇచ్చారని తెలిపారు.అకాల వర్షాలు, వడగండ్ల వానల భయంతో రైతులు కల్లాల్లోనే ధాన్యాన్ని దళారులకు అమ్ముకునే దుస్థితి నెలకొందని హరీశ్‌రావు అన్నారు. గతేడాది వానాకాలంలో మొత్తం 1 లక్షా 53 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని చెప్పి, కేవలం 52 వేల మెట్రిక్ టన్నులే సేకరించగలిగిందని అన్నారు. మిగతా 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బయటకు వదిలేసిందని.. అంటే మూడొంతుల్లో ఒక వంతు మాత్రమే కొనుగోలు చేయగలిగిందని అన్నారు. రెండొంతుల ధాన్యాన్ని రైతులు తక్కువ ధరకు అమ్ముకున్నారని చెప్పారు.

జనశక్తి

# పాక్ ఎప్పుడూ పక్కలో బల్లెమే!



భారతలో ఉగ్రదాడులు జరినప్పుడల్లా పాక్ బుకాయింపులతో కాలక్షేపం చేస్తుంది. తనకు సంబంధం లేదని చెబుతుంది. ఉగ్రవాదులకు మాదేశంలో స్థానం లేదని చెప్పడం కూడా అలవాటు చేసుకుంది. ముంబై ఉగ్రదాడుల సమయంలోనూ ఇదే చెప్పింది. అలాగే అజ్మల్ కసబ్ గురించి వివరాలు చెప్పినా కసబ్ మా దేశస్థుడు కాదని బొంకింది. చివరకు కసబ్ పుట్టుపూర్వోత్తరాలు బయటపడ్డాక కూడా అదే పాట పడింది. ఇప్పుడు పహల్గాం ఉగ్రదాడితో తమకు సంబంధం లేదని పేర్కొంది. మరి ఢిల్లీలోని పాక్ రాయబాబరి కార్యాలయంలో కేక్ సంబరాలపై ఆ దేశం స్పందించాల్సి ఉంది. ముష్కరులకు పాక్ పూర్తి మద్దతు ఇస్తోందన్న వాదనకు కేక్ వ్యవహారం పక్కా రుజువుగా నిలిచింది. ఇవన్నీ మరచిపోయి బలూచిస్థాన్ ఘటనలను భారత్‌కు అంటగట్టే ప్రయత్నం చేసి చేతులు కాల్చుకుంది. మనం టెర్రరిస్టుల జాబితా సమర్పించినా, వారు పాక్‌లో తిష్టవేసుకుని వున్నా వారిని మాత్రం అప్పగించడం లేదు. హాఫీజ్ సయీద్ లాంటి ఉగ్రవాదులను దాచిపెడుతోంది. వారికి పాలుపోసి పెంచుతోంది. ఇదంతా ఒక ఎత్తయితే దాడి తరవాత పాక్ నాయకులు చేస్తున్న ప్రకటనలు ఆ దేశ కుత్సితాన్ని బయటపెడుతున్నాయి. దాడులను ఏనాడు పాక్ ఖండించడం లేదు. ఆధారాలు చూపితే చర్యలు తీసుకోవడం లేదు. సరికదా తాజాగా కూడా పాక్ నేతల ప్రకటనలు ఉగ్రవాదులకు ఊతమించ్చేలా, పాక్ అండదండలతో వ్యవహారం నడిచినట్లుగా కనిపిస్తోంది. నిజానికి మత ప్రాతిపదికన భారత్‌ను చీల్చుకుని ఏర్పడ్డ పాక్ పాలకులు ఏనాడూ నిజాయితీగా లేరు. భారత్‌ను వర్గశత్రువుగా చూపించి పబ్బం గడుపుకోవడం, కాశ్మీర్ బూచి చూపి ప్రజల ను వశపర్చుకోవడం తప్ప..ఆ దేశం సర్వ నాశనం అయినా వారికి పట్టింపు లేదు. ఇదంతా నాటి భాతర పాలకులు చేసిన దుర్మార్గపు రాజకీయ క్రీనీడ కారణంగా మనకు సంక్రమించిన రావణకాష్టంగా చెప్పుకోవాలి. దీనికి ఎక్కడో ఓ చోట మందు పెట్టాలి. వ్రణం తీవ్రమయితే కాలు తీసేయాల్సిందే. పాక్ కాల్లూచేతులు విరిచేందుకు వెనకాడరాదు.

ఇకపోతే పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడ్డ టెర్రరిస్టుల విషయంలో దాయాది పాక్ దేశ అసలు రంగు ఇప్పుడు బయటపడింది. బయటకు మాత్రం పహల్గాం టెర్రరిస్ట్ దాడితో మాకు సంబంధం లేదని సుద్దాపూస మాటలు మాట్లాడి.. దాడిని ఖండించింది. కానీ పాక్ ఉప ప్రధాని వ్యాఖ్యలతో వారి నిజస్వరూపం బట్టబయలైంది. 28 మంది అమాయక ప్రజలను అత్యంత కిరాతకంగా ఊచకోత కోసిన నరరూప రాక్షసులను పాక్ డిప్యూటీ పీఎం ఇషాక్ దార్ స్వాతంత్య్ర సమరయోధులతో పోల్చాడు. ఆయన వ్యాఖ్యలతో పాక్ వక్రబుద్ధి ప్రపంచదేశాల ముందు మరోసారి తేటతెల్లమైంది. పహల్గాం ఘటనపై ఇషాక్ దార్ ఇస్లామాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ జిల్లాలో దాడులు చేసిన వారు స్వాతంత్య్ర సమరయోధులు అని అభివర్ణించారు. భారత్ సింధూ నది జలాల ఒప్పందాన్ని రద్దు చేయడంపైన కూడా తనకు తోచిన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్‌లో 240 మిలియన్ల మందికి సింధు నది నీరు అవసరం. మీరు ఆ ఒప్పందాన్ని ఆపలేరు. ఒకవేళ ఇండస్ ట్రీటీ- రద్దు చేస్తే అది యుద్ధ చర్యకు సమానం అని హెచ్చరించారు.ఆ దేశం కూడా అదే విధమైన ప్రతిచర్యను ఎదుర్కొంటుందని అన్నారు. 28 మందిని మానవత్వం లేకుండా మట్టుబెట్టిన ఉగ్రవాదులను పాక్ ప్రధాని ఏకంగా స్వాతంత్ర సమరయోధులతో పోల్చడంపై భారత ప్రజలు భగ్గుమంటున్నారు. ఇదే పాక్ అసలైన బుద్ధి అని విమర్శిస్తు న్నారు. పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోంది అనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. పర్యాటకులను మతం ఆధారంగా పరిశీలించి, అడిగి మరీ ఉగ్రమూకలు విచక్షణరహితంగా కాల్పులు జరిపాయి.ముష్కరుల పాశవిక దాడిలో 26మంది అమాయక ప్రజలు మృతి చెందగా.. మరికొందరు పర్యాటకులు బుల్లెట్ గాయాలకు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో పహల్గాంలో దాడికి పాల్పడిన ముష్కరుల కోసం భారత దళాలు జమ్మూ కాశ్మీర్‌ను అణువణువునా శోధిస్తున్నారు. అందరూ నిరాయుధులు.. సామాన్యులు.. తమను విడిచిపెట్టాలని బతిమలాడినా ఉగ్రమూకలు పట్టించుకోలేదు. తలకు తూపాకీ గురిపెట్టి అత్యంత కర్కశంగా వారిని కడతేర్చారంటే ఎంతటి మత దురహంకారులో అర్థం చేసుకోవాలి.

కశ్మీర్‌లోని బైసరన్ లోయలో జరిగిన ఈ దాడి వెనక లష్కరే తయ్యిబా చీఫ్ హాఫీజ్ సయీద్ హస్తం ఉన్నట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. సయీద్‌తో పాటు అతడి ముఖ్య అనుచరుడు సైఫుల్లా..ఉగ్రమూకలను అమాయకుల మీద ఊసిగొల్పారని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఎల్‌ఈటీకి అనుబంధంగా ఉన్న కరుడుగట్టిక ఉగ్రవాదుల బృందం బైసరన్‌లో నిర్దాక్షిణ్యంగా 26 మంది అమాయకులను మట్టుపెట్టింది. నిఘా వర్గాల సమాచారం ప్రకారం, ఈ బృందంలో ప్రధానంగా విదేశీ ఉగ్రవాదులు ఉంటారు. వీరికి స్థానిక మిలిటెంట్లు తోపాటు కశ్మీర్‌లో మద్దతుదారులు మరికొందరు పని చేసినట్టు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. పాక్ ప్రభుత్వ మద్దతుతో హాఫీజ్ సయీద్, అతడి ముఖ్య అనుచరులు ఈ ఉగ్రమూకలకు నేరుగా సహాయపడి ఉండొచ్చని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఎప్పుడైనా టెర్రరిస్టులు పాక్ నుంచే వస్తుంటారు. పాక్ నుంచే శిక్షణ పొందుతారు. పాక్ వారిని ఉసిగొల్పుతుంది. కనుక మనం తీసుకునే చర్యలు ప్రపంచం కూడా హర్షించేలా.. పాక్ నడ్డివిరిచేలా ఉండాలి. పాక్ ఇక జన్మలో కోలుకోకుండా చేయాలి. దెబ్బకొడితే జీవితాతంతం మరచిపోకుండా చేయాలి. అప్పుడే మనకు ఈ ఉగ్రదాడుల బెడద ఉండదు. అయితే ఎంతసేపు ఎవరు దాడిచేస్తారో అన్న అప్రమత్తతో పాటు ఉగ్రవాదుల ఏరివేతలో ఇజ్రాయిల్ సహకారం తీసుకుంటే మంచిది.

# కాందహార్ హైజాక్ నుంచి క్రమంగా దాడులు

- పాక్‌లో తిష్టవేసి మాస్టర్ ప్లాన్స్ వేస్తున్న టెర్రర్ గ్రూపులు
- హాఫీజ్ సయీద్ ఇందులో మాస్టర్ మైండ్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 25 :** కాందహార్ విమానం హైజాక్ ఘటనను ఏ భారతీయుడు మరచిపోడు. నేపాల్ వెళ్లిన ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్ చేయించి, జైలు నుంచి విడుదలయిన ఉగ్రవాదులంతా పాక్‌లోనే ఉన్నారు. వారే తదుపరి అనేక టెరరర్ దాడులకు మూలకారుకులు. ముంబై మారణకాండ లాంటి ఘటనలకు కారకుడైన హాఫీజ్ సయీద్.. టెర్రరిస్టులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించి పోషిస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. గత కొంతకాలంగా ఈ టెర్రరిస్టు బృందం కశ్మీర్ లోయలో క్రియాశీలకంగా ఉన్నట్టు నిఘా వర్గాలు చెబుతున్నాయి. గతేడాది సోనమార్గ్, బూతాపత్రీ, గండేర్బల్ దాడుల్లో ఈ బృందమే పాలు పంచుకుంది. గత అక్టోబర్‌లో బూతాపత్రిలో జరిగిన దాడిలో ఇద్దరు ఆర్మీ జవాన్లు సహా మొత్తం నలుగురు మృతి చెందారు. అదే నెలలో సోనామార్గ్ టెన్నెల్ కార్మికులను టార్గెట్ చేస్తూ జరిగిన దాడిలో ఆరుగురు కార్మికులతో పాటు ఓ డాక్టర్ కూడా కన్నుమూశారు. అయితే, గత డిసెంబర్‌లో ఈ టెర్రరిస్టు బృందానికి చెందిన జునైద్ అహ్మద్ భట్ అనే లష్కర్ ఉగ్రవాదిని భద్రతా దళాలు మట్టుపెట్టాయి. మిగిలిన వారు ఎలాగోలా తప్పించుకుని, సమీప అడవుల్లోకి పారిపోయారు. భారీ దాడి చేశాక ఈ ఉగ్రమూకలు అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లిపోతా యని నిఘా వర్గాలు చెబుతున్నాయి. పాకిస్థానీ హ్యాండ్లర్ల నుంచి తదుపరి ఆదేశాలు అందే వరకూ అక్కడి అడవుల్లోనే తలదాచుకుంటారని తెలిపాయి. తాజా దాడిలో పాల్గొన్న ఊగ్రవాదులు ఎల్‌ఈటీ చీఫ్ హాఫీజ్ సయీద్‌తో పాటు అతడి ముఖ్య అనుచరుడు నియంత్రణలోని వారే అని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. వీరికి పాక్ మిలిటరీతో పాటు- ఐఎస్ఐ నుంచి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అంది ఉండొచ్చని అనుమానిస్తున్నాయి. బైసరన్ లోయలో మూడు ప్రాంతాలను టార్గెట్ చేసుకున్న ఉగ్రమూకలు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. పోలీసుల కథనాల ప్రకారం, ఓ ప్రాంతంలో ఐదు మందిని, మరో మైదాన ప్రాంతంలో ఇద్దరిని, లోయ సరిహద్దు వద్ద మిగతా వారిని ఉగ్రవాదులు బలి తీసుకున్నారు. ఫెన్సింగ్ దాటి పారిపోగలిగిన వారు ఈ దాడి నుంచి తప్పించుకోగలిగారు. మరోవైపు, దాడికి పాల్పడిన వారి రేఖాచిత్రాలను జమ్మూ కశ్మీర్ పోలీసులు విడుదల చేశారు. వీరిలో ఇద్దరు పాకిస్థానీలు కాగా మరొకరు స్థానిక అనంత్‌నాగ్ జిల్లా వాస్తవ్యుడు. నిందితుల ఆచూకీ చెప్పిన వారికి రూ.20 లక్షల నజరానాను కూడా పోలీసులు ప్రకటించారు. సమీప అడవుల్లో ఉగ్రవాదులు తలదాచుకున్న స్థావరాలను గురువారం భద్రతా దళాలు గుర్తించాయి. వారి జాడ కనిపెట్టేందుకు భద్రతా దళాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధ మేఘాలు అలుముకుంటున్నాయి. భౌతికమైన దాడులే కాకుండా పాక్ గుండెను దెబ్బతీసేలా చర్యలకు భారత్ పూనుకుంది. సింధునదీ జలాల నిలిపివేత ఇందులో ప్రధానమైనదని చెప్పాలి. ఎందుకంటే జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడిలో పాకిస్తాన్ పాత్ర స్పష్టంగా కనిపిస్తోంది. లష్కరే తోయిబా అనుబంధ ఉగ్రసంస్థ టీఆర్ఎఫ్ ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది టూరిస్టుల మరణించారు. దీంతో ప్రజలు పాకిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే అరేబియా సముద్రంలోకి భారత నేవీ ఐఎన్ఎస్ విక్రాంత్ ప్రవేశించింది. ఇది ప్రస్తుతం పాకిస్తాన్ దిశలో ఉంది. భారత నేవీ సీ స్కిమ్మింగ్ టార్గెట్లను ఖచ్చితంగా ఛేదించే పరీక్షల్ని విజయవంతంగా నిర్వహించింది. ఇదిలా ఉంటే, మరోవైపు భారత వైమానిక దళం తన కీలకమైన సైనిక విన్యాసాలను చేపట్టింది. ఎక్సర్సైజ్ ఆక్రమన్ పేరు భారీ ఎత్తున సైనిక విన్యాసాలు నిర్వహించింది. గురువారం సెంట్రల్ సెక్టార్‌లో పెద్ద ఎత్తన వార్ గేమ్ ఎక్సర్సైజ్ నిర్వహించింది. పర్వతాలు, భూతల లక్ష్యాలను దాడి చేసే సామర్థ్యాలపై దృష్టి పెట్టింది. ఈ ఎక్సర్సైజ్‌లో రాఫెల్ యుద్ధ వివానాలు పాల్గొన్నాయి. ఇందులో లాంగ్ రేంజ్ దాడులు, శత్రు స్థావరాలపైన దాడుల వంటి వాటిని నిర్వహించాయి. వైమానిక దళాని చెందిన కీలక ఆస్తులు పలు వైమానిక స్థావరాల నుంచి తూర్పు వైపుగా తరలించినట్లు- తెలుస్తోంది. పంజాబ్ అంబాలాలో, పశ్చిమ బెంగాల్ హాషిమారాలో వైమానిక దళం రెండు రాఫెల్ స్క్వాడ్రన్లను మోహరించింది.

# బందిపొరాలో ఎన్‌కౌంటర్..

## లష్కరే టాప్ కమాండర్ హతం..



**జమ్మూకశ్మీర్ :** జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర మూకలపై భద్రతా దళాలు తుపాకులు గర్జిస్తున్నాయి. తాజాగా లష్కరే టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీని మట్టుబెట్టాయి. పహల్గాం దాడిలో పాల్గొన్న వారి కోసం జల్లెడపడుతున్న భద్రతా దళాలకు బందీపొరాలో అల్తాఫ్ ఆచూకీ తెలిసింది. శుక్రవారం ఉదయం ఆర్మీ-పోలీసు దళాలు జాయింట్ ఆపరేషన్ చేపట్టాయి. ఈక్రమంలో ఉగ్రవాదులను గుర్తించడంతో ఎన్‌కౌంటర్ మొదలైంది. తొలుత ఓ ఉగ్రవాది గాయపడ్డాడు. ఆ తర్వాత భద్రతా దళాల్లోని అధికారి బాడీగార్డులకు తూటాలు తాకాయి. ఈక్రమంలో అల్తాఫ్‌ను మట్టుబెట్టాయి. ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది కశ్మీర్‌లో అడుగుపెట్టిన వేళ ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకోవడం గమనార్హం.

**పహల్గాం ఉగ్రమూకకు నేరుగా హాఫీజ్ సయీద్‌తో లింకులు..**

పహల్గాంలో ఉగ్రదాడి వెనక లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్ పాత్ర నేరుగా ఉన్నట్లు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. కశ్మీర్‌లో చురుగ్గా పనిచేస్తున్న మాడ్యూల్‌ను అతడే స్వయంగా నియంత్రిస్తున్నట్లు గుర్తించారు. దీనిలో అత్యధిక మంది విదేశీ ఉగ్రవాదులు, కొందరు మాత్రమే స్థానికులు ఉండేటట్లు చూసుకొన్నారు. వీరికి అండగా క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ, లాజిస్టిక్స్, దాక్కొనేందుకు ప్రదేశాలు ఏర్పాటుచేసేందుకు కొందరు స్థానికులు పనిచేసేవారు. ఈ ఉగ్రబృందం కొన్నేళ్ల నుంచి ఇక్కడ చాలా దాడుల్లో పాల్గొంది. గత రెండేళ్లలో జరిగిన సోనమార్గ్, బూటపత్రి, గందర్బాల్ జరిగిన హైప్రొఫైల్ దాడుల్లో కూడా ఇవి పాల్గొన్నాయి. గతేడాది అక్టోబర్‌లో బూటపత్రిలో ఇద్దరు ఆర్మీ సిబ్బందిని హత్య చేసింది. అదే నెలలో సోనమార్గ్ సొరంగంలో పనిచేస్తున్న ఆరుగురు కార్మికులను కాల్చిచంపింది. ఈ ఉగ్ర బృందంలో కీలక సభ్యుడైన జునైద్ అహ్మద్ భట్ డిసెంబర్‌లో భద్రతా దళాలు దాచిగామ్ వద్ద ఎన్‌కౌంటర్ చేశాయి. మిగిలిన ఉగ్రవాదులు పారిపోయారు. ఆ తర్వాత ఈ బృందం చాలాకాలం అడవుల్లో ఎవరి కంటా పడకుండా గడిపింది. ఈ బృందం నేరుగా హాఫీజ్ సయీద్, అతడి డిప్యూటీ సైఫుల్లా నుంచే ఆర్డర్లు తీసుకొనేది. ఇంటెలిజెన్స్ బృందాల అంచనాల ప్రకారం వీరికి భావజాలంతోపాటు ఇతర ఏర్పాట్లు వ్యూహాత్మకంగా సలహాలు, సూచనలు పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, మిలిటరీ నుంచి వచ్చేవని తెలిపారు. ఈ ఉగ్ర మూక పహల్గాంలో మూడు ప్రదేశాల్లో అత్యధికమందిని చంపారు. తొలుత ఒకచోట ఐదుగురిని కాల్చగా.. మైదాన ప్రాంతంలో ఇద్దరిని.. పారిపోయేందుకు యత్నించిన వారిలో చాలామందిని కంచె వద్ద హత్య చేశారు. ఈ ఉగ్రమూకలో హషీమ్ ముసా, అలిభాయ్ పాక్ జాతీయులు. ఈ మొత్తం బృందంలో ప్రతి సభ్యుడిపైనా ప్రభుత్వం రూ.20 లక్షల రివార్డ్‌ను ప్రకటించింది.

# పాక్ జాతీయుల వీసా సస్పెన్షన్లు

## సీఎంలతో మాట్లాడిన అమిత్‌షా..



**న్యూఢిల్లీ :** ఆయా రాష్ట్రాల్లో ఉన్న పాక్ జాతీయులను గుర్తించి వారిని వెనక్కి పంపించే ఏర్పాట్లు చేయాలని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా అన్ని రాష్ట్రాలను కోరారు. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. తొలుత స్థానికంగా ఉంటున్న పాకిస్థానీయులను గుర్తించి ఆ సమాచారం కేంద్రానికి పంపించాలని కోరారు. అప్పుడే వారి వీసాల రద్దుకు అవకాశం ఉంటుందన్నారు. గతంలో భారత్ సార్క్ వీసా పొడిగింపు పథకం కింద చాలా మంది పాక్ జాతీయులకు భారత్‌లో పర్యటించే అవకాశాలను కల్పించారు. ఈ ప్రోగ్రామ్ కింద భారత్‌లో ఉన్న ఎవరైనా సరే 48 గంటల్లో దేశాన్ని వీడాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. మెడికల్ వీసాలు పొందిన వారికి మాత్రం ఏప్రిల్ 29వ తేదీ వరకు అవకాశం ఉంది. ఇక పాక్ నుంచి కొత్త దరఖాస్తుదారులకు వీసా సర్వీసులను తక్షణమే నిలిపివేశామని విదేశాంగ శాఖ పేర్కొంది. దీంతోపాటు పాక్‌లో ఉన్న భారత జాతీయులు తిరిగి వచ్చేయాలని అడ్వైజరీ జారీ చేసింది. అదే సమయంలో ఇక్కడ పాక్ జాతీయులు గడువు ముగిసేలోపు దేశం విడిచి వెళ్లిపోవాలని హెచ్చరించింది. పహల్గాంలో ఉగ్రవాదులు 26 మంది అమాయకుల ప్రాణాలు తీయడంతో భారత్ తీవ్రంగా స్పందించింది. ఈ క్రమంలో పాక్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ నిర్ణయించింది. దీంతో సింధూ జలాల ఒప్పందం నిలిపివేతతో పాటు.. పాక్ జాతీయులు భారత్‌ను వీడాలని నిర్ణయం తీసుకుంది.

# సంయమనం పాటించండి

## భారత్, పాక్‌లకు ఐక్యరాజ్యసమితి సూచన



**యూఎన్ :** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన భీకర ఉగ్రదాడి ఘటనను భారత్ సహా ప్రపంచం తీవ్రంగా ఖండిస్తోంది. ఈ ఆందోళనకర పరిస్థితిని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ నిశితంగా పరిశీలిస్తున్నారని ఐరాస అధికార ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ పేర్కొన్నారు. ఉగ్రదాడిని యూఎన్ తీవ్రంగా ఖండిస్తోందన్న ఆయన.. ప్రస్తుతం ఇరుదేశాలు సంయమనం పాటించాలని సూచించారు. గురువారం విలేకరుల సమావేశంలో స్టీఫెన్ మాట్లాడుతూ.. 'జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఐరాస తీవ్రంగా ఖండిస్తోంది. పౌరులపై దాడి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. గుటెర్రస్ ఈ ఆందోళనకర పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నారు. భారత్-పాక్ దేశాలు సంయమనం పాటించాలని కోరుతున్నాం. ఇరుదేశాల మధ్య ఏదైనా సమస్య ఉంటే శాంతియుత చర్చలతో వాటిని పరిష్కరించుకుంటారని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. ఇక, ఉగ్రదాడికి స్పందనగా సింధూ నదీ జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీనిపై విలేకరులు ప్రశ్నించగా.. ఈ ఉద్రిక్తతల వేళ నిబంధనలపై ఇరుదేశాలు సంయమనం పాటించి, పరిస్థితులు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకుంటాయని ఆశిస్తున్నామన్నారు. మంగళవారం పహల్గాంలో సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు పురుషులే లక్ష్యంగా కాల్పులు జరిపారు. ఈ దాడుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. మరికొందరు ప్రాణాలతో తప్పించుకున్నారు. ఇది సీమాంతర కుట్రే అని, సూత్రధారులను దోషులుగా నిలబెడతామని భారత్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.



# స్వాతంత్య్ర సమరయోధులను అపహాస్యం చేయొద్దు

## రాహుల్‌కు సుప్రీం మందలింపు

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. వీర్ సావర్కర్‌కు మహారాష్ట్ర ప్రజలు ఎంతో గౌరవం ఇస్తారని పేర్కొన్న జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం.. మరోసారి ఇటువంటి వ్యాఖ్యలు చేయొద్దని మందలించింది. స్వాతంత్ర్య సమరయోధులను ఎగతాళి చేయడం తగదని.. మళ్లీ ఇటువంటి వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. దేశం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులపై ఎవరూ ఇటువంటి వ్యాఖ్యలు చేయడానికి అనుమతించమని పేర్కొంది. వారిని అపహాస్యం చేస్తే ఇకపై కోర్టు సుమోటోగా విచారణ చేపడుతుందని తెలిపింది. సావర్కర్‌పై వ్యాఖ్యల విషయంలో రాహుల్‌పై దాఖలైన కేసులో ఆయనపై క్రిమినల్ చర్యలను సుప్రీంకోర్టు నిలిపివేసింది. రాహుల్‌పై ఫిర్యాదు చేసిన నృపేంద్ర పాండేకు, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో తనకు జారీ చేసిన సమన్లను రద్దు చేయడానికి నిరాకరించిన అలహాబాద్ హైకోర్టు ఆదేశాన్ని రాహుల్ గాంధీ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. మహారాష్ట్రలో 2022లో మీడియా సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. వీర్ సావర్కర్ బ్రిటిష్ సేవకుడని, వారి నుంచి పెన్షన్ కూడా తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు స్వాతంత్ర్య సమరయోధుడైన వీర్ సావర్కర్‌ను కించపరిచేలా ఉన్నాయని ఆరోపిస్తూ నృపేంద్ర పాండే అనే వ్యక్తి యూపీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని అందులో పేర్కొన్నారు. అయితే, దీనిపై అనేకసార్లు విచారణకు గైర్హాజరవుతున్న నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని న్యాయస్థానం రాహుల్‌కు రూ.200 జరిమానా విధించింది.




# నీట్ పేపర్ లీకేజీ కేసు..

## ప్రధాన నిందితుడి అరెస్టు

**న్యూఢిల్లీ :** వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన 'నీట్-యూజీ ప్రవేశపరీక్ష 2024 'లో ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడైన సంజీవ్ ముఖియాను ఆర్థిక నేర విభాగం (ఈవోయూ) బృందం అరెస్టు చేసింది. గురువారం రాత్రి అతడిని పట్నాలో అరెస్టు చేశామని ఈవోయూ అధికారి నయ్యర్ హుస్సేన్ ఖాన్ వెల్లడించారు. నీట్ పేపర్ లీకేజీ కేసులో ప్రధాన కుట్రదారుగా సంజీవ్ ముఖియా పేరు వినిపించింది. ఈ వివాదం నేపథ్యంలో అతడు పరారయినట్లు వార్తలు వచ్చాయి. ఇటీవల బిహార్ ప్రభుత్వం సంజీవ్‌పై రూ.3లక్షల నజరానా ప్రకటించింది. ఈక్రమంలోనే అతడు పట్నాలోని ఒక అపార్టుమెంట్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో అధికారులు అతడిని అరెస్టు చేశారు. ముఖియా అరెస్టుతో పేపర్ లీక్‌కు కారుకులైన మరింతమంది వ్యక్తుల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. బిహార్‌లోని నలందా జిల్లా నాగర్‌సోనా ప్రాంతానికి చెందిన సంజీవ్ తొలుత సాబూర్ అగ్రికల్చర్ కాలేజీలో పని చేసేవాడు. అక్కడ పేపర్ లీక్ చేసినట్లు ఆరోపణలు రావడంతో 2016లో అతడిపై వేటు వేశారు. ఆ కేసులో కొన్నాళ్ల పాటు జైలు శిక్ష కూడా అనుభవించాడు. అనంతరం నలందా కాలేజీ నూర్‌సరయ్ బ్రాంచ్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా చేరాడు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై మధ్యవర్తులు, విద్యార్థులు సహా 14 మందిని బిహార్ పోలీసులు అరెస్టు చేసి విచారించగా.. సంజీవ్ ముఖియా పేరు ప్రధానంగా బయటకొచ్చింది. కాగా.. సంజీవ్ కుమారుడు శివ్‌కుమార్‌కూ ఈ వ్యవహారంలో హస్తం ఉన్నట్లు తేలింది. బిహార్ ఉపాధ్యాయ నియామక పరీక్ష పేపర్ లీక్ కేసులో అరెస్టై ప్రస్తుతం జైల్లో ఉన్నాడు. వీరిద్దరూ 'ముఖియా సాల్వర్ గ్యాంగ్' పేరుతో ఓ ముఠాను ఏర్పాటుచేసినట్లు తెలిసింది.



## నిజామాబాద్ రీజినల్ మేజర్ లీగ్ బేస్ బాల్ ఛాంపియన్
## నిజామాబాద్ పైరేట్స్ (సత్యశోధక్ జట్టు)

**నిజామాబాద్ జిల్లా సిరికొండ ( తెలుగు జనశక్తి ) ఏప్రిల్ 25:** ఆర్మూర్ మినీ స్టేడియం క్రీడా మైదానంలో ఈనెల 21నుండి 24 వరకు జరిగిన మేజర్ లీగ్ బేస్ బాల్ అండర్ 11 ఛాంపియన్ షిప్ పోటీలలో నిజామాబాద్ పైరేట్స్ (సత్యశోధక్హౌజట్టు) విజేతగా నిలిచి ఛాంపియన్ షిప్ నుహౌకైవసం చేసుకోవడమైనదని తెలుపుటకు సంతోషిస్తున్నాము. రీజినల్ స్థాయిలో లిగ్ దశలో నిజామాబాద్ పైరేట్స్ (సత్యశోధక్ )హౌజట్టుతో పాటు 12 జట్లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్లో నిజామాబాద్ పైరేట్స్ (సత్యశోధక్ జట్టు) తొర్లికొండ జట్టుపై ఘన విజయం సాధించి ఛాంపియన్లు గా నిలిచి మేజర్ లీగ్ బేస్ బాల్ కప్ ఇండియా హెడ్ ఇంచార్జ్ జపాన్ కు చెందిన మిస్టర్ రియో చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నారు. సత్యశోధక్ పాఠశాల జట్టులో పాఠశాలకు చెందిన నరేందర్, శ్రీహిత్ రెడ్డి, శ్రీకాంత్, శరత్ చంద్ర, తిరుపతి, సాత్విక్, జశ్వంత్, మనోజ్, హేమంత్, శ్రీవర్ధన్, రిత్విక్, సాయి సృజన్ లు సభ్యులుగా, పాఠశాల పి.ఈ.టి. ఉపాధ్యాయులు బాదావత్ సంతోష్, దండు అనిల్ లు కోచ్ మేనేజర్లుగా వ్యవహరించారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో జూన్ మొదటి వారంలో జరగనున్న జాతీయ మేజర్ లీగ్ బేస్ బాల్ ఇండియా కప్ -2025 పోటీలకు నిజామాబాద్ పైరేట్స్ (సత్యశోధక్) జట్టుహౌవింపికైంది. నిజామాబాద్ రీజినల్ లీగ్ బేస్ బాల్ అండర్11 విభాగంలో సత్యశోధక్ పాఠశాల జట్టు ఛాంపియన్ గా నిలవడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య హర్షం వ్యక్తం పరుస్తూ జట్టు విజయానికి కృషి చేసిన పాఠశాల క్రీడాకారులను, కోచ్ మేనేజర్లను మరియు సహకారం అందించిన విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలియపనైనది.




## కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పికొట్టండి
### టియుసిఐ జిల్లా కార్యదర్శి రమేష్

**నిజామాబాద్ జిల్లా సిరికొండ (తెలుగు జనశక్తి) ఏప్రిల్ 25 :** 139వ,మే డే పోరాట స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక చట్టాలను త్రిప్పికొట్టాలని, మేడే రోజున వాడవాడల్లో ఏరియాజెండాలను ఎగరేసి మేడేను జరపాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ)జిల్లా కార్యదర్శి ఆర్. రమేష్ కార్మిక వర్గానికి పిలుపును ఇచ్చారు. శుక్రవారం నాడు సిరికొండ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ముందు కార్మికులతో కలిసి మేడే పోస్టర్స్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ) జిల్లా కార్యదర్శి ఆర్. రమేష్ మాట్లాడుతు: 1886లో కార్మిక వర్గం పోరాడి సాదించుకున్న హక్కులను నేడు పాలక వర్గాలు రద్దుచేసి కార్మికలను బలిపశువులను చేశారు అన్నారు. యాంత్రిక రణతో శ్రామికుడు 8 గంటలకు బదులు నాలుగు గంటలు చేసినా సరిపోతుం ది కానీ పెట్టుబడుదారుడు కానుగుల రక్త మాంసం పీల్చడానికి 12 గంటల వరకు పనిచేపిస్తూ శ్రమ దోపిడి చేపిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాడు సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 15 చట్టాలను అడ్రస్ లేకుండా చేసిందన్నారు. మిగతా 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ ఆమోదించి అమలు చేయడం వలన కార్మికులను కార్మికులను కట్టు బానిసలు గా చేయడం తప్ప మరొకటి కాదన్నారు. ఒకపక్క 15 లక్షల కోట్ల రాయితీలు పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు ప్రకటించి కార్మికులను విస్మరించి వారి పుట్ట కొడుతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు యజమానియానికి అప్పగిస్తూ కారి కార్మికుల ఉపాధి లేకుండా చేస్తున్నారన్నారు. కార్మిక వర్గం ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలు అర్థం చేసుకొని ఇక పోరాటంలో మమేకమై సమాజంలో సాధనకు కృషి చేయాలి అన్నారు. కార్మిక పోరాట దినం మేడేను గ్రామ గ్రామాల్లో ఎర్ర జెండాలు ఎగరవేసి ఘనంగా నిర్వహిం చాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు ఆర్ దామోదర్ జి సాయరెడ్డి బోర్రన్న బాల కిషన్ సుజాత సాయవ్వ రాజవ్వ తదితరులు పాల్గొన్నారు.




## జమ్మూ కాశ్మీర్ పహల్గావ్‌లో ఉగ్రవాద దాడిని ఖండిస్తున్నాం
### కాంగ్రెస్ పార్టీ నాయకుడు మట్టె ప్రసన్న కుమారు

**కూకట్‌పల్లి, తెలుగు జనశక్తి, ఏప్రిల్ 25 :** జగద్గిరి గుట్టలో అవర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొని వారి ఆత్మలకు శాంతి చేకూరాలని నివాళులు అర్పించిన.బాలనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ పహల్గావ్ లో మన భారతదేశం లోని మన దేశ పౌరులపై దాడి చేసిన చంపిన ఉగ్రవాదులను నడిరోడ్డుపై ఉరితీయాలని డిమాండ్ చేశారు.

## పేద కుటుంబాలకు కుట్టు మిషన్ల పంపిణీ
### ఎంఎల్ఏ మాధవరం కృష్ణారావరావు

**కూకట్‌పల్లి, తెలుగు జనశక్తి, ఏప్రిల్ 25 :** పేద ప్రజలకు అండగా ఉంటూ పేద కుటుంబాల మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉచితంగా కుట్టు శిక్షణ కార్యక్రమం చేపట్టడంతో పాటు శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమిషన్‌లను అందించడం అభినందనీయమని కూకట్పల్లి ఎంఎల్ఏ మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా అక్కడి మహిళలు కుట్టు శిక్షణ కార్యక్రమంలో కుట్టిన పలు వస్త్రాలను, నూతన డిజైన్ డ్రెస్ లను పరిశీలించారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు, మిషన్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుమారస్వామి , సుబ్బారావు అందిస్తున్న సేవలను అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని, మిషన్ల పంపిణీ కార్యక్రమానికి తనవంతు సహకారం అందిస్తామని





తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు ఆరువేల మందికి కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నామని, నేర్చుకున్న వారికి ఉచితంగా మిషన్లను కూడా అందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని మహిళలందరికి ఉపయోగపడేలా సుమారు నాలుగువేల గజాల స్థలాన్ని కూడా ఎంపిక చేసి కేటాయింపుకు కలెక్టర్ కు లేక రాయడం జరిగిందన్నారు. స్థలం కేటాయింపు జరిగితే మహిళకు మంచి భవనం నిర్మించి అందులోనే మహిళా బ్యాంక్ కూడా ఏర్పాటు చేసి పలు ఉపాధి శిక్షణ కార్యక్రమాలను అందించి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయడం జరిగిందన్నారు. దురదృష్ట వశాత్తు బీ ఆర్ ఎస్ ప్రభుత్వం రాలేదని, ఇప్పుడున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో తప్పకుండా స్థలాన్ని కేటాయించి మహిళలకు భవనం నిర్మించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## ఛలో వరంగల్ సభకు భారీగా తరలి రండి
### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**కూకట్‌పల్లి, తెలుగు జనశక్తి, ఏప్రిల్ 25 :** తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవ నినాదమైన ప్రత్యేక రాష్ట్ర సాధనను ప్రపంచ నలుమూలల చాటి చెప్పి దేశ పాలకులను మెప్పించి ఒప్పించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన జెండా బీ ఆర్ ఎస్ రజతోత్సవ పండుగకు ఉవ్వెత్తున తరలి రండి.. తెలంగాణ జాతి పిత కేసిఆర్ నాయకత్వంలో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితి అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్ర సాధనను సుసాధ్యం చేసి దేశంలోనే అన్ని రంగాల్లో అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్ది షహభాష్ అనిపించేలా దశాబ్ద కాలంపాటు పాలించిన కేసిఆర్ నాయకత్వానికి మద్దతుగా మేళ తాళాలతో డప్పు వాయిద్యాలతో తరలి రండి తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవ జెండాకు వందనం సమర్పించి వరంగల్ ఎల్కతుర్తి వద్ద జరిగే భారీ బహిరంగ "రజతోత్సవ సభ " కు కూకట్పల్లి నియోజక వర్గం నుండి అన్ని డివిజన్ల లోని అన్ని కాలనీలు బస్తీల నుంచి బస్సులు కార్లలో వేలాదిగా తరలిరావాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. ఖనియోజకవర్గంలో జనసమీకరణ, బస్సుల రూట్ మ్యాప్ కో ఆర్డినేషన్ చేయడం కోసం సతీష్ అరోరా, డివిజన్లు కు ఓల్డ్ బోయినపల్లి - భోగాది దినేష్ నాయుడు, బాలానగర్ - టి. వీరాంజనేయ చారి, బొట్టు విష్ణు, ఫతేనగర్ - మొలుగు తిరుపతి రావు, శ్రీనివాస్, మూసాపేట - ఇ సర్వేశ్వరరావు (నాని), అల్లాపూర్ - రావెల్ షా, బాలాజీనగర్ - పాతూరి గోపి, కె పి హెచ్ బీ - జన్ను సాయి శ్రీనివాస్, కూకట్ పల్లి - బి సురేష్ కుమార్, బేగంపేట - రాధాకృష్ణ లను నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## యూత్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

**కామారెడ్డి జిల్లా బిక్కనూర్ ఏప్రిల్ 25,(తెలుగు జనశక్తి) :** భిక్కనూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీరామ్ వెంకటేష్ ఆధ్వర్యంలో మండల స్థాయి యూత్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల కార్యకర్తలు పాల్గొని రాబోయే ఎన్నికలలో యువతకు ఉన్నటువంటి ప్రాధాన్యత, అలాగే పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు అవలంభించాల్సిన విధానాలను గురించి అవగాహన కల్పించడానికి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ రామ్ వెంకటేష్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ఉన్న ప్రాముఖ్యత మరియు ఎన్నికల్లో పోటీ చేసేటటువంటి యువతకు ప్రతి ఒక్క కార్యకర్త సహకారం అందించి ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి పథకాలను విస్తృత స్థాయిలో ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించుకోవాల్సిందిగా కోరడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా శ్రీ మహమ్మద్



అలీ షబ్బీర్ మరియు యువ నాయకులు శ్రీ ఇలియాస్ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రాజీవ్ వికాసం పథకం లాంటి పథకాలను అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారులకు అందే విధంగా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో బిక్కనూర్ మండలంలోని అన్ని గ్రామాల కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## అక్రమ నిర్మాణాలపై ప్రజల ఆగ్రహం

**మేడ్చల్ జిల్లా నాగారం తెలుగు జనశక్తి ఏప్రిల్ 25 :** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సూర్య నగర్ కాలనీలో అనుమతులకు విరుద్ధంగా అక్రమ భవన నిర్మాణం జరుగుతుండటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, అసలు మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. భవనం నిర్మిస్తున్న నిర్మాణదారుడికి వత్తాసు పలుకుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు అందుబాటులో ఉండటం లేదని, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టిపిఓ) ఉన్నారో లేదో కూడా అనుమానంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణం జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వానికి గండి కొడుతూ, అక్రమ నిర్మాణాలకు అండగా ఉంటూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న స్థానిక రాజకీయ నాయకుల చేతిలో సిబ్బంది కీలుబొమ్మలుగా మారారా అని స్థానిక ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ అక్రమ



నిర్మాణంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## పది నెలల కుమారుడుకు లివర్ సమస్య
### ఎంఎల్ఏ మాధవరం కృష్ణారావరావు ఆర్థిక సహాయం

**కూకట్‌పల్లి, తెలుగు జనశక్తి, ఏప్రిల్ 25 :** అల్లాపూర్ డివిజన్ రాణా ప్రతాప్ నగర్ కు చెందిన బిఆర్ఎస్ యువ నేత శివ తన పది నెలల కుమారుడుకు లివర్ ఆపరేషన్ నిమిత్తం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రెండు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది నెలల బాబుకి లివర్ ఆపరేషన్ చేయడం ఎంతో కష్టంతో కూడుకున్న పని అని... బాబు తల్లి లివర్ డొనేట్ చేశారు అని.. ఆ బాబు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.



## పాలనలో పార్టీ ముద్ర వేయడానికి
## తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కాంగ్రెస్ మీటింగ్

**కూకట్‌పల్లి, తెలుగు జనశక్తి, ఏప్రిల్ 25 :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ మీటింగ్ ఆయన నివాసంలో జరిగింది ఈ కార్యక్రమానికి కూకట్పల్లి ఇంచార్జ్ బండి రమేష్ హాజరై పార్టీ పటిష్టానికి పాలనలో పార్టీ ముద్ర వేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై తన వంతు సలహా సూచనలను అందజేశారు మాజీ ఎమ్మెల్యేలు టిపిసిసి జనరల్ సెక్రటరీల సమావేశం జరిగింది కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కోఆర్డినేటర్ గా నియమించబడ్డ బడంగ్పేట్ మాజీ మేయర్ పారిజాత నరసింహారెడ్డి కుత్బుల్లాపూర్ ఉప్పల్ మేడ్చల్ మల్కాజ్గిరి నియోజకవర్గాల ఇన్చార్జిలు హాజరయ్యారు.



## 'ఐ' విజన్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్‌పల్లి, తెలుగు జనశక్తి ఏప్రిల్ 25 :** మోతీ నగర్ లోని లైన్స్ క్లబ్ బంజారాహిల్స్ సౌజన్యంతో పాండురంగారావు నగర్ పార్కు వద్ద సాధురం హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన "ఐ" విజన్ సెంటర్ ను ప్రారంభించారు... ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కంటి సమస్యలు ఉన్నవారు ఎవరైనా ఈ శిబిరం వద్ద పరీక్షలు నిర్వహించుకోవచ్చు అని .. అన్ని ఏర్పాట్లు చేసిన లైన్స్ క్లబ్ బంజారాహిల్స్ సభ్యులను అలాగే సాధురం ఆస్పటల్ సిబ్బందిని అభినందించారు.. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ సభ్యులు మరియు సాధురం ఆస్పటల్ సిబ్బంది మాట్లాడుతూ ఈ కంటి శిబిరం మోతీ నగర్ పాండురంగారావు నగర్ పార్కు వద్ద ప్రతినెల 2 మరియు 4 వ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని ..ఎవరైనా కంటి సమస్యలు ఉన్న ఎడల ఇక్కడ పరీక్షలు చేయించుకోవచ్చు అని.. అలాగే సమస్య ఉన్నవారికి ఉచితంగా మందులు, ఆపరేషన్లు కూడా తామే చేయిస్తామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో మాజీ మల్టిపుల్ చైర్ పర్సన్ ప్రేమ్ కుమార్, సాధురం హాస్పటల్ చైర్మన్ హరీష్ సహాని, సెక్రటరీ కిషోర్ చాపియా, లైన్స్ క్లబ్ మెంబర్లు.. టీవీ. సుబ్బారావు, నాగరాజు, సత్యనారాయణ మరియు ఇతర సిబ్బంది కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## చీర్యాల లక్ష్మి నరసింహా స్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవం

**మేడ్చల్ జిల్లా కీసర తెలుగు జనశక్తి ఏప్రిల్ 25 :** మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రివర్యులు చామకూర మల్లారెడ్డి కీసర మండలం చీర్యాల గ్రామంలోని శ్రీ చీర్యాల లక్ష్మి నరసింహా స్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మంత్రోచ్చారణలతో పూజలు జరిపారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ, చీర్యాల లక్ష్మి నరసింహా స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని స్వామి వారిని ప్రార్థించినట్లు ఆయన వెల్లడించారు. ఈ ఉత్సవాలు గ్రామంలో ఆధ్యాత్మిక శోభను నింపుతాయని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలు మరికొన్ని రోజుల పాటు కొనసాగనున్నాయి.




## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ

**కూకట్‌పల్లి, తెలుగు జనశక్తి, ఏప్రిల్ 25 :** ఏఐసిసి, టిపిసిసి పిలుపుమేరకు జమ్మూ కాశ్మీర్ పహల్ గావ్ లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఈరోజు అనగా సాయంత్రం 7 గంటలకు పీపుల్స్ ప్లాజా నుంచి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహం వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించడం జరుగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కుటుంబానికి చెందిన అన్ని విభాగాల ప్రతినిధులు కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరైనారు.



## ఉగ్రవాదుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ప్రజలను స్మరించుకొని నివాళులు

**కూకట్‌పల్లి, తెలుగు జనశక్తి, ఏప్రిల్ 25 :** పహల్ గావ్ పర్యాటకులపై ఉగ్రవాదుల అమానుష్య దాడికి వ్యతిరేకంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కూకట్ పల్లీలో రామాలయం నుంచి తాంద్రపాపారాయుడు సర్కిల్ వరకు రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించన క్యాండిల్ ర్యాలీలో పాల్గొని ఉగ్రవాదుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ప్రజలను స్మరించుకొని కొవ్వొత్తులు వెలిగించి వారికి ఘన నివాళులు అర్పించారు, మానవత్వానికి మచ్చ తెచ్చే ఇలాంటి సంఘటనలను ఉపేక్షించేది లేదు, ఉగ్రవాదాన్ని ఈ ప్రపంచంలో ఉండకుండ నియంత్రించాల్సిన బాధ్యత ప్రపంచంలోనీ ప్రతి ఒక్కరిపై ఉందని, ఉగ్రవాదుల దాడుల్లో ప్రాణాలను కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం వారిని ఆదుకుంటుందని, ఉగ్రవాదులు మళ్లీ ఇలాంటి దాడులు చేయకుండా నరేంద్ర మోడీ చర్యలు చేపట్టారని, ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ కు మోడి గారు తగిన బుద్ధి చెప్తారని వడ్డేపల్లి రాజేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యంజల పద్మయ్య, బిజెపి సీనియర్ నాయకులు కొండయ్య చౌదరి, డివిజన్ అధ్యక్షుడు అనంత నాగరాజు, డివిజన్ నాయకులు శంకర్ రెడ్డి, కృష్ణప్రియ, దుర్గా ప్రసాద్ రావు, చంద్రప్రకాష్ రెడ్డి, వీరన్ కుమార్, ఫణీంద్ర శర్మ, విశాల్ సాగర్, మంజునాథ్ బిజెపి నాయకులు కార్యకర్తలు కర సేవకులు కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి

**నిజామాబాద్ జిల్లా సిరికొండ (తెలుగు జనశక్తి) ఏప్రిల్ 25 :** సిరికొండ మండలం పోతునూరు గ్రామానికి చెందిన పెరిక సాగర్(38) అనే వ్యక్తి నిన్న తేదీ 24.4.2025 నాడు ఇంట్లో నుండి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్ళినాడు ఈరోజు తేదీ 25 నాడు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో చిన్న వాల్ గోట్ గ్రామ శివారులోని రోడ్ల పెద్ద లింగం వరి వ్యవసాయ పొలంలో నీ బావిలో



కాలకృత్యాలు నిమిత్తం వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి వ్యవసాయ భూమిలోని బావిలో ప్రమాదవశాత్తు కాలు జారిపడి మరణించినాడు అని పెరిక సాగర్ భార్య సిరికొండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయనైనదని సిరికొండ ఎస్సై ఎల్. రామ్ తెలపనైనది.




## మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

**కామారెడ్డి జిల్లా గాంధారి తెలుగు జనశక్తి ఏప్రిల్ 25 :** తెలంగాణ రాష్ట్రంలో శిక్షణ కేంద్రం చేపట్టినటు వంటి గాంధారి మండల ప్రాంత ప్రజల మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించే లక్ష్యంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు సౌజన్యంతో గ్రామ స్వరాజ్య సంస్థ అధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని గాంధారిలో ప్రారంభించినట్లు గాంధారి మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోమండల కో ఆర్డినేటర్ నిర్మల, ఆదేశాలతో మహిళా మండలి డ్వాక్రా గ్రూప్ వివో పైమా, చేతుల మీదుగా ట్రైనింగ్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు .. గాంధారి మండలంలోని ప్రతి గ్రామంలో నెలకు ఒక గ్రామాన్ని ఎంచుకుని 30 మంది మహిళలను ఒక బ్యాచ్ గా ఏర్పాటుచేసి నెల రోజులు ఉచిత ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్ అందించడం జరుగుతుందన్నారు. గాంధారి మండలంలో మహిళా సంఘాల ద్వారా ట్రైనింగ్ అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలలో ఐకెపి ఏపీఎం గంగరాజు, సి సి రాజు, మహిళలు, డ్వాక్రా గ్రూప్ మహిళలు, ఇతరులు పాల్గొన్నారు.

## కుట్టు మిషన్లు పంచిన.. సెంటర్ ఫర్ డెవలప్మెంట్ యాక్షన్

- స్వయం ఉపాదే లక్ష్యంగా సిడిఏ సంస్థ పలు రాష్ట్రాల్లో సేవలు
- కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో రెవరెండ్ ఎనోష్ ను అభినందించిన ఆర్డిఓ రాజేందర్ గౌడ్



**కల్లూరు, ఏప్రిల్ 25 :** ఏ ఇంట్లో అయితే మహిళలు ఆర్థికంగా వెలుగుతుంటారో ఆ కుటుంబాలు అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుంటాయనే సంగతి జగమెరిగిన సత్యం అందుకే ఇంటికి దీపం ఇల్లాలంటారు..ఆ సత్యాన్ని నెరవేర్చాలనే లక్ష్యంతో మహిళల ఆర్థిక అభివృద్ధికి" సెంటర్ ఫర్ డెవలప్మెంట్ యాక్షన్" సంస్థ పనిచేయడం గర్వించదగ్గ విషయమని శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలోని చంద్రుపట్ల రోడ్డు నందు సి డి ఏ ద్వారా మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఆర్డిఓ రాజేందర్ గౌడ్ అన్నారు. ఆరు నెలల పాటు శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధితో మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయడం హర్షణీయమన్నారు.సి డి ఏ నిర్వాహకులు రెవరెండ్ పి ఎనోష్ కుమార్ ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత కుట్టుమిషన్ ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నాలుగు బ్యాచ్ లకు శిక్షణ పూర్తిచేసుకొని 5వ బ్యాచ్ కి శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉండడం సంతోషకరమన్నారు.తెలంగాణలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్,ఒరిస్సా, బీహార్ వంటి రాష్ట్రాల్లో సేవలు అందించటం గొప్ప విషయమన్నారు.భవిష్యత్తులో సిడిఏ సేవలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా పనిచేయాలని కోరుతున్నట్లు తెలిపారు.సి డి ఏ సంస్థ ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్న పి ఏనోష్ కుమార్ ని అభినందించారు.తదుపరి శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్ తో పాటు కుట్టు మిషన్ అందజేశారు.అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి సి డి ఎ నిర్వాహకులు రెవరెండ్ పి ఏనోశ్ కుమార్ మాట్లాడుతూ ఒక్కొక్క బ్యాచ్ కి శిక్షణ పూర్తయ్యేసరికి 3 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని తెలిపారు.బ్యాచ్ కి 20 మంది మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.మహిళల అభ్యున్నతతో పాటు ప్రజల స్థానిక అవసరాల మేరకు గ్రామాలలో మంచినీటి కోసం చేతి బోర్లు వేయించడం జరిగిందని ఇప్పటికే 40 బోర్లు వేయించామని తెలిపారు.నిరుపేద పిల్లలకు, అనివార్య కారణాలతో గాని,అనారోగ్య పరిస్థితుల వల్ల గాని తండ్రి లేదా తల్లిని కోల్పోయిన పిల్లలకు ఎడ్యుకేషన్ ఫీడింగ్ ఇస్తూ ఉన్నత విద్యకు సిడిఏ సహకరిస్తుందని తెలిపారు. సామాన్యుల జీవన శైలికి తగ్గట్టుగా పని చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పి.చంద్రలీల కాటేపల్లి రజనీకాంత్ కాటేపల్లి కిరణ్,ఏఐసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్నాశి బాలరాజు మీడియా సెల్ జిల్లా అధ్యక్షులు డేవిడ్ రాజు తేళ్ళ ఎబినేజర్ సమర్పణ పాల్ టెక్నో నాగిరెడ్డి లబ్ధిదారులు పాల్గొన్నారు.

## గాగిల్లాపూర్‌లో వ్యవసాయ కళాశాల స్థాపనకు స్థల పరిశీలన

**మానకొండూర్, ఏప్రిల్ 25:** మానకొండూర్ నియోజకవర్గం పరిధిలోని బెజ్జంకి మండలం గాగిల్లాపూర్ గ్రామంలో సాంఘిక సంక్షేమ గురుకుల వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయతలపెట్టిన నేపథ్యంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనూ చౌదరి సోషల్ వెల్ఫేర్ కార్యదర్శి అలుగు వర్షిని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి శుక్రవారం ఆ గ్రామాన్ని సందర్శించి స్థల పరిశీలన చేశారు కళాశాలకు కేటాయించిన స్థలం చుట్టూ తిరిగి ఎక్కడెక్కడా భవన నిర్మాణా లు చేపట్టాలో ఎక్కడెక్కడ ఎలాంటి వసతులు కల్పించాలనే విషయమై చర్చించారు ఈ సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులతో మాట్లాడుతూ వ్యవసాయ కళాశాలకు పాలనాపరమైన అనుమ తులు లభించాయని మే మాసంలో భూమి పూజ చేసేలా భవ న నిర్మాణాల పనులు చేపట్టేందుకు వెంటనే టెండర్లు పిలిచి వెన-ంవెంటనే ఆ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు అంతే కాకుండా నిర్దేశిత గడువులోగా భవన నిర్మాణా లు పూర్తిచేసేలా చూడాలన్నారు ఇందుకు సానుకూలంగా స్పందించిన సిద్దిపేట జిల్లా కలెక్టర్ బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి కి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి కృతజ్ఞతులు తెలిపారు బెజ్జంకి మండలం గాగిల్లాపూర్ లో వ్యవసాయ కళాశాల స్థాపనకు దాదాపు వంద ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ 100 కోట్లతో కళాశాల భవనాలు భవన సముదాయాలు నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా భవన నిర్మాణాలకు తొలి విడతగా రూ 47 కోట్ల రూపాయలు మంజూరు చేయనున్నది గతంలో 2023-24 విద్యా సంవత్సరంలో సిద్దిపేట డిగ్రీ కాలేజీలో నాలుగేళ్ల బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సును ప్రారంభించారు ఆ తర్వాత అక్కడే ఆగ్రికల్చర్ డిపార్ట్ మెంట్ కింద మరో కాలేజీ మంజూరు కావడంతో దాన్ని జగిత్యాలలోని సాంఘిక సంక్షేమ మహిళా కాలేజీకి మార్చారు ఈ కళాశాలను కోరుట్లలోని ప్రభుత్వ భవనంలో కొనసాగించారు అయితే అప్పటి ప్రభుత్వం వ్యవసాయ కళాశాలను మంజూరు చేసిందే తప్ప దానికి యూనివర్సి



టీ గుర్తింపును కల్పించే విషయాన్ని పూర్తిగా విస్మరించింది దీంతో వ్యవసాయ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు కళాశాలకు యూనివర్సిటీ గుర్తింపు లేక ఏ యూనివర్సిటీ అటానమస్ కింద పరీక్షలు రాయాలో తెలియని సందిగ్ధంలో విద్యార్థులు కొట్టుమిట్టాడే వారు ఇలాంటి తరుణంలో సాంఘిక సంక్షేమ గురుకుల వ్యవసాయ మహిళా కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యను గురుకులాల కార్యదర్శి అలగు వర్షిణి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు దీంతో ఆయన చొరవ తీసుకొని కమిటీ వేసి వ్యవసాయ కళాశాలకు కాలేజీ గుర్తింపునకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు కమిటీ సిఫారసుల మేరకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ ఈ కళాశాలకు గుర్తింపు ఇచ్చింది ఈ క్రమంలోనే కోరుట్లలో కొనసాగుతున్న వ్యవసాయ కళాశాలను మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు బెజ్జంకి మండలానికి తరలించిన విషయం తెలిసిందే ఈ స్థల పరిశీలనలో బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ బెజ్జంకి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి ఎఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి పార్టీ నాయకులు చెప్యాల శ్రీనివాస్ గౌడ్ బైరి సంతోష్ నర్సయ్య సుధగోని లక్ష్మినారాయణ గౌడ్ తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు బండారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## దత్తత తల్లిదండ్రులకు ఉత్తర్వులు అందజేసిన కలెక్టర్

**కరీంనగర్, ఏప్రిల్ 25:** మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పరిధిలోని కరీంనగర్ శిశు గృహలో పెరుగుతున్న ఆరు నెలల శిశువును పూనేకు చెందిన దంపతులు రెండు నెలల క్రితం దత్తత తీసుకున్నారు దత్తత తల్లిదండ్రులకు దత్తత ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని అన్నారు ఇందుకు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం భగత్ నగర్ కరీంనగర్ లో సంప్రదించాలన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి డిసిపిఓ



పర్వీన్ పిఓ తిరుపతి శిశు గృహ మేనేజర్ తేజస్వి సోషల్ వర్కర్ రాజేష్ పాల్గొన్నారు.

## పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం

- చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలి
- ప్రభుత్వ ఔషధాలను అర్హులకు అందించాలి
- శుక్రవారం సభలో కలెక్టర్ పమేలా సత్పతి

**హుజురాబాద్, ఏప్రిల్ 25:** ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటే రోగాల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు శుక్రవారం ఇల్లందకుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన శుక్రవారం సభలో కలెక్టర్ మాట్లాడారు రూ 40వేల విలువైన 54 రకాల వైద్య పరీక్షలను ఆరోగ్య మహిళ కార్యక్రమం కింద ఉచితంగా అందిస్తున్నామని మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని ఆరు నెలలకు ఒకసారి ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు క్యాన్సర్ ట్యూమర్ వంటి ప్రమాదకర వ్యాధులను సకాలంలో గుర్తించి చికిత్స పొందితే నయం చేసుకోవచ్చని పేర్కొన్నారు ఆరోగ్యశ్రీ కింద 10లక్షల వరకు వైద్య సహాయం ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ పొందవచ్చన్నారు అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నామని చిన్నారులను కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు ఇల్లందకుంటలో ఏడుగురు చిన్నారులు తక్కువ ఎత్తుతో 9 మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నట్లు తెలిపారు అబా కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు ప్రైవేటు కంటే నాణ్యమైన ఔషధాలను ప్రభుత్వం సరఫరా చేస్తుందని



వీటిని అర్హులకు చేరవేయాలని వైద్య సిబ్బందిని ఆశ వర్కర్లను ఆదేశించారు ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు చేశారు వైద్య శిబిరం వద్దకు వెళ్లి కలెక్టర్ పలు వివరాలు తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి డీఎంహెచ్ఓ వెంకటరమణ పర్వీన్ తహసీల్దార్ రాణి అధికారులు తదితరులు ఉన్నారు.



## వేములవాడ డివిజన్ అంబేడ్కర్ సంఘం భవన నిర్మాణ కమిటీ ఎన్నిక

**రాజన్న సిరిసిల్ల జిల్లా/వేములవాడ తెలుగు జనశక్తి, ఏప్రిల్, 25 :** శుక్రవారం రోజున వేములవాడ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సంఘం వేములవాడ డివిజన్ అధ్యక్షులు దుమ్మ ఆనంద్ ఆధ్వర్యంలో వేములవాడ డివిజన్ స్థాయి నాయకులు సమావేశాన్ని నిర్వహించుకొని. వేములవాడ డివిజన్ అంబేద్కర్ సంఘం భవన నిర్మాణ కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ అంబేద్కర్ సంఘం భవన నిర్మాణ కమిటీ కన్వీనర్ గా కుమ్మరి శంకర్. కో-కన్వీనర్లుగా గసికంటి ప్రభాకర్, గుడిసె మనోజ్ కుమార్, గుండా థామస్, మూలే కిషోర్, జింక శ్రీధర్, సంటి మహేష్ లను, ముఖ్య సలహాదారులుగా బొడ్డు రాములు, ఆవునూరి ప్రభాకర్ లను, కమిటీ సభ్యులుగా జింక శ్రీనివాస్, గుర్రం తిరుపతి, సామల్ల ప్రతాప్, పెంట బాబు, పెంట దుర్గాప్రసాద్, సంటి అంజిబాబు, గురగళ్ళ భానయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కన్వీనర్ కుమ్మరి శంకర్ మాట్లాడుతూ వేములవాడ డివిజన్ కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ శ్రీనివాస్ గారు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 134వ జయంతి సందర్భంగా 1 కోటి రూపాయలతో అంబేద్కర్ భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినందుకు వేములవాడ డివిజన్ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వేములవాడ డివిజన్ కేంద్ర బిందువైన వేములవాడ పట్టణంలో అంబేద్కర్ భవన నిర్మాణం కొరకు ఈ కమిటీ పనిచేస్తూ మహనీయుల ఆశయ సాధనకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇట్టి సమావేశంలో వేములవాడ డివిజన్ స్థాయి అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.



## వరి ధాన్యం సకాలంలో కొనుగోలు చేయాలి : కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి జిల్లా గాంధారి తెలుగు జనశక్తి ఏప్రిల్ 25 :** రైతులు కొనుగోలుకు కేంద్రానికి తీసుకొచ్చిన వరదానాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ లోని వారి ధాన్యం కొనుగోలు కేంద్రం కలెక్టర్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాలు కురిసే ఆస్కారం ఉన్నందున రైతులకు టార్ఫలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని వారికి అందించాలని అంతేకాకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అన్నారు. ఇప్పటివరకు వచ్చిన దాన్యం వివరాలు కొనుగోలు జరిపిన వాటి వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరా సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు, జిల్లా సహకార అధికారి రామ్మోహన్, తాహసిల్దార్ ఏఎంసీ చైర్మన్ పరమేష్. సొసైటీ చైర్మన్ సాయికుమార్. తాజా మాజీ సర్పంచ్ సంజీవ్ యాదవ్. గడ శంకర్. సొసైటీ డైరెక్టర్ నైరు. సర్పంచ్రైతులు తదితరులు పాల్గొనడం జరిగింది.




## చలో వరంగల్ సభను విజయవంతం చేయాలి

### బిఆర్ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ ఏజస్

**కామారెడ్డి జిల్లా/ బాన్సువాడ (తెలుగు జనశక్తి) ఏప్రిల్ 26 :** నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గ వర్ని పట్టణంలో బి ఆర్ ఎస్ పార్టీ 25 వ రజతోత్సవ సభ ను విజయవంతం చేయాలని బి ఆర్ ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ ఏజస్ అన్నారు. శుక్రవారం వర్ని మండల కేంద్రంలో బి.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఈ నెల 27 న వరంగల్ లో జరిగే సభ ను వర్ని మండల పరిధి లోని ఉన్న అన్ని గ్రామాల బి.ఆర్.ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. వర్ని మండల పరిధి లో నుండి వచ్చే వాహనాలు అన్ని వర్ని మండల కేంద్రానికి ఉదయం 7 గంటలకు జెండా ఆవిష్కరించి కలిసి వెళ్లాలని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగి పోయారని తిరిగి బి ఆర్ ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో దొంగ హామీలు ఇచ్చి ఇప్పటివరకు ఏ పథకం కూడా అమలు చేయడం లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ ఏజస్,బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు ప్రవీణ్ యాదవ్,జంగం రాచప్ప, షేక్ ఉస్మాన్,ప్రభాకర్,ఆనంద్ గౌడ్,మహేందర్ రెడ్డి,నిల్ రెడ్డి, గైని లక్ష్మణ్,రాజేష్,జిశాన్, సాక్లైన్,సవిన్, పాల్గొన్నారు.



## పెహల్గావ్ అమరవీరులకు నివాళి

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా తెలుగు జనశక్తి ఏప్రిల్ 25 :** పెహల్గావ్ ఉగ్రవాద దాడిలో మరణించిన అమరవీరులకు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ (టీజీఈజేఏసీ) ఘనంగా నివాళులర్పించింది. టీజీ జేఏసీ అధ్యక్షతన కలెక్టరేట్ కార్యాలయంలో ఉద్యోగులు కొవ్వొత్తులు వెలిగించి అమరవీరుల స్మృతిని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండించారు. మరణించిన వారి ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. టీజీఈ చైర్మన్ రవి ప్రకాష్ మరియు సెక్రటరీ జనరల్ వినోద్ కుమార్ మాట్లాడుతూ, ఉగ్రవాదం మానవాళికి పెను ప్రమాదమని అన్నారు. అమాయక ప్రజలను బలితీసుకుంటున్న ఉగ్రవాదుల చర్యలను సహించేది లేదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల అధ్యక్షులు, కలెక్టరేట్ ఉద్యోగస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమరవీరుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## ఎదులాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

**- రైతులకు సూచనలు జారీ చేసిన అదనపు కలెక్టర్**

**మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ తెలుగు జనశక్తి ఏప్రిల్ 25 :** అదనపు జిల్లా కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి శుక్రవారం ఘట్కేసర్ మండలం ఎదులాబాద్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పౌరసరఫరాల జిల్లా మేనేజర్, ఆర్డీవో, తహసీల్దార్, జిల్లా సహకార అధికారి, వ్యవసాయ అధికారి, ఏఈఓలతో కలిసి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ, తాము తీసుకువచ్చే వడ్లు తడి, తాలు మరియు దుమ్ము లేకుండా శుభ్రంగా ఆరబెట్టి ఉండాలని సూచించారు. అలాగే, వరి కోతల సమయంలో నూర్పిడి యంత్రాల నిర్వాహకులతో మాట్లాడి, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు క్రమ పద్ధతిలో వచ్చేలా చూడాలని కోరారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడానికి తగినంత మంది హమాలీలను ఏర్పాటు చేయాలని మరియు వడ్లు దింపుకునే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కొనుగోలు కేంద్రం ఇంచార్జ్‌కు ఆయన ఆదేశాలు జారీ చేశారు. రైతులకు త్రాగునీటి సౌకర్యం కల్పించాలని కూడా సూచించారు. రైతులు తమ ధాన్యం విక్రయించిన 48 గంటల్లో నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయబడుతుందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. చివరగా, సంబంధిత అధికారులు అందరూ సమష్టిగా పనిచేసి జిల్లాకు మరియు ప్రభుత్వానికి ధాన్యం కొనుగోలు విషయంలో మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు.



## ఉప్పల్‌లో ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ

**మేడ్చల్ జిల్లా ఉప్పల్ తెలుగు జనశక్తి ఏప్రిల్ 25 :** ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవం 2025 కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి. ఉమా గౌరీ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి. ఉమా గౌరీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మలేరియా ఎలా వస్తుందో తెలుసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన శిబిరాలు నిర్వహించాలని ఆమె కోరారు. జిల్లా ప్రోగ్రామ్ అధికారి (ఎన్వీబీడీసీపీ) డాక్టర్ వై. శ్రీదేవి మాట్లాడుతూ, దోమలు పెరగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతిరోజూ నిల్వ ఉన్న నీటిని శుభ్రం చేసుకోవాలని, కూలర్లు, నీటి తొట్టెలు, కొబ్బరి చిప్పలు మరియు ఇతర వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆమె సూచించారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆశా కార్యకర్తలు మరియు ఆరోగ్య సిబ్బందిపై ఉందని ఆమె అన్నారు. అందరూ కలిసికట్టుగా అంకితభావంతో పనిచేస్తే 2030 నాటికి మలేరియా వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ శోభ రాణి, డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ సత్యవతి, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ చంద్రకళ, డాక్టర్ గీత, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ కౌశిక్, అదనపు ప్రోగ్రామ్ అధికారి వినోద్, ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ శౌశీల్య రాణి, సూపర్వైజర్ బోగా ప్రకాష్ మరియు ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## భూభారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**కలెక్టర్ గౌతమ్**

**మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ తెలుగు జనశక్తి ఏప్రిల్ 25 :** భూభారతి చట్టం ద్వారా రైతులు మరియు భూస్వాముల భూ సంబంధిత సమస్యలను పరిష్కరించే అధికారం రెవెన్యూ అధికారులకు లభించిందని, దీని ద్వారా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. శుక్రవారం ఘట్కేసర్ మండలంలోని ఎదులాబాద్ గ్రామంలోని డిఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని, ఆ సదస్సులలో రైతులు వారి వ్యక్తిగత భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సమర్పిస్తే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ధరణి పోర్టల్‌లో రెవెన్యూ శాఖకు తగిన అధికారాలు లేనందున, అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. భూభారతి ద్వారా ఆ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పాస్ పుస్తకాలు రాని వారికి కొత్తవి ఇవ్వడం, అలాగే వాటిలో తప్పులను సరిదిద్దడం ఈ చట్టం ద్వారా సాధ్యమవుతుందని, రైతుల సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని ఆయన స్పష్టం చేశారు. రైతులు కోరితే లైసెన్స్ కలిగిన సర్వేయర్ల ద్వారా భూమిని సర్వే చేయించి, భౌతిక సరిహద్దులతో కూడిన మ్యాప్‌లను ప్రభుత్వ సర్వేయర్లు ధృవీకరించిన తర్వాతే రిజిస్ట్రేషన్ పత్రాలలో పొందుపరుస్తామని కలెక్టర్ వివరించారు. దీనివల్ల ఎవరికీ నష్టం జరగదని, భూ సరిహద్దులు మరింత పక్కాగా ఉంటాయని ఆయన అన్నారు. అయితే, భూ సర్వే రైతు అంగీకరిస్తేనే చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ధరణి వల్ల తలెత్తిన పీఓబీ (పట్టాదారు పాస్ పుస్తకం) సమస్యలు భూభారతి చట్టంలో రద్దు చేసే అధికారం కలిగి ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రతి



సంవత్సరం డిసెంబర్ 31న జరిగిన మార్పులు చేర్పులను ఆన్‌లైన్‌లో ప్రింట్ తీసి ప్రతి గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులో ప్రదర్శిస్తారని, దీని ద్వారా ప్రతి ఒక్కరికీ వారి భూముల రికార్డుల వివరాలు తెలుస్తాయని ఆయన వివరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, భూభారతి చట్టం ద్వారా రెవెన్యూ అధికారుల బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. ప్రభుత్వం అనేక కొత్త అంశాలను చేర్చి ఈ నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని తీసుకువచ్చిందని, ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గాన్ని కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సదస్సులో కీసర ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి, ఘట్కేసర్ తహసీల్దార్ రజనీ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## వివిధ రకాల మార్పులతో వక్ఫ్ చట్టం

**బీజెపి పార్టీ మండల అధ్యక్షులు ర్యాకం శ్రీనివాస్**

**హనుమకొండ జిల్లా కమలాపూర్ (తెలుగు జనశక్తి) ఏప్రిల్ 25 :** కమలాపూర్ లో నిర్వహించిన విలేకరుల సమావేశం లో భారతీయ జనతా పార్టీ కమలాపూర్ మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ మాట్లాడుతూ పేదల భూములు కొంత మంది పెత్తందారుల చేతిలో ఉండి వక్ఫ్ పేరిట పేద అమాయకమైన ముస్లింలను ముస్లిమేతరుల ను ఇబ్బంది పెడుతున్న క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ చట్టానికి సవరణ అవసరమని దేవుడు పేరిట ఇచ్చే భూములను వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పేదలకు పంచాలని, కనీసం సామాన్యుడు తమ బాధలను కోర్టుకు చెప్పుకోలేని పరిస్థితి నుంచి ఈరోజు ఈ చట్ట సవరణ ద్వారా తమ బాధను కోర్టుకు విన్నవించుకునేలా ఈ చట్టాన్ని రూపొందించడం ఆనందదాయకంగా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ భూపతి ప్రవీణ్, తుమ్మ శోభన్ బాబు, బండి కోటేశ్వర్,



మోకిడ ప్రసాద్, కనుకుంట్ల అరవింద్, ఇనుగాల రత్నాకర్, పెండ్యాల ప్రభాకర్ రెడ్డి, పెండ్యాల తిరుపతిరెడ్డి, చిట్టి సుందరయ్య,మేడిపల్లి రాజు, పూస్కురి రాంబాబు,చెరిపెల్లి రతన్, వాసాల సత్తయ్య, ఎగ్గోజు శ్రీనివాస్, అకినపల్లి రవీందర్, శనిగరం సంపత్, మౌటం అశోక్,జె అశోక్, మార్గం చైతన్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 23 ఏళ్ల ఉద్యమ సేవకు ప్రత్యక్ష అవమానం

**రాజేంద్ర కుమార్ గుండమల్ల ఆవేదన**

**కూకట్‌పల్లి, తెలుగు జనశక్తి ఏప్రిల్ 25 :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2004 నుంచి 2023 వరకూ పార్టీ కోసం శ్రమించిన నన్ను నా నియోజకవర్గంలో ఎమ్మెల్యే మర్చిపోయారు అని మాజీ ఉద్యమకారుడు, పాత కూకట్పల్లి నివాసితుడు రాజేంద్ర కుమార్ గుండమల్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మీడియా కి పత్రికా ప్రకటన విడుదల చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర సమితిలో 19 సంవత్సరాలపాటు సేవలందించిన తాను... చిన్న కార్యకర్తగా ప్రారంభించి 2018లో కొంగరకలాన్‌లో జరిగిన ప్రగతి నివేదన సభ విజయవంతం అయిన నేపథ్యంలో, అదే ఏడాది సెప్టెంబర్ 4న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అధికార నివాసంలో, మంత్రి కేటీఆర్‌తో కలిసి భోజనం చేసిన స్థాయికి ఎదిగానని ఆయన గుర్తు చేశారు. కానీ, ఉద్యమ సమయంలో జై తెలంగాణ అనే నినాదాన్ని కూడ పలకనివారు, తెలంగాణ విభజనను వ్యతిరేకించిన వారు కూకట్పల్లి నియోజకవర్గానికి నాయకులవడమంటే ఇదే విచిత్రమని



ఆయన తన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న మాధవరం కృష్ణారావు... తెలంగాణ ఉద్యమం సమయంలో సమైక్యాంధ్ర శక్తులకు మద్దతు ఇచ్చారని, కానీ ఇప్పుడు ఉద్యమ వీడియోల్లో తన ఫోటో పెట్టుకొని ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. నామినేషన్ పదవులు ఇవ్వడంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఉద్యమం సమయంలో తెలంగాణ ఉద్యమానికి ప్రత్యర్థిగా ఉన్న ఎమ్మెల్యే ఇప్పుడు సోషల్ మీడియాల్లో ఉద్యమ వీడియోలు పోస్ట్ చేసి, అందులో తన ఫోటోలు జోడించి సెంటిమెంట్ క్యాచ్ చేసుకోవడం రాజకీయ వంచనగా అభివర్ణించారు. ప్రజల కళ్లను మాయచేసే ప్రయత్నాలేవి దీర్ఘకాలం సాగవని హెచ్చరించారు.

## ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిలో 28 మంది బలైనారు. ఇట్టి దాడిని తీవ్రంగా ఖండిస్తూ, నివాళులర్పిస్తూ ఈరోజు తొర్రూరు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో తోరూర్ లోని అమరవీరుల స్థూపం వద్ద నుండి కొవ్వొత్తుల ర్యాలీ మొదలై తొర్రూర్ లోని ప్రధాన కూడళ్లలో గాంధీ చౌక్ , బస్టాండ్ వరకు చేరుకొని అక్కడ మానవహారం పాటించి, అక్కడి నుండి తిరిగి అమరవీరుల స్థూపం వద్దకు చేరుకొని అమరులకు నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు జనార్ధన్, శ్రీనివాస్, సుధాకరాచారి, చంద్రమౌళి, బుధరం శ్రీనివాస్, తిరుమలేష్, నాగరాజు,



ఐలయ్య,యాకన్న, రమేష్, తదితర 60 మంది ర్యాలీలో పాల్గొని నివాళులర్పించడం జరిగింది.





## పహల్గామ్ ఉగ్రదాడిని ఖండిస్తూ మేడ్చల్‌లో నివాళి సభ

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా తెలుగు జనశక్తి ఏప్రిల్ 25 :** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయక పర్యాటకులపై జరిగిన హేయమైన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ, తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ ఆక్షన్ కమిటీ , మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో సమగ్ర జిల్లా కార్యాలయ సముదాయం, అంతాయిపల్లిలో నివాళి సభ ఏర్పాటు చేయబడింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొని ప్రాణాలు కోల్పోయినవారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ ఆక్షన్ కమిటీ జిల్లా చైర్మెన్ బి. రవి ప్రకాష్ మరియు ప్రధాన కార్యదర్శి జి. వినోద్ మాట్లాడుతూ, "పహల్గామ్ ఉగ్రదాడిలో అమాయక పర్యాటకుల ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. బాధిత కుటుంబాలకు మేము అండగా ఉంటాం. వారి తీరని దుఃఖంలో పాలుపంచుకుంటున్నాం. ఇలాంటి హేయమైన హింసా చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం నిందితులపై కఠిన చర్యలు తీసుకుని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం" అని అన్నారు. జిల్లా పరిపాలనాధికారి రామ్ మోహన్ మాట్లాడుతూ, "గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాం. ఇటువంటి ఘాతుకాలకు పాల్పడిన వారిని విడిచిపెట్టకూడదు" అని స్పష్టం చేశారు. సభలో మృతులకు నివాళులర్పిస్తూ ఒక నిమిషం పాటు మౌనం పాటించారు. అనంతరం బాధితుల చిత్రపటాల వద్ద అధికారులు మరియు తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ ఆక్షన్ కమిటీ సభ్యులు కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ ఆక్షన్ కమిటీ పిలుపు మేరకు, శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు నలుపు బ్యాడ్జీలు ధరించి ఉగ్రదాడిని నిరసించారు. తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ ఆక్షన్ కమిటీ ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండిస్తూ, బాధితుల పట్ల తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసింది మరియు శాంతి పరిరక్షణలో తమ బలమైన నిబద్ధతను పునరుద్ఘాటించింది.



## భూభారతిపై అవగాహన కల్పించిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

**నిజామాబాద్ జిల్లా సిరికొండ (తెలుగు జనశక్తి) ఏప్రిల్ 25 :** నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సిరికొండ మండలంలోని భూభారతి చట్టం అవగాహన సదస్సులో పాల్గొనడం జరిగింది. భూ సమస్యల పరిష్కరించడానికి ప్రభుత్వం నూతన చట్టం తీసుకువచ్చిందని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. రైతు వేదికలో రైతులతో మాట్లాడుతూ ఏదైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తేవాలని అన్నారు. మరియు మార్పుల్లో చేర్పులు ఉంటే రైతులు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ఉర్దూ అకాడమీ చైర్మన్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వో, ఎంపీడీవో పాల్గొన్నారు.సిరికొండ మైనారిటీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఆసిఫ్ నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును ఘనంగా సన్మానించడం జరిగింది.



## జమ్మూ కాశ్మీర్లో ఉగ్ర మూకల దాడిని ఖండిస్తూ నిరసన

**- ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ**

**రాజన్న సిరిసిల్ల జిల్లా/చందుర్తి తెలుగు జనశక్తి, ఏప్రిల్, 25 :** జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రమూకల దాడిని ఖండిస్తూ చందుర్తి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిరసన, కొవ్వతుల ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు, అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు లింగాల లింగయ్య మాట్లాడుతూ ఉగ్రమూకల దాడిలో మృత్యువాత పడిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ లో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ, దాడి గటనలలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు, కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా అన్నదమ్ముళ్ల కలిసిమెలిసి బతుకుతున్న భారతదేశంలో మతం పేరుతో ఉగ్ర మూకలు మారణ హోమం సృష్టించాలనుకోవడం అవివేకమన్నారు. పర్యాటకులను, సామాన్య ప్రజలను చుట్టూ ముట్టి ఆటవికంగా హత్య చేసి గెలిచామనుకోవడం పిరికిపందల చర్యగా అభివర్ణించారు. ఉగ్ర మూకల దాడిలో ఆగిన ఊపిరి ప్రతి భారతీయుల్లోనూ ఉద్రేకాన్ని రగిలించిందన్నారు. ప్రశాంతంగా ఉన్న జమ్మూ కాశ్మీర్లో మతం ముసుగులో దాడి చేసిన మతోన్మాద ఉగ్రవాదుల చర్యలను, దాడిని ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయని అన్నారు.



## స్ఫూర్తి' సేవలు ప్రశంసనీయం

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- నిరుపేద విద్యార్థి తల్లిదండ్రులకు ఉన్నత విద్యాభ్యాసం కోసం చెక్ అందిస్తున్న జిల్లా కలెక్టర్

**ఖమ్మం, ఏప్రిల్ 25 :** విద్యారంగంలో 'స్ఫూర్తి ఫౌండేషన్' అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. జిల్లాలోని కామేపల్లికి చెందిన పేద విద్యార్థి తేజావత్ శ్రీనివాస్, కాన్పూర్ ఐఐటి లో విద్యను అభ్యసించడానికి ప్రవేశం పొందగా ఆర్థిక పరిస్థితి లేని కారణంగా ఆ కోర్సు చదివే అవకాశం లేకుండా పోవడంతో, అతని తల్లిదండ్రులు ఖమ్మంలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే పరిష్కృతి కార్యక్రమానికి వెళ్లి అధికారులకు తన ఆవేదన తెలిపారు. ఆవేదన విన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ సదరు విద్యార్థికి ఆర్థిక సాయం విషయమై జిల్లా విద్యాశాఖ సీఎంఓ రాజశేఖర్ కు బాధ్యతను అప్పగించారు. విద్యాశాఖ సీఎంఓ సూచన మేరకు స్ఫూర్తి ఫౌండేషన్ వారు సదరు విద్యార్థికి ఐఐటి చదువు పూర్తయ్యేంతవరకు అయ్యే మొత్తం ఖర్చును భరిస్తామని ముందుకు వచ్చారు. దీంతో స్ఫూర్తి ఫౌండేషన్ అధికార ప్రతినిధి వరక రామారావు తమ సంస్థ తరపున తొలివిడతగా రూ. 50 వేల చెక్కును శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చేతుల మీదుగా విద్యార్థి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరక రామారావు తమ సంస్థ చైర్మన్ శ్రీవ్యాల్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాల నిర్వహణకు అందిస్తున్న సహకారాన్ని, సేవలను లబ్ధి పొందిన విద్యార్థుల వివరాలను ఇతర సేవా కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో విద్యారంగ అభివృద్ధికి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రభుత్వపరంగా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. నిరుపేద విద్యార్థికి సకాలంలో సాయం అందేలా కృషిచేసిన విద్యాంజలి జిల్లా నోడల్ అధికారి అయిన జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి (సీఎమ్ఓ) యలగందుల రాజశేఖర్ ను అభినందించారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ వాలంటీర్లు ఉబ్బన బాబురావు జల్ది రామకృష్ణ బైర్ల వెంకటేశ్వర్లు శిరసాని ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వీరన్న స్వామి జాతర ప్రారంభం

- ప్రారంభించిన తుంబూరి దయాకర్ రెడ్డి
- మూడు రోజుల జాతరకు ముస్తాబైన వీరన్న స్వామి గుడి

**నేలకొండపల్లి, ఏప్రిల్ 25 :** నేలకొండపల్లి మండలంలోని ముఠాపురం గ్రామంలో వీరన్న స్వామి ఆలయం మూడు రోజుల పాటు సాగే 8వ సంవత్సరం జాతర ప్రారంభ కార్యక్రమం వైభవంగా జరిగింది. రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి ఈ జాతరను ప్రారంభించారు. కార్యక్రమంలో నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శాఖమూరి రమేష్, సీడీసీ డైరెక్టర్ గుడిమళ్ల మధు పాల్గొన్నారు. వీరన్న స్వామి ఆలయ కమిటీ చైర్మన్ చావ కోటయ్య, కమిటీ సభ్యులు గ్రామ ప్రజల సమన్వయంతో 25,26,27 వ తేదీలలో జరిగే జాతర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేశారు. 350 సంవత్సరాల నుండి పూర్వీకుల సంప్రదాయాలను కాపాడుతూ ప్రతి ఏడాది మూడు రోజుల పాటు నిర్వహించే ఈ జాతరకు చుట్టూ ఉన్న గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున హాజరవుతారు, కోరిన కోర్కెలు తీర్చే వీరన్న స్వామిగా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. జాతర ప్రారంభం రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించగా, భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. జాతర సందర్భంగా భక్తులకోసం పూర్తి ఏర్పాట్లు చేశారు కమిటీ సభ్యులు గ్రామ యువత కలిసి భక్తులకు నీరు ఆహారం ఇతర సదుపాయాలను అందించారు. పల్లె సంస్కృతిని ప్రతిబింబించే విధంగా నిర్వహించే ఈ జాతర ముఠాపుర గ్రామ చరిత్రలో మరొక నిలకడైన ఘట్టంగా నిలిస్తుంది.



## ఆరోపణలు ఎదుర్కొంటున్న రైస్ మిల్లును సందర్శించిన పోలీస్ కమిషనర్

**నేలకొండపల్లి, ఏప్రిల్ 25 :** ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలంలోని జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) కేంద్రాన్ని, రాజేశ్వరపురంలోని అరుణాచల రైస్ మిల్లును శుక్రవారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. ధాన్యం కొనుగోలు ట్రాన్స్‌పోర్ట్ కాంటాలు బిల్లులు తదితర అంశాలపై రైతులతో, మిల్లర్లతో మాట్లాడారు. రైతులకు ఏలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని మిల్లర్లకు అధికారులకు సూచించారు. దాన్యం కొనుగోలు నుండి రైస్ మిల్లులకు తరలింపు వరకు కొనసాగుతున్న ప్రక్రియలో ఏలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంతంగా కొనసాగించాలని సూచించారు. ఈ మిల్లుపై ఇటీవల రైతులు మాట్లాడిన వీడియోలు కథలు కథలు గా సోషల్ మీడియాలో ప్రచారం అయ్యాయి ఇప్పుడు జిల్లాలో ఈ మిల్లు ప్రత్యేకంగా కనిపిస్తుంది అధికారులకు ప్రభుత్వ యంత్రాంగం మొత్తం రైతులకు సేవ చేసే కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేస్తుంటే ఇక్కడ రైతులను బాగా ఇబ్బంది పెట్టే విషయాలు వీడియోల రూపంలో బయటకు రావడంతో వార్తల్లో ప్రముఖంగా నిలిచింది ఈ కేంద్రం. ఇలాంటి ఆరోపణలు రాకుండా గట్టి చర్యలు తీసుకునే పనిలో భాగంగా పోలీస్ కమీషనర్ తో పాటు ఈ కార్యక్రమంలో సిఐ సంజీవ్ ఎస్సై సంతోష్ సంబంధిత అధికారులు స్థానిక గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## భూ హక్కులపై రైతులకు పూర్తి భద్రత

- భూ భారతి చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం
- వైరా ఎమ్మెల్యే మాళోతు రాందాస్ నాయక్
- వైరా మండల కేంద్రంలో భూ భారతి చట్టం పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైరా ఎమ్మెల్యే



**వైరా, ఏప్రిల్ 25 :** భూ హక్కులపై రైతులకు భద్రత కల్పించేలా భూ భారతి చట్టం రూపకల్పన చేశామని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం వైరా మండల కేంద్రంలోని కామిశెట్టి కల్యాణ మండపంలో నిర్వహించిన తెలంగాణ భూ భారతి (భూమి హక్కుల) చట్టం-2025 పై అవగాహన కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, ఆర్డీఓ నరసింహా రావు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ మాట్లాడుతూ రాజకీయాల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం ఇది కాదని, రైతాంగానికి భూ సమస్యల పరిష్కారం, భూ హక్కులు కల్పించే విధంగా భూ భారతి చట్టం రూపొందించామని అన్నారు. భూ హక్కులపై రైతులకు ఉన్న అభద్రత తొలగించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. గత ప్రభుత్వం అనుభవదారు కాలం తొలగించి చిన్న రైతుల పొలాలను ఆసాములకు అప్పగించిందని, నేడు ఆ రికార్డులను భూ భారతి ద్వారా సరి చేస్తామని అన్నారు. గతంలో ఉన్న విఆర్ఓ వ్యవస్థ, అనుభవ దారు కాలం మళ్ళీ వస్తుందని, ఎప్పుడైనా తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి పహాణి రాసి తీసుకునేలా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. భూ భారతి చట్టంపై ప్రజలు అందించిన సూచనలు కూడా తీసుకొని అవసరమైన మార్పులు తీసుకుని వస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ జి. నరసింహా రావు భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ భారతి చట్టం ద్వారా పక్కాగా భూ సరిహద్దులు నిర్ణయిస్తారని, రైతులకు, భూ హక్కుదారులకు ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని అన్నారు. భూ భారతి చట్టం ప్రకారం అధికారులు అందించిన ఆర్డర్ల పై సంతృప్తి చెందకుంటే అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మండల తహసీల్దార్ కే.వి. శ్రీనివాస్ రావు, ఎంపీడీఓ సరస్వతి, వ్యవసాయ శాఖ అధికారిణి కరుణ శ్రీ, మునిసిపల్ కమీషనర్ వేణు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పతిష్ఠత.. ప్రజల్లో బలంగా ఉంది

- కూసుమంచి మండలంలో నూతన గద్దెలు, జెండాల ఆవిష్కరణ
- పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతమధు, మాజీ ఎమ్మెల్యేలు కందాళ, సండ్ర



**కూసుమంచి, ఏప్రిల్ 25 :** తెలంగాణ రాజకీయ రంగంలో బలమైన స్థానాన్ని ఏర్పరచుకున్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ గ్రామ స్థాయిలో కూడా తన ప్రభా వాన్ని పెంచుకుంటూ పోతుందని, ఈ దిశగా ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గానికి చెందిన కూసుమంచి మండలం లోని మంగలితండా, ఈశ్వర మాదారం, రాజుపేట బజార్ గ్రామాల్లో పార్టీ నూతన గద్దెలు నిర్మించి, పార్టీ జెండాలను ఆవిష్కరించారు ముఖ్య నేతలు. ఈ కార్యక్రమానికి నేతల ఉత్సాహం, కార్యకర్తల చొరవ, గ్రామస్తుల భాగస్వామ్యం చక్కటి రాజకీయ చైతన్యాన్ని ప్రతిబింబించిందని మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు వారు పార్టీ బలోపేతానికి తమ పూర్తి మద్దతును ప్రకటించడంతో కార్యక్రమానికి ప్రాధాన్యత మరింత పెరిగింది. ఈ సందర్భంగా కందాళ ఉపేందర్ రెడ్డి చేసిన ఉద్బోధన లో పార్టీ స్థాపనకు 25 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఏప్రిల్ 27న వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభకు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలన్న పిలుపుకు, పార్టీ పట్ల ప్రజలకున్న నిబద్ధత రేపు సభకు తరలే విధానం చాటుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల పార్టీ అధ్యక్షులు కార్యదర్శులు మాజీ ప్రజాప్రతినిధులు గ్రామ శాఖ నాయకులు మాజీ సర్పంచులు పార్టీ ముఖ్య నాయకులు గ్రామస్థులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల వృద్ధికి రైతుల ఆర్థికాభివృద్ధికి.. ఫామ్ పాండ్స్

**భద్రాద్రి కలెక్టర్ జితేష్ పాటిల్**



**కొత్తగూడెం, ఏప్రిల్ 25 :** వ్యవసాయ భూముల్లో ఫామ్ పౌండ్స్ నిర్మాణాల ద్వారా భూగర్భ జలాల అభివృద్ధితోపాటు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం చంద్రు గొండ పర్యటనలో భాగంగా స్థానికంగా ఉపాధి హామీ పథకం లో రైతు చేపల మడుగు తిరుపతి వ్యవసాయ క్షేత్రంలో 20/20 విస్తీర్ణంలో సుమారు రెండు లక్షల 25 వేల రూపా యల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఫామ్ పాండ్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తన వ్యవసాయ క్షేత్రంలో ఈ ఫామ్ పౌండ్ నిర్మాణాలు ఖచ్చితంగా చేపట్టాలని దీని ద్వారా భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ ఫామ్ పాండ్ లద్వారా చేపల పెంపకం చేపట్టి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చ న్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం పరుచుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతులు ఒక్క పంట పైనే ఆధారపడకుండా అంతర పంటగా చేపల పెంపకం, మునగ, అజోల్ల వంటివి సాగు చేయడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని అన్నారు. అనంతరం కలెక్టర్ చేపలమడుగు నాగేంద్ర బాబు అనే రైతు ఉపాధి హామీ పథకం ద్వారా ఒక ఎకరంలో సాగు చేస్తున్న మునగ సాగును పరిశీలించి మునగ సాగు చేయడానికి ముందుకు వచ్చినందుకు రైతుని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతుకు మునగ సాగు లో తీసుకోవలసిన జాగ్రత్తలు, పద్ధతులు గురించి వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఎకరం పొలంలో 1000 మొక్కలను నాటినట్లు ఆయన తెలిపారు. మునగ మొక్కలు నిటారుగా పెరగడం ద్వారా గాలి దుమ్ము వంటి సమయాల్లో మొక్కలు విరిగిపోయే అవకాశం ఉందని కాబట్టి చిన్న మొక్కలుగా ఉన్నప్పుడే తలవిరుపు చేపట్టాలని రైతుకు సూచించారు. మునగ సాగు వలన వచ్చే లాభాలను గురించి వివరించారు. మునగాకు పౌడర్ ద్వారా లాభాలు ఆర్జించవచ్చని రైతులకు తెలిపారు. మునగ సాగు చాలా లాభసాటి మరియు పర్యావరణ అనుకూలమైన పంట అని అన్నారు. మునగ ఆకులు, కాయలు, విత్తనాలు, పూలు మరియు వేర్లు అన్నింటిలోనూ పోషకాలు సమృద్ధిగా ఉంటాయన్నారు. ఇది చిన్న, సన్నకారు రైతులందరికీ ఒక మంచి ఆదాయ మార్గమని, దీనికి తక్కువ నీరు మరియు కూలీల అవసరం ఉంటుందని, అంతేకాకుండా, ఎరువులు, పురుగు మందులు కూడా ఎక్కువగా వాడాల్సిన అవసరం ఉండదు. తక్కువ విస్తీర్ణంలో సాగు చేసుకుంటారు కాబట్టి కాయలను సులభంగా తక్కువ కాలంలోనే స్థానిక మార్కెట్లకు తరలించవచ్చు అని కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట చంద్రుగొండ తాసిల్దార్ సంధ్యారాణి ఎంపీడీవో అశోక్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంచి నీటి నల్లాలకు ఆన్ ఆఫ్ కంట్రోల్ పరికరాలను ఏర్పాటు చేసుకోండి

**జిల్లా అదనపు కలెక్టర్ కార్పొరేషన్ ఇన్చార్జి మేయర్ అరుణశ్రీ**



**గోదావరిఖని, ఏప్రిల్ 25 :** నల్లాలకు నగరంలో రోజు విడిచి రోజు స్థానంలో ప్రతి రోజూ నల్లాల ద్వారా మంచి నీరు సరఫరా చేయడానికి జరుగుతున్న ప్రయత్నం సఫలం కావడానికి నీరు వృధా కాకుండా నల్లా కు ఆన్-ఆఫ్ కంట్రోల్ ఏర్పాటు చేసుకోవడంతో పాటు నేరుగా అమర్చిన మోటార్లను తొలగించి సహకరించాలని అదనపు కలెక్టర్ ఇంచార్జ్, కమిషనర్ జె. అరుణ శ్రీ కోరారు. ప్రతిరోజూ నల్లాల ద్వారా రక్షిత మంచి నీరు సరఫరా చేయడానికి ప్రస్తుతం బి పవర్ హౌజ్ టాంక్ , అల్లూరు టాంక్ మినహా మిగిలిన అన్ని టాంకుల పరిధిలో ట్రయల్ రన్ కొనసాగుతుందని మరో కొద్ది రోజుల్లో పూర్తి స్థాయిలో రోజూ కనీసం 45 నిమిషాల పాటు సరఫరా చేయనున్నామని తెలిపారు. టెయిల్ ఎండ్ లో ఉన్న ప్రాంతాల్లో సరఫరాకు ఇబ్బంది ఏర్పడకుండా ప్రజలు అవసరమున్నంత వరకు నీరు నిలువ చేసుకొని ఆ తరువాత ఆన్ ఆఫ్ కంట్రోల్ వాల్వ్ సహాయతో నిలిపివేయాలని సూచించారు. కొందరు నల్లా కు నేరుగా మోటార్లు అమర్చడం వలన దిగువ ప్రాంతాలకు నీటి సరఫరా జరగడం లేదని దృష్టికి వచ్చిందని అన్నారు. మున్సిపల్ బృందాలు తనిఖీకి వచ్చినప్పుడు మోటార్ కనిపించినా , ఆన్ ఆఫ్ కంట్రోల్ కనిపించకపోయినా చట్ట ప్రకారం నల్లా కనెక్షన్ తొలగించడంతో పాటు జరిమానా విధించడం జరుగుతుదని అన్నారు. కావున ప్రతి రోజూ నల్లాల ద్వారా నీటి సరఫరా విజయవంతమయ్యేందుకు ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

## 27న కామన్ ఎంట్రెన్స్ టెస్ట్

- పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. యాక్ట్ అమలు
- ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం, ఏప్రిల్ 25 :** ఏప్రిల్ 27న కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి.ఎన్.ఎస్. ఎస్. యాక్ట్ అమలు లో ఉంటుందని ఖ మ్మం పోలీస్ కమీష నర్ సునీల్ దత్ శుక్రవారం ఒక ప్రక టనలో తెలిపారు. తెలంగాణ మోడల్ స్కూళ్ళలో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాలు, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఏప్రిల్ 27న నిర్వహిస్తున్న కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ పరీక్షల కేంద్రాల సమీపంలో గల ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ షాప్ లకు 200 మీటర్ల రేడియస్ లో సెక్షన్ 163 బి.ఎన్. ఎస్.ఎస్. యాక్ట్ అమలులో ఉంటుందని అన్నారు. ఏప్రిల్ 27న ఉదయం 8.00 నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు పరీక్షా కేంద్రాల సమీపంలో ఈ సెక్షన్ అమలులో ఉంటుందని, ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడటానికి వీలు లేదని, ఎవరైనా ఈ ఆదేశాలను అతిక్రమిస్తే సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీస్ కమీషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## రజతోత్సవ సభ పార్టీ బలాన్ని నిరూపిస్తుంది

**మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ**

**కారేపల్లి, ఏప్రిల్ 25 :** తెలంగాణలో రాజకీయంగా తామే బలమైన శక్తి అంటూ నిరూపించుకోవడానికి మరోసారి బీఆర్ఎస్ పార్టీ సిద్ధమవుతోందనీ వైరా నియోజకవర్గ మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సింగరేణి మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్ లో సభకు తరలి వెళ్లడానికి జన సమీకరణకై ఆ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25వ వసంతంలోకి అడుగు పెట్టబోతున్న బిఆర్ఎస్ పార్టీ కొత్త డైరెక్షన్లో పయనించడానికి ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. అందులో భాగంగానే బీఆర్ఎస్ రజితోత్సవ వేడుకల సందర్భంగా ఈనెల 27వ తేదీన వరంగల్ లో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అధికార పార్టీగా గతంలో పార్టీ వ్యవస్థాపక దినోత్సవాలను జరుపుకున్న పార్టీ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉంటూ 25 వసంతాల వేడుకలకు సిద్ధమవుతోందన్నారు. రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత ఈ సభకు ఉంటుందని బిఆర్ఎస్ వర్గాలు అంచనా వేస్తున్నాయన్నారు. ముఖ్యంగా చాలా రోజుల తర్వాత పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర రావు భారీ బహిరంగ సభలో మాట్లాడనున్నారనీ పేర్కొన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ బహిరంగ సభకు భారీ సంఖ్యలో జన సమీకరణ చేసేందుకు జిల్లా పార్టీ బాధ్యులు గ్రామాల వారిగా నాయకులకు బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు ఈ సభ కోసం కారేపల్లి మండలం నుండి ప్రత్యేక బస్సులు కారులలో జనాలను తరలించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు ఈ సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు సొసైటీ వైస్ చైర్మన్ ధరావత్ మంగీలాల్ మాజీ సర్పంచ్ బానోతు కుమార్ నాయకులు అడప పుల్లారావు శివరాత్రి అచ్చయ్య బానోత్ రాందాస్ బత్తుల శ్రీనివాసరావు సిద్ధంశెట్టి నాగయ్య గుగులోతు రవి తాత ఉపేందర్ సైజన్ సూరపరెడ్డి తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ఉగ్రవాద చర్యపై సిపిఐ ఉవ్వెత్తున నిరసన

- దేశ పౌరులపై హత్యాకాండ పిరికిపంద చర్య
- ఉగ్రవాదాన్ని అంతం చేసే చర్యలు చేపట్టాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా
- సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం

**కొత్తగూడెం, ఏప్రిల్ 25 :** జమ్మూ-కాశ్మీర్ పెహల్గామ్ పర్యాటక ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరి భవన్' నుంచి బస్టాండు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్తూపం వద్ద ఉగ్రదాడిని ఖండిస్తూ మానవహారం నిర్మించి నినాదాలు చేశారు, మృతులకు శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ ఉగ్రవాదులు దేశపౌరులపై జరిగిపిన జరిపిన దాడి, హత్యాకాండ పిరికిపంద చర్యని, ఈ చర్యను భారత పౌరసమాజం సహించబోదన్నారు. ఉగ్రవాదానికి మతం ఉండదని, పహల్గమ్లో హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా చంపేశారని, అత్యంత ఘోరమైన మరణహోమాన్ని కూడా రాజకీయ లబ్ది కోసం వాడుకోవాలని చూసే దుర్మార్గుల పన్నాగాలను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. వారం రోజుల క్రితమే పాకిస్థాన్ సైన్యాధికారి, ఉగ్రవాద కమాండర్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నప్పటికీ వాటిని పసిగట్టడంలో కేంద్ర బలగాలు, ప్రభుత్వం ఎందుకు ఫైఫల్యం చెందారో దేశ ప్రజలకు బిజెపి ప్రభుత్వం సమాధానం చెప్పాలని, ఇంటిలిజెన్స్ సంస్థ దాడుల విషయాన్ని ముందే కేంద్రానికి , ఈ దాడికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కేంద్రప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, కె సారయ్య, జిల్లా సమితి సభ్యులు దమ్మాలపాటి శేషయ్య, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, మునిగడప వెంకటేశ్వర్లు ఎస్ కె ఫహీమ్, పొలమూరి శ్రీనివాస్, పట్టణ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు ధర్మరాజు, యూసుఫ్, బోయిన విజయ్ కుమార్, గొనె మని, మాతంగి లింగయ్య, నూనావత్ గోవిందు, ఖయూమ్, జాకబ్, గుత్తుల శ్రీనివాస్, దాట్ల శ్రావణ్, రాంజీ, గొనె సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## నేషనల్ హెరాల్డ్ కేసు.. సోనియా, రాహుల్‌కు
# నోటీసులు ఇచ్చేందుకు కోర్టు నిరాకరణ

**న్యూఢిల్లీ :** నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు నోటీసులు ఇవ్వాలని ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ దిల్లీ కోర్టును ఆశ్రయించింది. కాగా న్యాయస్థానం దీనికి నిరాకరించింది. కొత్త చట్ట నిబంధనల ప్రకారం నిందితులను విచారించకుండా ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోలేమని.. కాబట్టి విచారణకు హాజరయ్యేలా వారికి నోటీసులు ఇవ్వాలని ఈడీ కోరింది. ఈ విషయంలో తాము ఏమీ దాచట్లేదని.. ఈ కేసు విచారణకు ముందు అభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి గాంధీ కుటుంబానికి అవకాశమిస్తున్నామని ఈడీ అధికారులు తెలిపారు. నోటీసులు ఇచ్చే ముందు, ఏదైనా ఆర్డర్‌ను జారీ చేసేముందు అందులో ఏదైనా లోపం ఉందా అనే విషయాన్ని న్యాయస్థానం పరీక్షించాల్సి ఉంటుందని ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ విశాల్ గోగ్నే అన్నారు. ఛార్జిషీట్‌లో సరైన పత్రాలు లేవని..ఆ పత్రాలను దాఖలు చేయాలని ఈడీ అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు. వాటిని పరీక్షించిన అనంతరం నోటీసుల జారీపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కేసు విచారణను మే 2వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కోర్టు పేర్కొంది. 'నేషనల్ హెరాల్డ్' మనీలాండరింగ్ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ.. అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. ఇప్పటికే ఈ కేసుతో ముడిపడి ఉన్న ఆస్తుల స్వాధీనానికి నోటీసులు జారీ చేసిన ఈడీ అధికారులు.. తాజాగా కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దుబే పేర్లతో దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు విచారణ చేపట్టింది.

# న్యూయార్క్ టైమ్స్ పైత్యం

- పహల్గాం వార్త ప్రజెంటేషన్‌లో తప్పిదం
- తీవ్రంగా తప్పుపట్టిన అమెరికన్ ప్రభుత్వం

**వాషింగ్టన్, ఏప్రిల్ 25 :** పహల్గాం ఉగ్రదాడిపై అమెరికా పత్రిక న్యూయార్క్ టైమ్స్ కవరేజీని అక్కడి ప్రభుత్వం తీవ్రంగా తప్పుపట్టింది. 'హౌస్ ఫారెన్ అఫైర్స్ కమిటీ-మెజార్టీ' ఎక్స్ హ్యాండిల్‌లో ఈ మేరకు పోస్టు చేసింది. వాస్తవానికి ఆ పత్రిక ప్రచురించిన పహల్గాం ఘటన వార్తలో.. దాడి చేసిన వారిని 'టెర్రరిస్టు'లుగా కాకుండా తప్పుదోవ పట్టించేలా 'మిలిటెంట్లు'గా చిత్రీకరిస్తూ శీర్షికను పెట్టింది. అంతేకాదు వార్తలో కూడా మిలి-టె-ంట్లు-, గన్‌మెన్‌లు అని రాసుకొచ్చింది. అలాగే ఇది ఓ సాధారణ కాల్పుల ఘటనలా రాసింది. ఈ వార్త క్లిప్పింగ్‌ను ఎర్రటి అక్షరాలతో సరిచేసిన 'హౌస్ ఫారెన్ అఫైర్స్ కమిటీ- మెజార్టీ' ఎక్స్‌లో పోస్టు చేసింది. హేయ్ న్యూయార్క్ టైమ్స్. నీకోసం ఈ తప్పు మేము సరిచేశాము. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇది 'ఉగ్రదాడి'. ఏది ఏమైనప్పటికీ భారత్ లేదా ఇజ్రాయెల్‌లో ఉగ్రవాదం విషయానికి వచ్చేసరికి న్యూయార్క్ టైమ్స్ నిజాలను మాయం చేస్తుందని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఇదిలావుంటేభారత్‌పై అమెరికా విదేశాంగశాఖను ప్రశ్నించి.. ఏదైనా వ్యాఖ్యలు చేయిద్దామని ప్రయత్నించిన పాక్ జర్నలిస్టుకు భంగపాటు ఎదురైంది. దీనికితోడు పహల్గాం దాడి విషయంలో వాషింగ్టన్ న్యూదిల్లీకి ఎంత అండగా ఉందో చెప్పే ఘటన మరొకటి చోటు-చేసుకొంది. భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తత నెలకొనడంపై అమెరికా విదేశాంగ ప్రతినిధి టామ్మీ బ్రూస్‌ను ఓ పాక్ జర్నలిస్టు అడిగాడు. దీనికి ఆమె స్పందిస్తూ.. నేను దానిపై ఎటువంటి వ్యాఖ్యలు చేయను. మనం ఇంకో సబ్జెక్టు మాట్లాడుకుందాం. ఇప్పటికే అధ్యక్షుడు ట్రంప్, మంత్రి మార్కో రూబియో మాట్లాడారు. అందుకే ఆ విషయంపై నేను మాట్లాడను. చనిపోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తాను. క్షతగాత్రులు వేగంగా కోలుకోవాలని ఆకాంక్షిస్తాను. ఈ హీనమైన దాడికి పాల్పడిన వారికి శిక్ష పడాలని కోరుకుంటాను అని పేర్కొన్నారు. ఇక ఈ దాడి వెనక పాక్ హస్తం ఉందని భావిస్తున్నారా.. ఉద్రిక్తతలను తగ్గించడానికి ప్రయత్నిస్తారా అన్న ప్రశ్నలకు కూడా ఆమె స్పందించారు. పరిస్థితులు వేగంగా మారుతున్నట్లు మనం చూస్తున్నాం. వాటిని చాలా జాగ్రత్తగా గమనిస్తున్నాం. జమ్మూకశ్మీర్‌పై ఎటువంటి పొజిషన్ తీసుకోలేదని వ్యాఖ్యానించారు. ఈ దాడిపై తన సోషల్ మీడియా ట్రూత్‌లో ట్రంప్ తొలిరోజే పోస్టు చేశారు. కశ్మీర్ ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది. తీవ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌కు అమెరికా మద్దతుగా నిలుస్తుంది. మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. గాయపడినవారు త్వరగా కోలుకోవాలి. ప్రధాని మోదీ, భారత ప్రజలకు మా సంపూర్ణ మద్దతు ఉంటుందని ట్రంప్ పేర్కొన్నారు.

# ఉగ్రవాదులు స్వాతంత్ర్య సమరయోధులట
## పాక్ ఉప ప్రధాని పిచ్చి ప్రేలాపనలు



**న్యూఢిల్లీ :** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడితో భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇది సీమాంతర కుట్రేనని దాయాదిపై న్యూదిల్లీ విరుచుకుపడింది. అయితే, ఈ దాడితో తమకు సంబంధం లేదని పాక్ చెప్పింది. ఈ పరిణామాల వేళ స్వయంగా ఆ దేశ ఉప ప్రధాని ఇషాక్ దార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులు స్వాతంత్ర్య సమరయోధులంటూ పిచ్చి ప్రేలాపనలు చేశారు. ఇస్లామాబాద్‌లో మీడియా మాట్లాడిన దార్.. "ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం జిల్లాలో దాడికి పాల్పడినవారు స్వాతంత్ర్య సమరయోధులై ఉంటారు" అని అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈసందర్భంగా సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయంపై స్పందిస్తూ.. ఈ ఏకపక్ష నిర్ణయాన్ని మేం ఎన్నటికీ అంగీకరించబో మన్నారు. దీనికి ప్రతిచర్య తప్పదంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు.

### సింధూ జలాల నిలిపివేతపై పాక్‌కు భారత్ లేఖ

సీమాంతర ఉగ్రవాదానికి ముగింపు పలికేవరకు పాక్‌తో చేసుకున్న సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేస్తున్నట్లు భారత్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయాన్ని న్యూదిల్లీ దాయాదికి అధికారికంగా సమాచారమిచ్చారు. ఈమేరకు భారత నీటి వనరుల కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ.. పాక్ అధికారి సయీద్ అలీ ముర్తుజాకు లేఖ పంపారు. "ఏ ఒప్పందాన్నైనా నిజాయతీగా గౌరవించడం అనేది ప్రాథమిక బాధ్యత. కానీ, జమ్మూకశ్మీర్‌ను లక్ష్యంగా చేసుకొని పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని కొనసాగిస్తోంది. ఈ భద్రతాపరమైన అనిశ్చితులు మా హక్కులను ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తున్నాయి. అందుకే, ఈ ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేస్తున్నాం" అని భారత్ ఆ లేఖలో పేర్కొంది.

# ముగిసిన చంద్రమౌళి అంత్యక్రియలు

- అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రులు
- ఉగ్రవాద చర్యలను తుదముట్టించాలన్న హోంమంత్రి



**విశాఖపట్టణం, ఏప్రిల్ 25 :** పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన విశాఖ వాసి చంద్రమౌళి అంతిమయాత్రలో హోంమంత్రి అనిత, మంత్రి సత్యకుమార్, కూటమి నేతలు పాల్గొని నివాళులర్పించారు. ఉగ్రవాదుల చర్యను పార్టీలు, కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. చంద్రమౌళి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటు-ంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 25 మంది భారతీయులు కాగా, ఒకరు నేపాల్‌కి చెందిన వ్యక్తి. ఈ దాడిలో 25 మంది భారతీయులలో ఇద్దరు తెలుగు వ్యక్తులు కూడా ఉన్నారు. నెల్లూరులోని కావలికి చెందిన మధుసూదన్ రావు, విశాఖపట్నానికి చెందిన చంద్రమౌళి ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వ అండగా ఉంటుందని మంత్రి సత్యకుమార్ హామీ ఇచ్చారు. విశాఖపట్నానికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి చంద్రమౌళి ఇంటికి వెళ్లి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. చంద్రమౌళి కుటుంబం ఈ ఘటనను తలచుకుని తీవ్రంగా విలపించింది. మంత్రి వారిని ఓదార్చి, ప్రభుత్వం వారి పక్షాన నిలుస్తుందని ధైర్యం చెప్పారు. పహల్గామ్ ఘటనపై మాట్లాడుతూ... ఏకతాటిపై నిలబడాల్సిన సమయం ఇది అని, టెర్రరిజానికి మతం లేదన్నారు. కానీ.. పహల్గామ్ ఘటనలో మాత్రం హిందువులను టార్గెట్ చేసి చంపారన్నారు. కల్మా చదవమన్నారని, రాదని చెప్పిన వారిని మోకాళ్లపై కూర్చోబెట్టి బుల్లెట్లు దింపారని బాధితులు చెబుతుంటే బాధాకరంగా అనిపించిదని ఆయన తెలిపారు. అమానుషంగా చంపారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు తమ బాధను తను చెప్పుకున్నప్పుడు నోటివెంట మాటలు రాలేదని ఆయన అన్నారు. ఇది అందరి బాధ్యత అని, ఇది పూర్తి ఖండిచాల్సిన విషయమన్నారు. పార్టీలకు అతీతంగా ఈ మారణ హోమాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించాలన్నారు.

# జగన్ హయాం కన్నా మిన్నగా అప్పులు
## చంద్రబాబు సర్కార్‌పై మాజీమంత్రి పేర్ని నాని విమర్శలు

**అమరావతి, ఏప్రిల్ 25 :** కూటమి ప్రభుత్వానికి బిల్డప్ ఎక్కువ.. బిజినెస్ తక్కువ అని వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని ఆరోపించారు. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చారు.. గత జగన్ ప్రభుత్వం అప్పుల ఊబిలో కూరుకు పోయిందని ప్రచారం చేశారు.. కలెక్టర్ కార్యాలయాలు కూడా తనఖా పెట్టి అప్పులు చేస్తున్నారని నానా యాగీ చేశారు.. ఇప్పుడు, చంద్రబాబును జాకీలు పెట్టి లేపారు.. ప్రపంచ ఆర్థిక వేత్తలకు కూడా చంద్రబాబు పాఠాలు చెబుతారని చెప్పారు.. చంద్రబాబును సీఎంని చేస్తే ఆయన సంపద సృష్టిస్తారు.. జగన్ చేసిన అప్పులు కూడా తీరుస్తారని డబ్బాలు కొట్టారు.. ఆయనకు వత్తాసు పలికే పవన్ మాటలు నమ్మి ప్రజలు ఓటేశారు.. ఇప్పుడు తలకు మించిన అప్పులు చేస్తున్నారు అని పేర్ని నాని తెలిపారు. ఇక, కూటమి ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా అప్పులు చేస్తున్నారని వైసీపీ నేత పేర్నినాని తెలిపారు. మంత్రిగా ఎవరున్నా పద్ధతి ప్రకారం అప్పులు తీసుకుంటారు.. భారతదేశంలో ఏ రాష్ట్రంలో ఇంత బరితెగించి అప్పులు చేయటం లేదు.. బిల్డపు బాబాయ్ చంద్రబాబు, చిన్న బిల్డప్ బాబాయ్ పవన్ కళ్యాణ్ ఎన్నో కథలు చెప్పారు.. అప్పులు చేయకుండా సంపద సృష్టిస్తానని చెప్తారు.. రాష్ట్రం అంటే అమరావతి మాత్రమే అన్నట్లు-గా లక్ష కోట్లు- ఖర్చు చేస్తున్నారు.. తగుదునమ్మా అన్నట్లు-గా మరో 44 వేల ఎకరాలు భూములు తీసుకుంటున్నారు.. అసలు రాష్ట్రాన్ని ఏం చేద్దామనుకుంటున్నారు అని ప్రశ్నించారు. మోసపూరిత మాటలతో ఓట్లు వేయించుకుని మీ సంపద పెంచుకుంటు న్నారు. ఇవాళ చూస్తే చంద్రబాబు ఆస్తులు పెరిగాయి.. స్పెషల్ ఫ్లైట్‌లో తిరుగుతున్నారు.. డిప్యూటీ సీఎం విమానాలు, హెలిక్రాప్టర్లలో తిరుగుతున్నారంటూ పేర్నినాని మండిపడ్డారు. ఇక, జగన్ ప్రభుత్వం చేసిన అప్పులు 3.32 లక్షల కోట్లు- అని మాజీ మంత్రి పేర్నినాని అన్నారు. సీఎంగా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఏర్పా-టైన ప్రభుత్వం సరాసరి అప్పులు 1.03 లక్షల కోట్లు- చేసిందన్నారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన అప్పు 40 వేల కోట్లు-.. జగన్ తెచ్చిన అప్పుల్లో 2.70 లక్షల కోట్లు- డీబీటీ-ల ద్వారా ప్రజలకు ఇచ్చారు.. జగన్ చేసిన అప్పులకు లెక్కుంది.. ఏడాది కూడా తిరక్కముందే 1.47 లక్షల కోట్లు అప్పులు చేసి ఏం చేశారు అని ప్రశ్నించారు. ఇక, చంద్రబాబు వాళ్ల అబ్బాయి లోకేష్ ఉత్తర కుమార ప్రగల్భాలు పలికారు.. హామీలు అడిగితే భయం వేస్తుంది అని చెబుతారు.. ఇప్పుడేమో చెవిలో చెప్పాలి అంటున్నారు.. రాజ్యాంగ విరుద్ధంగా అప్పులు చేయటం కోసం జీవో కూడా విడుదల చేస్తున్నారని పేర్కొన్నారు.

# కశ్మీర్‌లో నరమేథం దారుణం
## విజయవాడలో జనసేన మానవహారం




**విజయవాడ, ఏప్రిల్ 25 :** జమ్ముకశ్మీర్‌లో అమాయకులైన 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు చంపడం అత్యంత దుర్మార్గమని ఏపీ పౌర సరఫరాలశాఖ మంత్రి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ- ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ జనసేన ఆధ్వర్యంలో విజయవాడలోని పాత బస్టాండ్ కూడలి వద్ద నిర్వహించిన మానవహారంలో మాజీ మంత్రి సామినేని ఉదయభానుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు మూడు రోజుల పాటు- నిరసన కార్యక్రమాలు చేపట్టామని మనోహర్ చెప్పారు. బాధిత కుటుంబ సభ్యులకు తామంతా అండగా ఉంటామన్నారు. ఎంతటి బాధ ఉన్నా ఇలాంటి ఘటనలు జరిగిన సమయంలో ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కావలిలో జనసేన నేత మధుసూదన రావు భౌతికకాయాన్ని చూసి పవన్ కల్యాణ్ చలించిపోయారని నాదెండ్ల పేర్కొన్నారు. జరిగిన దుర్ఘటన గురించి ఆయన భార్య చెబుతుంటే కన్నీరు ఆగలేదన్నారు. ఈ సమయంలో భారత పౌరులంతా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అండగా నిలవాలన్నారు. జనసేన పక్షాన కొవ్వొత్తుల ర్యాలీ, మౌన దీక్షలు, ఇవాళ మానవహారం నిర్వహించామని మనోహర్ వెల్లడించారు. ఇలాంటి సమయంలో రాజకీయాలు, కుల, మతాలు చూడవద్దని, భారతీయులుగా మనవాళ్లకు అండగా నిలవాలని చెప్పారు. బాధిత కుటుంబాలకు జనసేన పక్షాన కూడా సాయం చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.

## ఉపప్రధాని ఇషాక్‌దార్ వ్యాఖ్యలు
# టెర్రరిజాన్ని పోషించేదిగా ఉన్నాయి
### క్రికెటర్ డానిష్ కనేరియా పోస్ట్



**లాహోర్, ఏప్రిల్ 25 :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఘటనపై పాకిస్థాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు విమర్శలకు దారితీశాయి. ఉగ్రవాదులను 'స్వాతంత్ర్య సమరయోధులు' అంటూ పిచ్చి ప్రేలాపనలు చేశారు. దీనిపై ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించాడు. ఇప్పటికే పాక్ ప్రధాని మౌనంగా ఉండటంపై ప్రశ్నల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్ ఉప ప్రధాని ఉగ్రవాదులను ఫ్రీడమ్ ఫైటర్స్ అంటూ సంబోధించారు. ఇది అవమానకరమే కాకుండా.. ఉగ్రవాదానికి మేం మద్దతిస్తున్నాం, ప్రోత్సహిస్తున్నామంటూ బహిరంగంగా అంగీకరించినట్లు- అయిందని డానిష్ పోస్టు పెట్టాడు. ఇప్పటికే పాకిస్థాన్ ఉగ్రవాదులను కాపాడటంతోపాటు ఆశ్రయం కల్పించడంపై డానిష్ సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తూనే ఉన్నాడు. తాను పాక్ లేదా ఇక్కడి ప్రజలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం లేదని స్పష్టంచేశాడు. నేను ఇక్కడ పాకిస్థాన్ లేదా దేశ ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడటం లేదు. ఉగ్రవాదం చేతిలో పాక్ తీవ్రంగా బాధపడుతోంది. శాంతికోసం నిలబడే నాయకత్వం అవసరం ఉంది. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించేవారు కాదు. నేను గర్వంగా పాక్ క్రికెట్ జెర్సీని ధరించా. మైదానం లో నా చెమటను చిందించా. చివరికి నన్ను ట్రీట్ చేసిన విధానం కూడా పహల్గాం బాధితులకు భిన్నంగా లేదు. హిందువుగా ఉన్నందుకే లక్ష్యంగా మారా. ఉగ్రవాదాన్ని సమర్థించేవారు సిగ్గుపడాలి. హంతకులను రక్షించేవారు సిగ్గుపడాలి. నేనెప్పుడైనా మానవత్వం, వాస్తవం వైపే నిలబడతా. పాకిస్థాన్ ప్రజలు కూడా ఇలానే ఉంటారని భావిస్తున్నా. వారిని తప్పుదోవ పట్టించొద్దని సుదీర్ఘమైన పోస్టు పెట్టాడు. జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకున్న ఉగ్రదాడి ఘటనపై పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ స్పందించకపోవడంపై ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా విమర్శలు గుప్పించాడు. ప్రధాని షరీఫ్‌కు వాస్తవం తెలుసంటూ వ్యాఖ్యానించాడు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నట్లు పేర్కొన్నాడు.

# సుప్రీంలో బోరుగడ్డకు చుక్కెదురు
## బెయిల్‌పై హైకోర్టులోనే తేల్చుకోవాలని సూచన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 25 :** వైసీపీ నేత బోరుగడ్డ అనిల్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. బోరుగడ్డకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. తనపై ఉన్న అన్ని కేసుల్లో బెయిల్ ఇవ్వాలని కోరుతూ బోరుగడ్డ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై శుక్రవారం సుప్రీంలో విచారణ జరిగింది. జస్టిస్ బి వి నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. దీనిపై హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీం కోర్టు తేల్చిచెప్పింది. నకిలీ పత్రాలు సమర్పించి గతంలో బెయిల్ పొందినందుకు ఈ కేసును హైకోర్టే తేల్చుతుందని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో పాటు మంత్రి నారా లోకేష్, జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అసభ్య పదజాలంతో దూషించిన కేసులో బోరుగడ్డను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి ఇటీవల హైకోర్టు కొన్ని వ్యాఖ్యలు కూడా చేసింది. బోరుగడ్డను కొంతకాలం జైలులోనే ఉంచాలని, ఎలా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారు అని ప్రశ్నించింది ధర్మాసనం. నకిలీ పత్రాలు సమర్పించి బెయిల్‌పై బయటకు వచ్చారంటూ బోరుగడ్డ బెయిల్ రద్దు చేయాలంటూ ఇటీవల పోలీసులు పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో తనపై నమోదైన అన్ని కేసుల్లో బెయిల్ ఇవ్వాలంటూ బోరుగడ్డ అనిల్ సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. జస్టిస్ బి వి నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణ జరిగింది. అయితే అంశాన్ని హైకోర్టులోనే తేల్చుకోవాలని, నకిలీపత్రాలు సమర్పించి గతంలో బెయిల్ పొందినందున ఈ కేసును హైకోర్టులోనే తేల్చుకోవడం మంచిదని సుప్రీం కోర్టు ధర్మాసనం అభిప్రాయపడుతూ బోరుగడ్డకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. కాగా.. చర్చ్ స్థల వివాదంలో సీఐను బెదిరించారంటూ బోరుగడ్డపై కేసు నమోదు అయిన నేపథ్యంలో ఇటీవల అతడిని అనంతపురం కోర్టులో హాజరుపర్చారు. ఈ సందర్భంగా కోర్టు వద్ద బోరుగడ్డ సంచలన వ్యాఖ్యలు చేశారు. బెయిల్ కోసం తాను ఎలాంటి నకిలీ సర్టిఫికెట్లు- పెట్టలేదని, ఒరిజినల్ సర్టిఫికెట్‌నే ఇచ్చినట్లు- తెలిపారు.



## పిఠాపురంలో వందపడకల
# ఆస్పత్రికి పవన్ శంకుస్థాపన

**కాకినాడ, ఏప్రిల్ 25 :** పిఠాపురంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి డిప్యూటీ-సీఎం పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేశారు. 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా ఏపీ ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. లా అండ్ ఆర్డర్ విషయంలో రాజీ పడం అని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు చేస్తే యాక్షన్ తీసుకుంటాం అని పేర్కొన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. ఇక, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి సారథ్యంలో పిఠాపురం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుంది అని డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేశాం.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి పని చేస్తున్నాం అని వెల్లడించారు.

# పిఎస్ఆర్‌కు మూడ్రోజుల పోలీస్ కస్టడీ

**అమరావతి, ఏప్రిల్ 25 :** ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు కస్టడీ పిటిషన్‌పై విజయవాడ కోర్టులో విచారణ జరిగింది. ఆయన్ను వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సీఐడీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న న్యాయస్థానం మూడు రోజుల కస్టడీకి అనుమతించింది. ఆది, సోమ, మంగళవారాల్లో సీఐడీ అధికారులు ఆయన్ను కస్టడీకి తీసుకోనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారించనున్నారు. న్యాయవాదుల సమక్షంలో విచారణ చేయాలని కోర్టు ఆదేశించింది. ముంబయికి చెందిన సినీనటి కాదంబరి జెత్వానీ, ఆమె కుటుంబ సభ్యులపై అక్రమ కేసు బనాయించి వేధించిన కేసులో పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టయ్యారు. ప్రస్తుతం విజయవాడలోని జిల్లా జైల్లో రిమాండు ఖైదీగా ఉన్నారు.

# ముదురుతున్న ఎండలు
## గ్రామాల్లో మంచినీటి సమస్యలు

**కాకినాడ, ఏప్రిల్ 25 :** వేసవి కాలం ముదరడంతో ప్రజలకు తాగునీటి ఇక్కట్లు మొదలయ్యాయి. చాలీచాలని నీటితో కాలం నెట్టుకొస్తున్నారు. ఇప్పుడు అదనంగా కరెంటు కోతలతో ఏ రోజు నీరు వస్తుందో తెలియని పరిస్థితి. గ్రామాల ప్రజల దాహార్తి తీర్చే నిర్వహణ తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ఆయా ప్రాంతాల్లో తరచూ ప్రధాన పైప్‌లైన్‌లో లీకేజీల వల్ల కొన్ని గ్రామాలకు నీటి సరఫరా జరగడంలేదు. గత నెల రోజులుగా కరెంటు కోతలతో నీటి ఇబ్బందులు మరింత పెరిగాయి. కొన్ని గ్రామాలకు రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతోంది. కొన్నిచోట్ల కాంట్రాక్టు సిబ్బందికి ఎనిమిది నెలలుగా జీతాలు లేక ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టుకు లక్షలు వెచ్చించి ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేసుకున్నా కరెంటు కోతలతో ప్రయోజనం లేకుండా పోయింది. మండు వేసవిలో గ్రామాల తాగునీటి సరఫరా భారంఅ మారుతోంది. అత్యవసర సేవల్లో ఉన్న తాగునీటి సరఫరా విషయంలో అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## విభజన హామీలను
# మోడీ ముందు పెట్టండి
### ప్రత్యేకహోదాపై ఎందుకు రాజీ పడాలి : గఫూర్

**కర్నూలు, ఏప్రిల్ 25 :** ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు... పదేళ్లు ఇవ్వాలన్న బిజెపి మోసం చేసిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్ గుర్తు చేశారు. మరోమారు అమరావతికి వస్తున్న మోడీని విభజన హామీలపై నిలదీయాల్సి ఉందన్నారు. అలాగే ప్రత్యేక హోదా సంగతి తేల్చాలన్నారు. ఇవన్నీ మరచిపోయి కేవలం మోడీ భజనలో మునిగి పోవద్దని కూటమి నేతలకు సూచించారు. ఎన్నికల్లో బిజెపి ఇచ్చిన హామీలపై నిలదీయాలన్నారు. ఈ హామీని నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి కుళ్లు రాజకీయాలను నిలదీయాలన్నారు. దేశంలోనే రాయలసీమ వెనుకబడిన ప్రాంతమని, ఇటువంటి ప్రాంతానికి బుందేల్‌ఖండ్, కెబికె తరహా ప్యాకేజీలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఉమ్మడి పోరాటాల ద్వారా విభజన చట్టంలోని హక్కులను సాధించుకోవచ్చని పేర్కొన్నారు. విభజన హామీలు, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, ప్రత్యేక హోదా సాధన కోసం కేంద్రాన్ని నిలదీయలేక పోతున్నారని మండిపడ్డారు. ఆంధ్రాకు జరిగిన అన్యాయం దేశంలో ఎక్కడా జరగలేదన్నారు. అడగాల్సిన వారు అడగరని, ఇవ్వాల్సిన వారు ఇవ్వడం లేదని విమర్శించారు. పార్లమెంట్‌లో ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. ప్రధాని మోడీ ముందు ఈ సమస్యలను ప్రస్తావించి ప్రజల ఆకాంక్షలను తెలపాలని అన్నారు. వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేసి ప్రధానమంత్రి వద్దకు, కేంద్ర హోం శాఖ మంత్రి వద్దకు తీసుకెళ్లాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఈ విషయంలో చిత్తశుద్ధిని ప్రదర్శించలేదన్నారు. తనకు 25 మంది ఎంపిలను ఇస్తే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి హక్కులన్నింటినీ సాధిస్తామని ఎన్నికల ముందు జగన్ చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు ఇదే విషయంలో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.



## ప్రభుత్వం ఏం చర్యలు తీసుకున్నా.. పూర్తి మద్దతిస్తాం : రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ :** భారతీయులందరూ ఐక్యంగా ఉండటం అవసరమని.. తద్వారా ఉగ్ర చర్యలను, వారి లక్ష్యాలను దీటుగా ఎదుర్కోవచ్చని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని విపక్షాలన్నీ ముక్తకంఠంతో ఖండించాయని, దీనిపై ప్రభుత్వం ఏం చర్యలు తీసుకున్నా తాము మద్దతిస్తామని స్పష్టం చేశారు. శ్రీనగర్‌లో పర్యటించిన రాహుల్.. లెఫ్టినెంట్ గవర్నర్, సీఎంతో భేటీ కావడంతోపాటు ఉగ్రదాడి బాధితులను కలిసి భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. "సమాజాన్ని విభజించడం, సోదరుల మధ్య తగాదాలు సృష్టించడమే ఉగ్రవాదుల పని. ఈ ఉగ్రచర్యను జమ్మూ కశ్మీర్ మొత్తం ఖండించింది. వీరికి యావద్దేశం పూర్తి మద్దతుగా నిలిచింది. భారతీయులంతా ఐక్యంగా ఉండటం ఎంతో ముఖ్యం. అప్పుడే ఉగ్ర చర్యలను, వారి ప్రయత్నాలను దీటుగా ఎదుర్కోగలం. కశ్మీర్‌తోపాటు దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన వారిపై కొందరు దాడులు చేయడం అత్యంత బాధాకరం. మనందరం ఐక్యంగా ఉండి ఉగ్రవాదాన్ని తరిమికొట్టాలి. లెఫ్టినెంట్ గవర్నర్, ముఖ్యమంత్రితోనూ భేటీ అయ్యా. ఏం జరిగిందో వారు వివరించారు. మా పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని వారిద్దరికీ హామీ ఇచ్చా" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

### వరుస సమీక్షలతో ఆర్మీ చీఫ్..

భారత ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది కశ్మీర్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతోనూ భేటీ అయ్యారు. సరిహద్దులో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను ఆయనకు వివరించినట్లు సమాచారం. శ్రీనగర్, ఉదంపుర్‌లో పర్యటించిన ఆర్మీ చీఫ్.. కశ్మీర్ లోయలోని ఆర్మీ కమాండర్లు, ఇతర భద్రతా ఏజెన్సీల ప్రతినిధులతో చర్చలు జరిపారు. కాల్పుల విరమణ ఒప్పందానికి పాకిస్థాన్ సైన్యం తూట్లు పొడుస్తున్న వేళ ఈ వరుస సమీక్షలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.


## నాన్నని చంపేశారు.. నా వైపు గన్ గురిపెట్టారు

### భయానక అనుభవాన్ని వెల్లడించిన ఆరతి



**న్యూఢిల్లీ :** పహల్గాంలో ఉగ్రదాడి సమయంలో తనకు ఎదురైన భయానక పరిస్థితుల్ని కేరళకు చెందిన ఆరతి అనే మహిళ వెల్లడించారు. తన తండ్రిని కళ్లముందే తుపాకీతో కాల్చి చంపేశారంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఉగ్రవాదుల నరమేధాన్ని గుర్తుచేసుకొని భయాందోళన వ్యక్తం చేశారు. కొచ్చికి చెందిన ఆరతి.. తన తండ్రి, ఇద్దరు కుమారులతో కలిసి బైసరాన్‌లోని గడ్డి మైదానాల్లో గుర్రపు స్వారీని ఆస్వాదిస్తున్న సమయంలో లోయలో కాల్పుల మోత వినిపించిందన్నారు. దీంతో అక్కడున్న వారు సురక్షిత ప్రదేశాల వైపు భయంతో కేకలు వేస్తూ పరుగులు పెట్టారని వివరించారు. దీంతో గుర్రాల పైనుంచి తాము ఒక్కసారిగా కిందకు దూకేసి పాకుతూ సురక్షిత ప్రదేశం వైపు వచ్చేశామన్నారు. ఆ సమయంలో తాను పక్కకు చూడగా.. ఒక సాయుధ వ్యక్తి జనాల గుంపు వైపు వచ్చి వారిని ఏవో ప్రశ్నలడుగుతూ.. కాల్పులు జరపడం తాను చూశానని ఆరతి మీడియాకు వివరించారు. "కాసేపటికి ఉగ్రవాదుల నుంచి దాక్కొనేందుకు మరో సురక్షిత ప్రాంతం కోసం నేను అన్వేషిస్తుండగా.. మా తండ్రి అక్కడే ఉండాలని సూచించారు. ఆ తర్వాత సాయుధ వ్యక్తి మా వైపు వచ్చి మతపరమైన శ్లోకం చెప్పాలని హుకుం జారీ చేశాడు. అతడేం చెబుతున్నాడో అర్థంకాలేదని నా తండ్రి చెప్పారు. దీంతో నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపాడు" అని ఆమె కంటతడి పెట్టుకున్నారు. రక్తంతో తడిసి నిర్జీవంగా ఉన్న తన తండ్రి భౌతికకాయాన్ని హత్తుకొని ఏడుస్తుండగా.. ఆ వ్యక్తి తనవైపు కూడా తుపాకీ గురిపెట్టాడన్నారు. తన కుమారులు కేకలు వేయడంతో తమను వదిలేసి వెళ్లిపోయాడన్నారు. అనంతరం తాము ఓ రిసార్ట్ వద్దకు చేరుకోగా.. అక్కడ భారత సైన్యం తమకు రక్షణ కల్పించిందని వివరించారు. ఇంతటి విషాద సమయంలో ఇద్దరు కశ్మీరీ ట్యాక్సీ డ్రైవర్లు ముసాఫిర్, సమీర్ తనకు అండగా నిలబడ్డారని, ఎంతో సాయం చేశారని ఆమె గుర్తు చేసుకున్నారు. తాను మార్చురీకి వెళ్లినప్పుడు తనతో పాటు చాలా సమయం వేచి ఉన్నారన్నారు. విమానాశ్రయానికి కూడా వారు తోడు రాగా.. "నాకు ఇప్పుడు కశ్మీర్‌లో ఇద్దరు సోదరులు ఉన్నారు" అని వారితో అన్నట్లు ఆమె గుర్తు చేసుకున్నారు.

## ఇస్రో మాజీ ఛైర్మన్ కస్తూరి రంగన్ కన్నుమూత



**న్యూఢిల్లీ :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మాజీ ఛైర్మన్ డా. కృష్ణస్వామి కస్తూరిరంగన్ బెంగళూరులోని తన నివాసంలో కన్నుమూశారు. శుక్రవారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. కస్తూరిరంగన్ 1990–1994 వరకు యూఆర్‌ఎసీ డైరెక్టర్‌గా పనిచేశారు. అనంతరం ఆయన 9 ఏళ్లపాటు (1994–2003) ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన హయాంలో ఇస్రో తొలి లూనార్ మిషన్‌కు అడుగులు పడ్డాయి. జేఎన్‌యూ ఛాన్సలర్‌గా, కర్ణాటక నాలెడ్జ్ కమిషన్ ఛైర్మన్‌గా కస్తూరిరంగన్ పనిచేశారు. 2003–09 మధ్య రాజ్యసభ సభ్యుడిగానూ ఉన్నారు. అంతేకాకుండా ప్రణాళికా సంఘం సభ్యుడిగానూ సేవలందించారు. అలాగే, 2004 నుంచి 2009 మధ్య కాలంలో బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్‌కు డైరెక్టర్‌గా పనిచేశారు. మోదీ సర్కార్ తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం ముసాయిదా కమిటీకి అధ్యక్షుడిగా పనిచేశారు. కస్తూరిరంగన్ మృతిపట్ల ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. ఆయన దార్శనిక నాయకత్వం, నిస్వార్థ సహకారం దేశానికి ఎల్లప్పుడూ గుర్తుండిపోతుందన్నారు. భారతదేశ అంతరిక్ష రంగాన్ని కొత్త శిఖరాలకు చేర్చారని కీర్తించారు. ఆయన నాయకత్వంలో ఇస్రో ప్రతిష్ఠాత్మక ఉపగ్రహ ప్రయోగాలను చేసిందని గుర్తు చేసుకున్నారు. ఇస్రో మాజీ ఛైర్మన్ మృతిపట్ల కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## అమెరికా కోసమే చెత్త పనులన్నీ చేశాం

### ఉగ్రవాదులకు శిక్షణను అంగీకరించిన పాక్..



తమ గడ్డపై ఉగ్రవాదులే లేరంటూ ప్రగల్భాలు పలికిన పాకిస్థాన్‌కు గట్టి షాక్ తగిలింది. ఉగ్ర సంస్థలకు నిధులు, ఉగ్రవాదులకు శిక్షణ నిజమేనంటూ స్వయంగా ఆ దేశ రక్షణమంత్రే అంగీకరించారు. ఓ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చేసిన వ్యాఖ్యలు దాయాది నీచ బుద్ధిని బయటపెట్టాయి. అయితే, అమెరికా కోసమే తాము ఉగ్రవాదులను పెంచి పోషించామంటూ ఆ మంత్రి వ్యాఖ్యానించడం గమనార్హం. పహల్గాం దాడి తర్వాత భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తతలపై పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ 'స్కై న్యూస్' మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా "ఉగ్ర సంస్థలకు నిధుల సమీకరణ, ఉగ్రవాదులకు శిక్షణ, మద్దతు వంటివి పాక్ చాలాకాలంగా చేస్తోంది? దీనిపై మీ స్పందన ఏంటీ?" అని జర్నలిస్టు ప్రశ్నించారు. దీనికి ఖవాజా బదులిస్తూ.. "అమెరికా, బ్రిటన్ సహా పశ్చిమదేశాల కోసమే మూడు దశాబ్దాల పాటు మేం ఈ చెత్త పనులన్నీ చేస్తున్నాం. అయితే అది పొరబాటు అని అర్థమైంది. దానివల్ల పాక్ చాలా ఇబ్బందులు పడింది. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో మేం చేరకపోయి ఉంటే.. పాక్‌కు తిరుగులేని ట్రాక్ రికార్డ్ ఉండేది" అని అన్నారు. ఇదే ఇంటర్వ్యూలో లష్కరే తోయిబా గురించి ప్రస్తావించారు. అది పాత పేరు అని, ఇప్పుడు తమ దేశంలో దాని ఉనికిలేదని అన్నారు.

### నియంత్రణ రేఖకు పాక్ సైనికులు..

మరోవైపు, ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దుల్లో పాక్ తన బలగాలను పెంచుతున్నట్లు తెలుస్తోంది. అఫ్గానిస్థాన్ సరిహద్దులతో పాటు బలోచిస్థాన్‌లో ఉన్న మిలిటరీ సిబ్బందిని నియంత్రణ రేఖ వద్దకు పంపిస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. అటు జవాన్ల సెలవులను కూడా పాక్ మిలిటరీ రద్దు చేసినట్లు సమాచారం. కొత్త సెలవులను ఆమోదించొద్దని కార్ప్స్ కమాండర్లను ఆదేశించినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి.

## కొన్ని అమెరికా వస్తువులకు చైనా మినహాయింపు



**చైనా :** అమెరికా నుంచి వచ్చే కొన్ని రకాల దిగుమతులకు 125 శాతం పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని బీజింగ్ భావిస్తోందని సమాచారం. చైనా–అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం ఇప్పటికే కొన్ని రకాల పరిశ్రమలకు ముప్పుగా మారింది. ఈ నేపథ్యంలో పరిశ్రమల్లో ఈథేన్ వంటి రసాయనాలు, వైద్య పరికరాల వంటి వాటిపై మాత్రం పన్ను సడలించే అంశాన్ని పరిశీలిస్తోంది. ఇక విమానాల లీజులు వంటి వాటిపై కూడా పన్నులను మినహాయించాలని బీజింగ్ చూస్తోందని సమాచారం. చైనాలో చాలా వరకు విమానయాన సంస్థలు థర్డ్‌పార్టీ నుంచి ఎయిర్‌క్రాఫ్ట్‌లను లీజుకు తీసుకొని చెల్లింపులు చేస్తాయి. ఇవి ఆర్థికంగా అదనపు టారిఫ్‌ల పరిధిలోకి రావడం సమస్యాత్మకంగా మారింది. అమెరికా–చైనా ఈ నెలలో పోటాపోటీగా పరస్పర సుంకాలు విధించుకున్నాయి. వాషింగ్టన్ 145 శాతం సుంకాలు ప్రకటించగా.. చైనా ప్రతిస్పందిస్తూ 125 శాతం విధించింది. ఈ నేపథ్యంలో ఇరు దేశాలు చర్చలు జరుపుతున్నాయని ట్రంప్ ప్రకటించారు. కానీ, ఆయన ప్రకటన వాస్తవం కాదని.. ఎటువంటి సంప్రదింపులు లేవని బీజింగ్ స్పష్టం చేసింది. ఈ మేరకు చైనా విదేశాంగ ప్రతినిధి వెల్లడించారు.

## హెచ్-1బీ వీసా మోసం కేసు..

### భారతీయుడికి 14 నెలల జైలు




**న్యూయార్క్:** అమెరికాలో హెచ్–1బీ వీసా మోసం కేసులో భారత సంతతి వ్యక్తి కిశోర్‌కు 14 నెలల జైలు శిక్ష పడింది. దీంతోపాటు నిబంధనలను ఉల్లంఘించినందుకు గానూ 1.25 లక్షల డాలర్లు, ఇతర కారణాల కింద 7500 డాలర్ల జరిమానా, ప్రత్యేక రుసుము కింద మరో 1100 డాలర్లు వసూలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. నానోసెమాంటిక్స్ సంస్థకు సహవ్యవస్థాపకుడిగా ఉన్న కిశోర్‌పై అక్రమ మార్గాల్లో వీసాలు పొందేందుకు ప్రయత్నించినట్లు అభియోగాలు రాగా.. అవి నిజమని దర్యాప్తులో తేలింది. ఇందుకు సంబంధించి గత ఏడాదిలోనే నిందితుడు నేరం అంగీకరించగా ఇటీవల శిక్ష ఖరారైంది. కాలిఫోర్నియాకు చెందిన కిశోర్.. బే ఏరియా టెక్ కంపెనీల కోసం నానోసెమాంటిక్స్ సంస్థ ద్వారా నైపుణ్యం కలిగిన ఉద్యోగులను సరఫరా చేసి కమీషన్ పొందుతుండేవాడు. ఈ క్రమంలో 2019లో అక్కడ ఉద్యోగాలు అందుబాటులో లేకముందే వీసాలు పొందే చర్యలకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. ఇలా హెచ్–1బీ వీసాల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని గుర్తించిన పోలీసులు.. కిశోర్‌తో పాటు మరో ఇద్దరిపై వీసా మోసం, కుట్ర కేసులు నమోదు చేశారు.


## ఆర్మీ నర్సింగ్ కాలేజ్ వెబ్‌సైట్ హ్యాక్..




**న్యూఢిల్లీ :** పహల్గాంలో పాశవిక దాడికి పాల్పడిన ఉగ్రవాదులు.. భారత్‌ను మరింత రెచ్చగొట్టే చర్యలకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఆర్మీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ వెబ్‌సైట్ హ్యాక్‌కు గురైంది. పాకిస్థాన్‌కు చెందిన హ్యాకింగ్ బృందం ఈ చర్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. రెండు దేశాల సిద్ధాంతంపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన హ్యాకర్లు.. హెూం పేజీలో ఓ ఇమేజ్‌ను పోస్టు చేశారు. దీనిని ఆర్మీ వర్గాలు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. అయితే, ఇప్పటికే దీన్ని పరిష్కరించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు సమాచారం. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడితో పాకిస్థాన్‌కు సంబంధం ఉందని భారత్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆ దేశ పౌరులను వెనక్కి పంపించడంతోపాటు సింధూ జలాల ఒప్పందం రద్దు, సరిహద్దు మూసివేత, దౌత్య సంబంధాలను తగ్గించుకోవడం వంటి చర్యలతో భారత్ దీటుగా స్పందిస్తోంది. దీంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న దాయాది దేశం సరిహద్దుల్లో కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. తాజాగా అక్కడి హ్యాకర్లు కూడా భారత వెబ్‌సైట్‌లు లక్ష్యంగా రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తుండటం గమనార్హం.

## మా బిడ్డ బతికున్నాడా లేదా?

### పాక్ చెరలో ఉన్న బీఎస్ఎఫ్ జవాను కుటుంబం ఆవేదన



**హుగ్లీ:** భారత సరిహద్దు భద్రతా దళానికి చెందిన జవాను పూర్ణం సాహూ ఇటీవల పొరబాటుగా సరిహద్దు దాటి పాక్ సైన్యానికి చిక్కిన సంగతి తెలిసిందే. అతడి కోసం దాయాదితో కేంద్రం చర్చలు జరుపుతోంది. తమ కుమారుడు ఎలా ఉన్నాడో తెలియక ఆ జవాను కుటుంబం వేదనకు గురవుతోంది. తమ బిడ్డను ఎలాగైనా ఇంటికి తీసుకురావాలంటూ కేంద్రాన్ని వేడుకుంటోంది. "అతడు దేశం కోసం సేవ చేస్తున్నాడు. సెలవు ముగించుకుని మూడు వారాల క్రితమే తిరిగి విధుల్లో చేరాడు. ఇప్పుడు పాక్ కస్టడీలో ఉన్నాడని అధికారులు సమాచారమిచ్చారు. మా బిడ్డ పరిస్థితి ఎలా ఉందో తెలియడం లేదు. అతడు క్షేమంగానే ఉన్నాడా? బతికున్నాడా? లేదా?. ఇప్పుడు ఏం జరుగుతోంది. ఎప్పుడు తిరిగి ఇంటికొస్తాడు" అని జవాను తండ్రి భోల్‌నాథ్ సాహూ ఆవేదన వ్యక్తం చేశారు. "మంగళవారం రాత్రి నాకు ఫోన్ చేశారు. అదే ఆయన గొంతు వినడం. మళ్లీ ఫోన్ చేస్తే కలవలేదు. బుధవారం రాత్రి ఆయన స్నేహితుడొకరు కాల్ చేసి జరిగిన విషయం చెప్పారు. అప్పటి నుంచి ఏడుస్తూనే ఉన్నాం. నాన్నకు ఏమైందని నా ఏడేళ్ల కుమారుడు అడుగుతున్నాడు. నా బిడ్డకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కావట్లేదు" అని పూర్ణం సాహూ భార్య కన్నీరు మున్నీరయ్యారు. బీఎస్ఎఫ్ 182వ బెటాలియన్ జవాను అయిన పూర్ణం.. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సెక్టార్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. బుధవారం సరిహద్దు వద్ద కొంతమంది రైతులకు రక్షణగా గస్తీ కాస్తుండగా ఆయన కాస్త అస్వస్థతకు గురయ్యారు. సమీపంలో ఓ చెట్టు కనబడటంతో దాని కింద విశ్రాంతి తీసుకున్నారు. అయితే, అది పాక్ భూభాగం అన్న విషయాన్ని గుర్తించలేకపోయారు. సరిహద్దు దాటి రావడంతో పాకిస్థాన్ రేంజర్స్ ఆయనను కస్టడీలోకి తీసుకున్నారు. సాహూ విడుదల కోసం రెండు దేశాల భద్రతా దళాలు చర్చలు జరిపాయి. ఈ విషయాన్ని గురువారం రాత్రి అధికారులు ధ్రువీకరించారు. అయితే, ప్రస్తుతం ఆయన పరిస్థితి ఎలా ఉందన్నదానిపై స్పష్టత లేదు. పహల్గాం ఉగ్రదాడితో భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ ఘటన ఆందోళనకు గురిచేస్తోంది.



## పహల్గాం ఉగ్రదాడి.. పారామిలిటరీ బలగాలకు సెలవులు రద్దు

**పహల్గాం :** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో దేశంలోని పారామిలిటరీ బలగాలకు సెలవులు రద్దు చేసినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. సెలవులపై వెళ్లిన జవాన్లు వెంటనే రిపోర్ట్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జమ్మూకశ్మీర్ పరిస్థితులపై అన్ని మిలిటరీ విభాగాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేశారు. శ్రీనగర్‌లోని విమానాశ్రయంలో సైన్యం భద్రతను కట్టుదిట్టం చేసింది. జమ్మూకశ్మీర్ అంతటా భద్రతా దళాలు మోహరించాయి. ఉగ్రవాదుల ఆచూకీ కోసం వేట మొదలుపెట్టాయి. జమ్మూకశ్మీర్‌లో పరిస్థితిని సమీక్షించడానికి భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేదీ కశ్మీర్‌కు చేరుకున్నారు. శ్రీనగర్, ఉదమ్‌పూర్‌లో ఆయన పర్యటించనున్నారు. కశ్మీర్ లోయలోని ఆర్మీ కమాండర్లు, ఇతర భద్రతా ఏజెన్సీల ప్రతినిధులతో భేటీ కానున్నారు. మరోవైపు ఈరోజు సాయంత్రం 4 గంటలకు కేంద్ర హెూం మంత్రి అమిత్ షా నివాసంలో కీలక సమావేశం జరగనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దీనికి విదేశాంగ శాఖ, జల్ శక్తి ఉన్నతాధికారులు హాజరవుతారని సమాచారం. సింధూ జలాల ఒడంబడిక నిలిపివేత, సరిహద్దుల వద్ద కాల్పుల విరమణ, పహల్గాం దాడి, పాక్ దౌత్యవేత్తలకు సమన్లు వంటి భారత ప్రభుత్వ చర్యల నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం నేడు శ్రీనగర్‌లో పర్యటించి.. ఉగ్రదాడిలో గాయపడిన బాధితులను కలవనున్నారు.



## మరోసారి మాస్కోకు ట్రంప్ ప్రతినిధి..

**ఉక్రెయిన్ :** ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే అంశంపై చర్చలు జరిపేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ మాస్కోకు వెళ్లారు. ఈ విషయాన్ని ఇంటర్‌ఫాక్స్ న్యూస్ ఏజెన్సీ ధ్రువీకరించింది. ఈ పర్యటనలో భాగంగా ఆయన రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయ్యే అవకాశం ఉంది. దీనిని ఇప్పటి వరకు క్రెమ్లిన్ వర్గాలు ధ్రువీకరించలేదు. మరోవైపు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ స్పందిస్తూ.. యుద్ధానికి ముగింపు పలికేలా.. అమెరికాతో ఒప్పందం చేసుకోవడానికి మాస్కో సిద్ధంగా ఉందని ప్రకటించారు. కొన్ని అంశాలు పరిష్కారం కావాల్సి ఉందన్నారు. అమెరికా అధ్యక్షుడు సరైన మార్గంలో ఆలోచించడం వల్లే.. ప్రస్తుతం సవ్య దిశలో ప్రయాణిస్తున్నామన్నారు. యుద్ధానికి పరిష్కారం కోసం ఇప్పటికే విట్కాఫ్ మూడు సార్లు మాస్కోను సందర్శించారు. ఫిబ్రవరి 11, మార్చి 13, ఏప్రిల్ 11న ఆయన పుతిన్‌తో మాట్లాడారు. ఈ చర్చల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో పురోగతి కనిపిస్తోందని నిన్న ట్రంప్ పేర్కొన్నారు.

### మాస్కోలో కారుబాంబు పేలుడు.. జనరల్ మృతి

సైన్యంలో అత్యంత కీలకమైన పదవిలో ఉన్న ఓ జనరల్ కారు బాంబు పేలుడులో ప్రాణాలు కోల్పోయారు. రష్యా ఆర్మీ ఆపరేషన్స్ డైరెక్టరేట్‌లో డిప్యూటీ చీఫ్‌గా పనిచేస్తున్న యారొస్లోవ్ మొస్కాలిక్‌గా ఆయన్ను గుర్తించారు. కారు పక్కనే ఉంచిన ఓ గ్యాస్ సిలిండర్‌లో బాంబును పెట్టి దానిని రిమోట్ సాయంతో పేల్చేసినట్లు గుర్తించారు. కానీ, ఈ దాడికి కారణం ఎవరో కచ్చితంగా తెలియరాలేదు. రష్యా సైన్యం నిర్వహించే ప్రధాన ఆపరేషన్ల విషయంలో డైరెక్టరేట్ చీఫ్‌కు యారొస్లోవ్ సహాయకారిగా ఉంటారు. ప్రస్తుతం ఉక్రెయిన్ యుద్ధంలో కూడా ఆయనది చాలా కీలకపాత్ర.



## వక్ఫ్ (సవరణ) చట్టంపై సుప్రీంకోర్టులో కేంద్రం కౌంటర్ అఫిడవిట్

**న్యూఢిల్లీ :** వక్ఫ్ (సవరణ) చట్టం–2025 చట్టబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై కేంద్రం సుప్రీంకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. వక్ఫ్ చట్టం సరైందేనని సమర్థించుకుంది. ఈ చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేయాలని కోరింది. ఈ చట్టంలో చేసిన పలు సవరణలు మత స్వేచ్ఛకు సంబంధించిన ప్రాథమిక హక్కుల్ని హరిస్తాయనే తప్పుడు ప్రాతిపదికపై పిటిషన్లు ఉన్నాయని ఆరోపించింది. ఆర్టికల్ 32 ప్రకారం ఒక చట్టాన్ని సుప్రీంకోర్టు సమీక్షించవచ్చని తెలిపింది. కాకపోతే, పార్లమెంటరీ ప్యానెల్ ద్వారా సమగ్రమైన, లోతైన, విశ్లేషణాత్మక అధ్యయనం అనంతరమే వక్ఫ్ చట్టానికి సవరణలు చేసిందని తెలిపింది. గతంలో ఉన్న నిబంధనలతో ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగం జరిగిందని ఈ సందర్భంగా సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది. ఈ మేరకు 1332 పేజీలతో దాఖలు చేసిన ప్రాథమిక కౌంటర్ అఫిడవిట్‌లో ఈ చట్ట సవరణల్ని సమర్థించుకుంది. 2013 తర్వాత ఆశ్చర్యకరంగా వక్ఫ్ భూమి భారీగా పెరిగిందని పేర్కొంటూ మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ షేర్షా సి షేక్ మొహిద్దీన్ అఫిడవిట్ దాఖలు చేశారు. వక్ఫ్ చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ 72 పిటిషన్లు దాఖలు కాగా.. వీటిపై ఏప్రిల్ 17న సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ నేపథ్యంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే ముందు దీనిపై సమాధానం ఇచ్చేందుకు కేంద్రం వారం గడువు కోరగా.. న్యాయస్థానం అందుకు అంగీకరించింది. తదుపరి విచారణ వరకు వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోమని కేంద్రం తెలిపింది. అయితే, అప్పటివరకు వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించవద్దని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. అనంతరం తదుపరి విచారణను మే 5కు వాయిదా వేసిన విషయం తెలిసిందే.




# ఇక భారత్ - పాక్ ఒకే గ్రూప్‌లో తలపడవా?

## పహల్గాం ఎఫెక్ట్..

ప్రపంచ క్రికెట్‌లో భారత్ - పాకిస్థాన్ జట్ల మధ్య మ్యాచ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. ఇప్పటికే ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగడం లేదు. ఇక భవిష్యత్తులోనూ నిర్వహించే ప్రసక్తే లేదని ఇప్పటికే బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. కేవలం ఐసీసీ ఈవెంట్లలోనే తలపడుతున్నాయి. గ్రూప్ స్టేజ్‌లో భారత్ - పాక్ జట్లను ఉంచితే టోర్నీకి ఆకర్షణగా ఉంటుందనే ఉద్దేశంతో ఐసీసీ నిర్ణయం తీసుకొనేది. అయితే, ఇప్పుడు పహల్గాం ఉగ్రదాడి ఘటన అనంతరం పాకిస్థాన్‌తో గ్రూప్ స్టేజ్‌లో అస్సలు ఆడకూడదని టీమ్‌ఇండియా భావిస్తోందనే వార్తలు వచ్చాయి. ఈమేరకు ఐసీసీకి లేఖ రాసినట్లు కూడా తెలుస్తోంది. భవిష్యత్తులో (ప్రపంచ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ) ఎప్పుడూ భారత్ - పాక్ జట్లను ఒకే గ్రూప్‌లో ఉంచొద్దని అందులో పేర్కొన్నట్లు సమాచారం. అయితే దీనిపై బీసీసీఐ వర్గాలు స్పష్టత ఇవ్వడం లేదు. క్రిక్‌బజ్ రిపోర్ట్ ప్రకారం టాప్ బీసీసీఐ అధికారులు ఆ దిశగా ఆలోచన చేసినట్లు కథనాలు వెలువడుతున్నాయి. “దేశవ్యాప్తంగా ఉగ్రదాడిపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. పాకిస్థాన్‌తో క్రికెట్ సంబంధాలు వద్దనే డిమాండ్లూ వస్తున్నాయి. ఇదే విషయంపై బీసీసీఐ టాప్ ఆఫీస్ బేరర్ ఒకరు ప్రస్తావించారు. చాలా సున్నితమైన అంశం కాబట్టి చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకైతే అలాంటి వార్తల్లో నిజం లేదని భావిస్తున్నా. ముమ్మందు ఏం జరుగుతుందో చెప్పలేం” అని బీసీసీఐ అధికారి పేర్కొన్నారు.

### ఇవి ఐసీసీ టోర్నీలు..

ఈ ఏడాది ఇప్పటికే ఛాంపియన్స్ ట్రోఫీ జరిగిన సంగతి తెలిసిందే. దీనికి పాకిస్థాన్ ఆతిథ్యం ఇచ్చింది. టీమ్‌ఇండియా మ్యాచులన్నీ దుబాయ్ వేదికగానే నిర్వహించారు. చివరికి భారత జట్టే ఛాంపియన్‌గా నిలిచింది. ఇక పురుషుల విభాగంలో ఈ సంవత్సరం ఐసీసీ ఈవెంట్ లేదు. వచ్చే ఏడాది టీ20 ప్రపంచ కప్ ఉంది. ఐసీసీ టోర్నీ కాకపోయినా ఆసియా కప్ కూడా అభిమానులను ఆకట్టుకొనే టోర్నీనే. భారతే ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ మ్యాచులను తటస్థ వేదికపై నిర్వహించాలని బీసీసీఐ - ఏసీసీ భావిస్తున్నాయి. ఇక మహిళల ప్రపంచ కప్ సెప్టెంబర్ - అక్టోబర్‌లో జరగనుంది. పాకిస్థాన్ కూడా అర్హత సాధించింది. భారత్‌తో జరగనున్న మ్యాచులను తటస్థ వేదికల్లో నిర్వహిస్తారా? లేదా రద్దు చేస్తారా? అనేది తెలియదు.




# కీలక మ్యాచ్‌లో తడబడ్డ చెన్నై

## హైదరాబాద్‌కు మూడో విజయం

**చెన్నై:** ఐపీఎల్ 18లో భాగంగా కీలక మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయం సాధించింది. చెపాక్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎస్‌ఆర్‌హెచ్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత హైదరాబాద్ బౌలర్లు విజృంభించడంతో సీఎస్కే 19.5 ఓవర్లలో 154 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులో డేవాల్డ్ బ్రేవిస్ (42) టాప్ స్కోరర్. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఇషాన్ కిషన్ (44: 34 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్స్), కమిందు మెండిస్ (32: 22 బంతుల్లో 3 ఫోర్లు), నితీశ్ కుమార్ రెడ్డి (19: 13 బంతుల్లో 2 ఫోర్లు) రాణించారు. చెన్నై బౌలర్లలో నూర్ అహ్మద్ 2, ఖలీల్ అహ్మద్, అన్షుల్ కంబోజ్, రవీంద్ర జడేజా ఒక్కో వికెట్ తీశారు. చెపాక్‌లో చెన్నైపై హైదరాబాద్ నెగ్గడం ఇదే తొలిసారి. ఈ విజయంతో హైదరాబాద్ తన ప్లే ఆఫ్స్ అవకాశాలను సజీవంగా నిలుపుకుంది. హైదరాబాద్‌కు ఇది మూడో విజయం. ప్లే ఆఫ్స్‌కు చేరాలంటే ఎస్‌ఆర్‌హెచ్




మిగతా అన్ని మ్యాచ్‌ల్లో విజయం సాధించాలి. మరోవైపు చెన్నైకిది ఏడో ఓటమి. 9 మ్యాచ్‌ల్లో ఆజట్టు ఏడింట్లో ఓడింది. మిగతా అన్ని మ్యాచ్‌ల్లో గెలిచినా ఆ జట్టుకు ప్లే ఆఫ్స్ అవకాశాలు నామమాత్రమే. దీంతో సీఎస్కే దాదాపు టోర్నీ నుంచి నిష్క్రమించినట్లే.

### చెలరేగిన హైదరాబాద్ బౌలర్లు..

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన సీఎస్కేకు ఇన్నింగ్స్ తొలి బంతికే షాక్ తగిలింది. షమీ బౌలింగ్‌లో షేక్ రషీద్ అభిషేక్ శర్మకు క్యాచ్ ఇచ్చి డకౌట్‌గా వెనుదిరిగాడు. మరో ఓపెనర్ ఆయుశ్ మాత్రే (30: 19 బంతుల్లో 6 ఫోర్లు) దూకుడుగా ఆడాడు. ఎడాపెడా ఫోర్లు బాదాడు. నాలుగో ఓవర్లలో హర్షల్ పటేల్ బౌలింగ్‌లో సామ్ కరన్ (9) అనికేత్ వర్మకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. స్వల్పతేడాతో అయుశ్ మాత్రేను కమిన్స్ ఔట్ చేశాడు. దీంతో 47 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి చెన్నై కష్టాల్లో పడింది. ఈ క్రమంలో జడేజా (21)తో కలిసి బ్రెవిస్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. 74 పరుగుల వద్ద జడేజా ఔటైనప్పటికీ బ్రెవిస్ సిక్స్‌లతో ఇన్నింగ్స్‌కు ఊపుతెచ్చాడు. అయితే హర్షల్‌పటేల్ బౌలింగ్‌లో కమిందు మెండిస్ అద్భుతంగా క్యాచ్ బ్రెవిస్ వెనుదిరిగాడు. దీంతో సీఎస్కే 114 పరుగుల వద్ద ఐదో వికెట్ కోల్పోయింది. అనంతరం హైదరాబాద్ బౌలర్లు క్రమంగా వికెట్లు తీశారు. దీంతో 19.5 ఓవర్లలో చెన్నై ఆలౌట్ అయింది. దీపక్ హుడా (22), శివమ్ దూబె (12), ధోనీ (6) భారీ స్కోర్ చేయలేకపోయారు.




# ఇక పీఎఫ్ ఖాతా బదిలీ మరింత సులభం

**న్యూఢిల్లీ:** ఉద్యోగులు భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగం మారినప్పుడల్లా పీఎఫ్ ఖాతా బదిలీ చేయటంలో ఎదురవుతున్న సమస్యలకు చెక్ పెట్టింది. అలాగే ప్రత్యేక సందర్భాల్లో వేగంగా యూఎన్‌ఏలను ఇచ్చేలా అనుమతి ఇచ్చింది. ఉద్యోగం మారినప్పుడల్లా పీఎఫ్ ఖాతాను బదిలీ చేయటం తలకు మించిన భారం. రెండు పీఎఫ్ ఆఫీస్‌ల నుంచి సరైన సమయానికి అనుమతులు లభించక ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటారు. ఈ ప్రక్రియను ఈపీఎఫ్‌వో మరింత సరళతరం చేసింది. అత్యధిక సందర్భాల్లో యాజమాన్యం అనుమతి లేకుండానే ఖాతాను కొత్త ఉద్యోగానికి బదిలీ చేసుకోవచ్చని తెలిపింది. ప్రస్తుతం పాటిస్తున్న విధానం ప్రకారం ఉద్యోగం మారినప్పుడు పీఎఫ్ ఖాతాను బదిలీ చేయాలంటే ఇటు పాత ఆఫీస్, అటు పీఎఫ్ ఆఫీస్ అనుమతి తప్పనిసరి. కొన్నిసార్లు సమన్వయలోపం సహా వివిధ కారణాలతో బదిలీ ప్రక్రియ నత్తనడకన సాగేది. తాజా నిర్ణయంతో ఈ ప్రక్రియ మరింత సులభం కానుంది. పాత పీఎఫ్ ఆఫీస్ అన్ని క్లెయింలకు అనుమతి ఇస్తే నేరుగా కొత్త పీఎఫ్ ఖాతాకు బదిలీ అయిపోతుంది. ఫామ్-13 అప్‌గ్రేడ్ చేయడంతో ఇది మరింత సరళతరం చేసినట్లు ఈపీఎఫ్‌వో వెల్లడించింది. దీని వల్ల ఏటా 1.25కోట్ల మంది చందాదారులు లబ్ధి పొందటంతో పాటు, రూ.90వేల కోట్ల నగదు బదిలీ వేగవంతం కానుంది. ఆధార్‌తో పనిలేకుండా, కొన్ని ప్రత్యేక కేసుల్లో కేవలం ఐడీ, ఆధారంగా అధిక సంఖ్యలో యూఏఎన్‌లను క్రియేట్ చేసే సౌకర్యాన్ని కూడా ఈపీఎఫ్‌వో కల్పించింది. ఆ మేరకు ఫీల్డ్ ఆఫీసులకు సాఫ్ట్‌వేర్ సిద్ధం చేసి, అందుబాటులో ఉంచింది. అదే సమయంలో పీఎఫ్ ఫండ్స్‌కు రక్షణ కల్పించడానికి కొత్తగా జనరేట్ చేసిన అన్ని యూఎన్‌ఏలకు కచ్చితంగా ఆధార్‌తో సీడింగ్ చేయాల్సిందే. అప్పటివరకూ ఆ ఖాతాలను స్తంభింపచేయనున్నారు. నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు ఇది ఉపయోగపడుతుందని ఈపీఎఫ్‌వో భావిస్తోంది.

# సూచీలకు తప్పని నష్టాలు

**ముంబయి:** దేశీయ మార్కెట్ సూచీలు శుక్రవారం భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ.. దేశీయంగా బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను పడేశాయి. దీనికి తోడు పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపించాయి. దీంతో నేటి ట్రేడింగ్‌లో సూచీల భారీగా పతనమయ్యాయి. చివరకు కాస్త కోలుకున్నప్పటికీ నష్టాలు తప్పలేదు. సెన్సెక్స్ దాదాపు 600 పాయింట్లు దిగజారగా.. నిఫ్టీ 24వేల మార్క్‌ను నిలబెట్టుకోగలిగింది. శుక్రవారం నాటి ట్రేడింగ్‌ను సూచీలు సానుకూలంగానే ప్రారంభించినప్పటికీ.. కాసేపటికే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఈ ఉదయం 79,830 వద్ద ఉత్సాహంగా ప్రారంభమైన సెన్సెక్స్ ఒక దశలో 80వేల మార్క్ పైన కదలాడింది. కానీ.. ఆ ఉత్సాహం ఎంతోసేపు కొనసాగలేదు. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో ఒత్తిడికి గురైన సూచీ దాదాపు 1200 పాయింట్లు క్షీణించి ఇంట్రాడేలో 78,605 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. చివర్లో కాస్త కోలుకున్నప్పటికీ నష్టాలు ఎక్కువగానే ఉన్నాయి. నేటి మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 588.90 పాయింట్లు పతనమై 79,212.53 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ కూడా 23,847-24,365 మధ్య కదలాడింది. చివరకు 207.35 పాయింట్లు దిగజారి 24,039.35 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 17 పైసలు క్షీణించి 85.44గా ముగిసింది. ఐటీ మినహా దాదాపు అన్ని రంగాల షేర్లు నష్టపోయాయి. బ్యాంకింగ్, మీడియా, టెలికాం సూచీలు 2-3 శాతం మేర కుదేలయ్యాయి. నిఫ్టీలో యాక్సిస్ బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, శ్రీరామ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, ట్రెంట్ షేర్లు భారీగా



నష్టపోయాయి. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు రాణించాయి.

### పాక్ స్టాక్ ఎక్ఛేంజీ పోర్టల్ డౌన్..

మరోవైపు, తాజా పరిణామాలతో పాక్ స్టాక్ మార్కెట్లు కూడా భారీగా నష్టపోయాయి. కరాచీ స్టాక్ ఎక్స్ఛేంజ్ 100 సూచీ గురువారం దాదాపు 2500 పాయింట్లు కుంగింది. ఈ నేపథ్యంలో పాక్ స్టాక్ ఎక్స్ఛేంజీ పోర్టల్ డౌన్ అవ్వడం చర్చనీయాంశమైంది. శుక్రవారం ఉదయం ఆ పేజీ యూజర్లకు అందుబాటులో లేదు. ప్రస్తుతం ఇది మెయింటనెన్స్‌లో ఉందని, త్వరలోనే అందుబాటులోకి వస్తుందనే సందేశం కన్పిస్తోంది.

# మారుతీ సుజుకీ చరిత్రలోనే అత్యధిక డివిడెండ్: షేరుకు రూ.135..

దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ మదుపర్లకు చరిత్రలోనే అత్యధిక డివిడెండ్ ప్రకటించింది. తాజాగా మార్చితో ముగిసిన త్రైమాసిక ఫలితాలను వెల్లడించింది. గతేడాది ఇదే సీజన్‌తో చూస్తే సమీకృత నికర లాభం 1.04 శాతం తగ్గి రూ.3,911.1 కోట్లకు పరిమితమైంది. ఇక సంస్థ ఆపరేషన్స్ నుంచి వచ్చిన ఆదాయంలో మాత్రం 6.37 శాతం వృద్ధి నమోదై రూ.40,920.1 కోట్లకు చేరింది. గతేడాది ఇది రూ.38,585.2 కోట్లుగా నిలిచింది. ఈ సారి అత్యధిక వార్షిక విక్రయాలు, ఎగుమతులు చేసినట్లు మారుతీ సుజుకీ వెల్లడించింది. దేశీయంగా అత్యధిక కార్లను ఎగుమతి చేసిన సంస్థగా వరుసగా నాలుగోసారి నిలిచింది. భారత్ నుంచి ఎగుమతైన ప్యాసింజర్ కార్లలో 43 శాతం ఈ కంపెనీవే. ఈ నేపథ్యంలో బోర్డు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో షేరుకు రూ.135 బోనస్‌గా ఇవ్వాలని నిర్ణయించింది. కంపెనీ బీఎస్ఈలో నమోదైన నాటి నుంచి చెల్లించిన అత్యధిక డివిడెండ్ ఇదే. మారుతీ సుజుకీ ఎలక్ట్రిక్ కారు ‘ఈ విటారా’ విక్రయాలు ఈ ఏడాది సెప్టెంబర్ చివరి నుంచి ప్రారంభించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. కంపెనీ నుంచి వస్తున్న తొలి బ్యాటరీ వాహనం ఇదే కావడం విశేషం. దీనిని గుజరాత్ ప్లాంట్‌లో ఉత్పత్తి చేస్తున్నారు. ఈ కారును కేవలం భారత్‌లోనే కాకుండా 100 దేశాలకు కూడా ఎగుమతి చేయనున్నారు. వీటిల్లో జపాన్, ఐరోపా దేశాలున్నాయి. కంపెనీ




నాలుగో త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన అనంతరం ఛైర్మన్ ఆర్.సి.భరద్వాజ్ ఈ విషయాన్ని వెల్లడించారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ దాదాపు 70,000 యూనిట్లను ఉత్పత్తి చేస్తుందన్నారు. వీటిల్లో అత్యధిక భాగం ఎగుమతులకే అని పేర్కొన్నారు. ఈ కారును తొలిసారి భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో ప్రదర్శించారు. దీనిని బీఈవీ ప్లాట్‌ఫామ్ హెర్టెక్ట్ ఈపై నిర్మించారు. దీనిలో రెండు 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ ఆప్షన్లు ఉండనున్నాయి. ఒక్క సారి ఛార్జి చేస్తే ఏకధాటిగా 500 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు.

# ఇక అమెరికాలో ‘మేక్ ఇన్ ఇండియా’ ఐఫోన్లే.. తయారీ మొత్తం భారత్‌లోనే..

అమెరికా, చైనా భారీ స్థాయిలో పరస్పర సుంకాలు విధించుకోవడంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం రాజుకుంది. ఈ క్రమంలోనే టారిఫ్‌ల నుంచి తప్పించుకునేందుకు దిగ్గజ సంస్థ యాపిల్ ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. ఇందులో భాగంగానే అమెరికా మార్కెట్లో విక్రయించే ఐఫోన్ల తయారీ మొత్తాన్ని భారత్‌కు తరలించాలని కంపెనీ యోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. 2026 నాటికి అమెరికా మార్కెట్ కోసం ఐఫోన్ల తయారీ ప్రక్రియ మొత్తం భారత్ కేంద్రంగానే జరిగేలా యాపిల్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సదరు కథనాల సారాంశం. ఇప్పటివరకు అమెరికా వెలుపల తయారు చేస్తున్న ఐఫోన్లలో భారత్ వాటా 14% కాగా.. దాదాపు 80 శాతం ఐఫోన్లు చైనాలోనే తయారవుతున్నాయి. ఇప్పుడు సుంకాల నేపథ్యంలో యాపిల్‌పై అదనపు భారం పడనుంది. చైనా నుంచి అమెరికాలో దిగుమతి చేసుకుంటే, 145% పన్ను కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో చైనా, భారత్‌లో తయారు చేసే ఐఫోన్ల ధరల మధ్య అమెరికా విపణిలో భారీ వ్యత్యాసం ఉంటోంది. ఈ క్రమంలోనే తయారీని భారత్‌కు మార్చాలని యాపిల్ యోచిస్తోంది. అదే జరిగితే.. ఇక అగ్రరాజ్య మార్కెట్‌లో ‘మేక్ ఇన్ ఇండియా’ ఐఫోన్లే కన్పిస్తాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ తొలిసారి ఎన్నికైనప్పుడే చైనాతో వాణిజ్య విరోధం మొదలైంది. ఫలితంగా బలమైన ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా మరో దేశాన్ని ఎంచుకోవాలని యాపిల్ సహా పలు బహుళజాతి సంస్థలు భావించాయి. అదే సమయంలో స్మార్ట్‌ఫోన్లపై తయారీ ఆధారిత ప్రోత్సాహకాలు కల్పిస్తామని 2020లో భారత ప్రభుత్వం ప్రకటించింది. దీంతో యాపిల్ మన దేశంలో ఐఫోన్ల అసెంబ్లింగ్‌ను ప్రారంభించింది. గత ఆర్థిక సంవత్సరంలో యాపిల్ 22 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను భారత్‌లో తయారు చేసింది. ఇందులో 18 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను సంస్థ ఇతర దేశాలకు ఎగుమతి చేసింది.

## శాంసంగ్.. చెన్నై ప్లాంట్‌లో రూ.1000 కోట్ల పెట్టుబడి




దక్షిణ కొరియాకు చెందిన శాంసంగ్ ఎలక్ట్రానిక్స్..చెన్నైలోని తన ప్లాంట్‌లో రూ.1,000 కోట్లు పెట్టుబడి పెట్టనుందని ఈ రోజు(శుక్రవారం) తమిళనాడు పరిశ్రమలు, పెట్టుబడి ప్రమోషన్, వాణిజ్య మంత్రి టి.ఆర్.బి రాజా తెలిపారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో వేతనాలు, యూనియన్ గుర్తింపునకు సంబంధించి కార్మిక వివాదాలు ఉన్నప్పటికీ..శాంసంగ్ ఎలక్ట్రానిక్స్, తన దక్షిణ భారతదేశంలోని ప్లాంట్‌లో రూ.1000 కోట్ల వరకు అదనపు పెట్టుబడిని పెట్టడానికి ముందుకు వచ్చింది. ఈ ఫ్యాక్టరీ ప్రస్తుతం 2,000 మందికి పైగా ఉద్యోగులను కలిగి ఉండి, శాంసంగ్ ఇండియా అమ్మకాలకు సంబంధించి గణనీయమైన ఉత్పత్తులను అందిస్తోంది. ఈ ఫ్యాక్టరీ రిఫ్రిజిరేటర్లు, టెలివిజన్లు, వాషింగ్ మెషీన్లను తయారు చేస్తుంది. ఇది, శాంసంగ్ ఎలాక్ట్రానిక్స్ ఉత్పత్తులకు సంబంధించి దేశీయ అమ్మకాలలో ఐదవ వంతు.

సినిమా CINEMA

జనశక్తి

# సారంగపాణి జాతకం.. నవ్వించిందా?

రివ్యూ:



యువ కథానాయకుడు ప్రియదర్శి వరుస సినిమాలతో మంచి ఫామ్‌లో ఉన్నారు. సున్నితమైన కథలు, స్వచ్ఛమైన హాస్యానికి పెట్టింది పేరు దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన కామెడీ ఎంటర్‌టైనర్ 'సారంగపాణి జాతకం'. కుటుంబం మొత్తాన్ని థియేటర్‌కి కదిలించేంతగా నవ్వులు ఇందులో పండాయా? అసలు సినిమా ఎలా ఉంది?

కథేంటంటే..

సారంగపాణి (ప్రియదర్శి) హ్యుందాయ్ కార్ల కంపెనీలో ఓ సేల్స్‌మేన్. రెండేళ్లుగా బెస్ట్ సేల్స్‌మెన్‌గా కొనసాగుతుంటాడు. అదే కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తుంటుంది మైథిలీ (రూప కొడువాయూర్). ఆమె ప్రేమలో ఉన్న సారంగకి చిన్నప్పటి నుంచీ జాతకాలపై నమ్మకం. ఆ రోజు కూడా అద్భుతమైన రోజు అని తెలిశాకే మైథిలీకి తన ప్రేమ విషయం చెప్పాలని ఆఫీస్‌కి బయల్దేరతాడు. మైథిలీయేమో నమ్మకాల్ని పట్టించుకోని ఆధునిక భావాలున్న ఓ యువతి. సారంగ తాను ప్రేమిస్తున్న సంగతిని చెప్పేలోపే మైథిలీ తన మనసులో మాటని చెబుతుంది. దాంతో ఆ ఇద్దరి ప్రేమకథ సుఖాంతమవుతుంది. (%ఝితీఖఅస్త్రుజ్ఖుఅఱ యిఫ్ట్రుుఝిఎ తీవజఱవష%) ఇద్దరికీ వివాహం కూడా నిశ్చయమవుతుంది. ఇంతలో ఓ రోజు పబ్‌లో హస్త సాముద్రికుడైన జిగేశ్వరానంద (అవసరాల శ్రీనివాస్)ని కలుస్తాడు సారంగ. చేయి చూసి భవిష్యత్తులో ఓ మర్డర్ చేస్తావని చెబుతాడు. అసలే జాతకాల్ని అతిగా నమ్మే సారంగ... మర్డర్ భయంతో తన పెళ్లిని వాయిదా వేసుకుంటాడు. జాతకంలో ఎలాగూ ఓ మర్డర్ చేస్తానని ఉంది కాబట్టి... పెళ్లికి ముందే ఆ పనిని పూర్తి చేస్తే తర్వాత తన వైవాహిక జీవితానికి ఏ సమస్యలు రావు కదాని ఓ నిర్ణయానికొస్తాడు. తన చిన్ననాటి మిత్రుడు, తనతోపాటే పనిచేసే చందు (వెన్నెల కిశోర్)తో కలిసి మర్డర్‌కి వ్యూహం పన్నుతారు. వీళ్లు హత్య చేయాలనుకున్న అహోబిల రావు (తనికెళ్ళ భరణి) ఎవరు? అతన్ని హత్య చేశారా లేదా? తదితర విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.


ఎలా ఉందంటే..

కథతో నవ్వించే సినిమాలు తెలుగులో వచ్చి చాలా కాలమైంది. కామెడీ అంటే లాజిక్ లేని సన్నివేశాలు, ద్వంద్వార్థాలతో కూడిన సంభాషణలేనేమో.. అలా కాకుండా ప్రేక్షకుల్ని నవ్వించడం కష్టమేమో అన్నట్టుగా ఈ మధ్య సినిమాలు వస్తున్నాయి. అందుకు భిన్నంగా కథ నుంచే స్వచ్ఛమైన వినోదం పుట్టించిన సినిమా ఇది. ఇందులోనూ క్రేజీగా వ్యవహరించే పాత్రలు, సిల్లీగా అనిపించే సన్నివేశాలు ఉన్నా అవన్నీ కథలో భాగంగానే వస్తుంటాయి. అతిగా నమ్మడంతో ఎన్ని అనర్థాలో చెప్పే ఈ కథకి దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి మార్క్ రచన ప్రధానబలం. నేపథ్యం కొత్తదేమీ కాకపోయినా, కథ, కథనాలు ఊహకందినా సినిమాలో హాస్యంపాళ్లు మాత్రం ఎక్కడా తగ్గవు. అసలైన నవ్వుల ప్రయాణాన్ని షురూ చేయడానికి పది నిమిషాలు సమయం తీసుకున్న దర్శకుడు... ఆ తర్వాత గేర్ మార్చారు. శ్రీనివాస్ అవసరాల రాకతో సినిమా గమనం మారిపోతుంది. జాతకంలో ఉన్న మర్డర్‌ని పెళ్లికి ముందే చేయాలని ప్రియదర్శి, వెన్నెల కిశోర్ ఓ నిర్ణయానికి వచ్చే సన్నివేశాల నుంచి థియేటర్‌లో అసలు సిసలు సందడి మొదలవుతుంది. (%ఝితీఖఅస్త్రుజ్ఖుఅఱ యిఫ్ట్రుుఝిఎ తీవజఱవష%) అక్కడి నుంచి వీళ్లు హత్య చేసేందుకు ఎంచుకునే వ్యక్తులు, అక్కడ వ్యూహాల్ని అమలు చేసేందుకు పడే పాట్లు, ఆ సందర్భంలో పండే హాస్యం సినిమాకి హైలైట్. ముఖ్యంగా బామ్మ ఎపిసోడ్ ఆకట్టుకుంటుంది. ద్వితీయార్ధంలో హీరోహీరోయిన్ల మధ్య దూరం పెంచి, ఆ నేపథ్యంలో సంఘర్షణని ఆవిష్కరిస్తారేమో అని ఆశించగా, దర్శకుడు మళ్లీ కామెడీ కోణంలోనే కథని మలుపు తిప్పాడు.

ప్రియదర్శి, వెన్నెల కిశోర్‌కి వైవా హర్షతోపాటు మరికొన్ని కొత్త పాత్రలు తోడవడంతో మరిన్ని నవ్వులు పండుతాయి. కథ విశాఖపట్నంలోని హోటల్‌కి చేరాక సన్నివేశాలన్నీ అక్కడక్కడే తిరుగుతుంటాయి. పాత్రలన్నింటినీ ఒక చోటకి చేర్చి నవ్వులు రాబట్టడం, కథని ముగించిన తీరు బాగుంది. దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి తెలుగుదనానికి పెద్దపీట వేస్తారు. ఇందులో అచ్చ తెలుగు సంభాషణలు, ప్రాసలు, పదప్రయోగాలు చాలానే ఉన్నాయి. అదే సమయంలో ఆంగ్ల సంభాషణలు కూడా ఎక్కువగా వినిపిస్తాయి. కొన్నైతే సోషల్ మీడియాని బాగా అనుసరించేవాళ్లకి మాత్రమే అర్థమయ్యేలా ఉంటాయి. ఆల్ఫా మేల్ సహా చాలా సంభాషణల్లోని వ్యంగ్యం నవ్వించింది. ఎక్కడా అసభ్యకరమైన సన్నివేశాలు ఉండవు. వేసవిలో ఇంటిల్లిపాదీ కలిసి చూసేందుకు అనువైన సినిమా ఇది.

ఎవరెలా చేశారంటే...

సారంగపాణి పాత్రలో ప్రియదర్శి సందడి ఆకట్టుకుంటుంది. కామెడీ సన్నివేశాల్లో మంచి టైమింగ్‌ని ప్రదర్శించారు. కథానాయిక రూప కొడువాయూర్ ప్రాధాన్యమున్న పాత్రలో కనిపిస్తూ, అందంతోనూ నటనతోనూ ఆకట్టుకుంది. వెన్నెల కిశోర్ దాదాపు ప్రతి ఫ్రేమ్‌లోనూ కనిపిస్తారు. హీరో సమానమైన పాత్ర ఆయనది. రాంకీ పాత్రలో వైవా హర్ష ద్వితీయార్థంలో నవ్వులు పంచుతారు. కథలోని క్రైమ్ కోణం శ్రీనివాస్ అవసరాలది. జిగేశ్వర్‌గా ఆయన నటన సినిమాకి కీలకం. వీకే నరేష్, శ్రీనివాస్ వడ్లమాని, కల్పలత. రూపలక్ష్మి తదితరులు ప్రాధాన్యమున్న పాత్రల్లో కనిపిస్తారు. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. వివేక్ సాగర్ స్వరపరిచిన పాటలు, నేపథ్య సంగీతం సినిమాకి ప్రధానబలం. పి.జి.విందా కెమెరా సినిమా నాణ్యతని పెంచింది. ఎడిటింగ్‌తో పాటు ఇతర విభాగాలూ మంచి పనితీరుని కనబరిచాయి. దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి కొత్త కథని చెప్పడం కంటే కూడా, ప్రేక్షకులకు బాగా పరిచయమున్న కథ, నేపథ్యాన్ని, పాత్రల్నే రాసుకుని వాటితో కొత్తగా నవ్వించే ప్రయత్నం చేశారు. నిర్మాణం ఉన్నతంగా ఉంది.



## 'దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్'కు 'క' నామినేట్

నటుడు కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'క'. నూతన దర్శకులు సుజిత్, సందీప్ సంయుక్తంగా తెరకెక్కించారు. నయన్ సారిక, తన్వీ రామ్ కథానాయికలు. దీపావళి కానుకగా గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈసినిమా మంచి స్పందన సొంతం చేసుకుంది. కిరణ్ అబ్బవరం కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. తాజాగా ఈ సినిమా ఓ సంస్థ నిర్వహించే 'దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్'కు నామినేట్ అయింది. ఉత్తమ చిత్రం విభాగానికి ఈ సినిమా నామినేట్ అయినట్లు టీమ్ ప్రకటించింది. దిల్లీ వేదికగా ఈ నెలాఖరున జరగనున్న వేడుకల్లో విజేతలకు పురస్కారాలు అందించనున్నారు. 'క' విషయానికి వస్తే.. ఫాంటసీ థ్రిల్లర్‌గా రూపొందింది. డాల్బీ విజన్: ఆటమ్స్ టెక్నాలజీలతో తెరకెక్కించారు. అభినయ్ వాసుదేవ్ (కిరణ్ అబ్బవరం) అనాథ. ఇతరుల ఉత్తరాలు చదువుతూ.. తన సొంతవాళ్లే రాశారని ఊహించుకుంటూ జీవితాన్ని గడిపే వ్యక్తి. అలా ఓ రోజు ఉత్తరం చదువుతుండగా ఆ ఊళ్లో కనిపించకుండా పోయిన అమ్మాయిల గురించి ఓ విషయం తెలుస్తుంది. ఆ తర్వాత అతని జీవితంలో ఎలాంటి సంఘటనలు ఎదురయ్యాయి..? అనే నేపథ్యంలో సిద్ధమైన చిత్రమిది. దీనికి కొనసాగింపుగా 'క 2' ఉంటుందని ఇప్పటికే టీమ్ ప్రకటించింది. 'పార్ట్ 1'తో పోలిస్తే.. 'పార్ట్ 2' మరింత ఉత్కంఠగా సాగేలా చూస్తామని టీమ్ చెప్పింది.

## హిట్-3 పెద్దలకు మాత్రమే



నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన సినిమా హిట్ 3. విడుదలకు సిద్దంగా ఉంది. యంగ్ డైరెక్టర్ శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో నానిని ఇప్పటి వరకు చూడని కొత్త యాంగిల్‌లో చూడబోతున్నాం. ఆ మధ్య రిలీజ్ అయిన టీజర్ తో ఇటీవల రిలీజ్ అయిన ట్రైలర్ చుస్తే ఈసారి వైలెన్స్‌కే వణుకు పుట్టించేలా ఉన్నాడు నాని. దసరా, సరిపోదా శనివారం లాంటి మాస్ సినిమాలు చేసినప్పటికీ హిట్ 3తో ఊహించని ఊచకోతకు రెడీ అవుతున్నాడు నాని. కాగా హిట్ 3 వరల్డ్ వైడ్ గా మే 1న రిలీజ్ కానుంది. రిలీజ్ కు వారం మాత్రమే గడువు ఉన్న నేపథ్యంలో ప్రమోషన్స్ లో స్పీడ్ పెంచారు మేకర్స్. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న హిట్ 3 కు సెన్సార్ సభ్యులు ఎ సర్టిఫికెట్ అందించారు. సినిమాలో హింస, రక్తపాతం, వైలెన్స్ ఎక్కువగా ఉందని 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసారు. 13 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న వారికి అనుమతి లేదని చిన్న పిల్లలు ఈ సినిమాకు దూరంగా ఉండాలని సూచించింది. నాని స్వయంగా నటిస్తూ నిర్మిస్తున్న సినిమా కావడంతో ప్రమోషన్స్ ను భారీ ఎత్తున జెట్ స్పీడ్ లో చేస్తున్నాడు నాని. ఈ హిట్ సిరీస్ లోని తోలి రెండు బాగాలు హిట్ కావడంతో పాటు- నేచురల్ స్టార్ మోస్ట్ వాయిలెంట్ గా కనిపిస్తుండడం సినిమాకు గ్రాండ్ ఓపెనింగ్ తీసుకువచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ సినిమాపై ఫ్యాన్స్ భారీ అంచనాలు పెట్టు- కున్నారు. మరి అంచనాలు హిట్ 3 ఏ మాత్రం అందుకుంటదో మరోక వారం రోజుల్లో తెలుస్తుంది.



## మరోమారు రజనీ సార్‌తో ఫహాద్ స్క్రీన్ షేర్

మలయాళ నటుడే అయినా సౌత్‌లో సూపర్బ్ పాపులారిటీ తెచ్చుకున్నాడు ఫహాద్ ఫాజిల్. 'పార్టీ లేదా పుష్పా' అనే డైలాగ్‌తో తెలుగులో తన ఇమేజ్‌ను మరింత పెంచుకున్నాడు. అలాగే పలువురు స్టార్ హీరోల చిత్రాల్లో నటించి తనదైన యాక్టింగ్‌తో మెస్మరైజ్ చేసిన ఫహాద్.. ఓ క్రేజీ కాంబోను రిపీట్ చేయబోతున్నాడట. ఇప్పటికే సూపర్ స్టార్ రజినీకాంత్ 'వేట్టయాన్'లో కీలక పాత్ర పోషించిన ఫహాద్.. మరోసారి రజినీతో స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నట్టు- తెలుస్తోంది. నెల్సన్ దిలీప్ కుమార్ రూపొందిస్తున్న 'జైలర్ 2'లో ఓ ఇంపార్టెరట్ రోల్ కోసం ఫహాద్‌ను సంప్రదించగా, తను గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. త్వరలోనే ఈ క్రేజీ కాంబోపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. 'వేట్టయాన్'లో వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకు హైలైట్‌గా నిలవగా, 'జైలర్ 2' చిత్రంపైనా అంచనాలు ఏర్పడ్డాయి. అలాగే 'జైలర్'లో అతిథి పాత్రలు పోషించిన మోహన్ లాల్, శివ రాజ్‌కుమార్‌లు ఇందులోనూ కొనసాగుతారా లేదా అనేది తెలియాల్సి ఉంది. సన్ పిక్చర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.




## కొందరితో బంధానికి నిర్వచనం ఉండదు

### సమంతతో సినిమా చేస్తానన్న సుధా కొంగర

కొందరితో బంధం బలంగా ఉంటుందని..దానికి నిర్వచనం ఇవ్వలేమని ప్రముఖ నటి సమంత అన్నారు. ఒక్క అంశం ఆధారంగా కెరీర్‌ను నిర్ణయించలేమని సమంత అన్నారు. తాజాగా కోలీవుడ్‌లో నిర్వహించిన గోల్డెన్ క్వీన్ పురస్కారాల్లో సమంత గోల్డెన్ క్వీన్‌గా అవార్డు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అలాగే దర్శకుడు, నటుడు రాహుల్ రవీంద్రన్‌తో తన అనుబంధాన్ని పంచుకున్నారు. నాకు ఆరోగ్యం బాగాలేనప్పుడు రాహుల్ నావెంటే ఉన్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. మా అనుబంధానికి పేరు పెట్టలేను. నా స్నేహితుడు, సోదరుడు, కుటుంబ సభ్యుడు, రక్తసంబంధీకుడా అని చెప్పలేనని అన్నారు. అభిమానుల గురించి మాట్లాడుతూ.. ఇంతమంది అభిమానులను సొంతం చేసుకోవడం నా అదృష్టం. లక్‌తో పాటు- నేను పడిన కష్టమే ఈరోజు ఇంతమంది అభిమానానికి కారణం. దేవుడిచ్చిన వరంగా భావిస్తాను. మనం తీసుకునే ఒక్క నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకొని కెరీర్ ఎలా ఉంటు-ందో చెప్పలేం. ఒకవేళ ఎవరైనా అలా డిసైడ్ చేస్తే అది అబద్ధమే అవుతుంది. తెలిసి, తెలియక తీసుకున్న ఎన్నో నిర్ణయాలు కెరీర్‌పై ప్రభావం చూపుతాయని సమంత తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శకురాలు సుధ కొంగర మాట్లాడుతూ సమంతపై ప్రశంసల వర్షం కురిపించారు.సమంతకు నేను అభిమానిని. 5 సంవత్సరాలుగా ఆమెను దగ్గర నుంచి చూస్తున్నాను. ఆమె బాధపడినప్పుడు నాకు కన్నీళ్లు వచ్చేవి. సమంతను చూసి ఎంతోమంది అమ్మాయిలు ధైర్యం తెచ్చుకోవాలి. ఆమెతో సినిమా తీయాలని రెండుసార్లు ప్రయత్నించాను. కానీ, కుదరలేదు. ఎప్పటికైనా సమంతతో కచ్చితంగా సినిమా తీస్తాను. ఆమె నటించిన 'ఊ అంటావా..' పాట నాకు చాలా ఇష్టం' అని చెప్పారు. ఈ మాటలకు సమంత స్పందిస్తూ.. తనకు యాక్షన్ ఫిల్మ్ చేయాలనుందని చెప్పారు. కచ్చితంగా యాక్షన్ ఫిల్మ్ చేద్దామని సుధ అన్నారు.

## సూర్యతో మరోమారు జతకట్టబోతున్న కీర్తి



కీర్తి సురేష్..పేరు చెబితే మహానటి సినిమానే గుర్తుకు వస్తుంది. మూవీలో సావిత్రిగా నటించి అందరి మన్ననలు అందుకుంది. ఇక కీర్తి సురేష్ టాలీవుడ్ టాప్ హీరోల సరసన కూడా నటించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది. కీర్తి సురేష్ టాలీవుడ్ టాప్ హీరోల సరసన కూడా నటించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది. అప్పట్లో కీర్తి సురేష్‌ని వరుస హిట్స్ పలకరించిన ఇప్పుడు మాత్రం హిట్ దొరకడం కష్టంగా మారింది. గత కొంత కాలంగా టాలీవుడ్‌లో కూడా అవకాశాలు దక్కించుకోలేకపోతుంది. టాలీవుడ్ సినిమాలకు దూరంగా ఉంటు-న్న ఈ ముద్దుగుమ్మ.. కోలీవుడ్, బాలీవుడ్ లో మాత్రం పలు సినిమాలో నటిస్తూ బిజీ బిజీగా గడుపుతుంది. మొదట్లో పద్ధతిగా ఉన్న కీర్తి సురేష్ ఇటీవల గ్లామర్ డోస్ కూడా పెంచింది. పెళ్లయిన తర్వాత అమ్మడు గ్లామర్ షోలకు దూరంగా ఉంటుందని అంతా అనుకున్నారు దీనికి భిన్నంగా ముందుకంటే మరింతగా గ్లామర్ షోలు చేస్తూ రెచ్చిపోతుంది. గత సంవత్సరం అట్లీ- నిర్మాణంలో విడుదలైన బేబీ జాన్ చిత్రం ద్వారా హిందీలోకి అడుగుపెట్టింది కీర్తి సురేష్. ఆ చిత్రంతో కీర్తి బాలీవుడ్‌లో సత్తా చాటాలని అనుకుంది. కాని మూవీ పరాజయం చెందడంతో తిరిగి దక్షిణాది సినిమాలపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకుందిట. రీసెంట్ గా కీర్తి సురేష్ మరో జాక్‌పాట్ కొట్టినట్టు తెలుస్తోంది సార్, లక్కీ బాస్కర్ వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందనున్న చిత్రంలో కీర్తి సురేష్ హీరోయిన్ గా నటించనున్నారట. సూర్యా 46వ సినిమాగా ఈ చిత్రం రూపొందుతుండగా, ప్రస్తుతం ఈసినిమాకు సబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ నడుస్తోంది. 7 ఏళ్ల క్రితం సూర్య, కీర్తి సురేష్ కాంబినేషన్ లో గతంలో ఒక సినిమా వచ్చింది. విగ్నేష్ శివన్ దర్శకత్వంలో వచ్చిన ఓ సినిమాలో వీరిద్దరు జంటగా నటించారు. కాని ఆ సినిమా డిజాస్టర్ అయ్యింది. ఈ సినిమా వచ్చిన దాదాపు 7 సంవత్సరాల విరామం తర్వాత మళ్ళీ సూర్యతో కలిసి నటిస్తుంది. మరి ఈ చిత్రంతో అయిన అమ్మడి ఫేట్ మారుతుందా చూడాలి.

Printed published and owned by LANDE BHASKER .Printed at Karuna Sree publicationsH.no .3-135/24.Chityal Village,Tadwai Mandal, Telangana. And published from H.no.3-135/24, Chityal Village, Tadwai Mandal,Telangana.Editor - LANDE BHASKER.RNI TELTEL/2024/89275 . PHONE NO: 9542559271 E-MAIL ID: bhaskerlande20@gmail.com